


'రాజముద్ర' తెలుగు దినపత్రికలో
ప్రకటనల కోసం సంప్రదించగలరు
సెల్ : 9182 474 575



www.rajamudranews.com

# అక్షర రాజముద్ర

ప్రతి అక్షరం - ప్రజల కోసం | తెలుగు దిన పత్రిక

AKSHARA RAJAAMUDHRA | RNI No: TELTEL/2024/86684



విలేకరులు కావలెను

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.

సంప్రదించాల్సిన చిరునామా..

సెల్ : 9182 474 575



మేడ్చల్-మల్కాజ్‌గిరి | శుక్రవారం | 21.11.2025 | సంపుటి : 2 | సంచిక :287 | పేజీలు : 8 | వెల : 2/-

MEDCHAL-MALKAJGIRI | Friday | 21.11.2025 | volume : 2 | Issue : 287 | Pages : 8 | Cost : 2/-




సోషల్ మీడియా చర్చలో

## ఎగ్‌ఫ్రీజింగ్

ముందే దాచుకున్న అండాలతో ఎప్పుడైన గర్భం

ఉపాసనా కామినేని పోస్ట్‌తో ఇప్పుడు సర్వత్రా ఆసక్తి

04




## అమెరికా అభివృద్ధిలో వలసదారుల పాత్ర ఎనలేనిది

టెక్ రంగంలో వారి పాత్ర అద్భుతం : సుందర్ పిచాయ్

న్యూఢిల్లీ,నవంబర్ 20 : అమెరికాలో సృజనాత్మకతకు వలసదారులు చోద క శక్తిగా ఉన్నారని ఆల్ఫబెట్ (గూగుల్ మాతృసంస్థ) సీఈఓ

-మిగతా 2 లో..

# కేటీఆర్‌కు బిగ్ షాక్

## ఫార్ములా ఈ-కార్ రేసింగ్ కేసు విచారణకు గవర్నర్ అనుమతి

### త్వరలోనే ఏసీబీ ఛార్జీషీట్ దాఖలు

**ఫార్ములా ఈ-కార్ రేసింగ్ కేసులో మాజీ మంత్రి కేటీఆర్‌ను ఏసీబీ విచారించేందుకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అనుమతించారు. ఈ కేసులో ఇప్పటికే పలుమార్లు కేటీఆర్ ఏసీబీ విచారణకు హాజరయ్యారు. ఫార్ములా ఈ-కార్ రేసింగ్‌లో రూ.54.88 కోట్ల నిధుల దుర్వినియోగం జరిగినట్లు ఆరోపణలున్నాయి. ఈక్రమంలో కేటీఆర్ ప్రాసిక్యూషన్‌కు గవర్నర్ అనుమతి కోరుతూ గతంలో ఏసీబీ లేఖ రాసింది. ఆయన పాత్రపై సాక్ష్యాలు ఉన్నాయంటూ అందులో పేర్కొంది. ఈక్రమంలో తాజాగా ఏసీబీ అధికారులకు అనుమతి ఇస్తూ గవర్నర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఫార్ములా ఈ-కార్ రేసింగ్ కేసులో త్వరలోనే ఏసీబీ ఛార్జీషీట్ దాఖలు చేయనుంది.**



హైదరాబాద్, నవంబర్ 20 : మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కు బిగ్ షాక్ తగిలింది. ఈ ఫార్ములా -కారు రేసు కేసుకు సంబంధించి ఆయనపై విచారణ చేపట్టేందుకు గవర్నర్ అధికారికంగా అనుమతి మంజూరు చేశారు. ఈ కేసులోనిధుల దుర్వినియోగంపై విచారణ కొనసాగించేం దుకు గవర్నర్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. గవర్నర్ అనుమతితో ఏసీబీ త్వరలోనే కేటీఆర్‌పై చార్జ్‌షీట్ దాఖలు చేయనుందని సమాచారం. ప్రభుత్వం ఈ విషయంలో లేఖ రాయడంతో ఫార్ములా ఈ-కార్ రేసింగ్ కేసులో మాజీ మంత్రి కేటీఆర్‌ను ఏసీబీ విచారించేందుకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అనుమతించారు. ఈ కేసులో ఇప్పటికే పలుమార్లు కేటీఆర్ ఏసీబీ

-మిగతా 2 లో..




# బీహార్ సీఎంగా నితీశ్ ప్రమాణం

### 27మంది మంత్రులు కూడా ప్రమాణం

### ప్రమాణం చేయించిన గవర్నర్

### హాజరైన మోడీ, అమిత్ షా, చంద్రబాబు

**బిహార్ సీఎంగా జేడీయూ అధినేత నితీశ్ కుమార్ గురువారం ప్రమాణస్వీకారం చేశారు. సిఎంగా ఆయన ప్రమాణస్వీకారం చేయడం ఇది పదోసారి. పట్నాలోని గాంధీ మైదానంలో తీశ్‌తో పాటు 27 మంది మంత్రులు ప్రమాణస్వీకారం చేయగా.. సామ్రాట్ చౌదరీ, విజయ్ కుమార్ సిన్హాలకు డిప్యూటీ సీఎం పదవులు దక్కాయి.**

పాట్నా, నవంబర్ 20 : గవర్నర్ అరీఫ్ మహ్మద్ ఖాన్ సిఎం, మంత్రులతో ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీ, అమిత్ షా, ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు తదితరులు హాజరయ్యారు. బిహార్

-మిగతా 2 లో..



## తిరుపతి చేరుకున్న రాష్ట్రపతికి ఘన స్వాగతం

తిరుచానూరులో పద్మావతి అమ్మవారి దర్శనం

నేడు శ్రీవారిని దర్శించుకోనున్న ముర్ము

తిరుమల, నవంబర్ 20 : భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము గురువారం మధ్యాహ్నం రేణిగుంట విమానాశ్రయం చేరుకున్నారు. ఈ సందర్భంగా ఏపీ రాష్ట్ర హోమ్ మంత్రి

-మిగతా 2 లో..



# దేశమంతా సన్న బియ్యం

- కేంద్రమంత్రి ప్రల్హాద్ జోషికి సీఎం రేవంత్ సూచన
- ఎఫ్‌సీఐ తీసుకునే బాయిల్డ్ రైస్ కోటాను మరో 10 ఎల్ఎంటీలు పెంచాలి
- 'సన్న బియ్యం'పై అధ్యయనం చేసి నిర్ణయం తీసుకుంటామన్న కేంద్రమంత్రి

హైదరాబాద్, నవంబర్ 20 : దేశంలో ఎక్కడాలేని విధంగా తెలంగాణలో రేషన్ షాపుల్లో వినియోగదారులకు సన్న బియ్యాన్ని సరఫరా చేస్తున్నామని కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వివరించారు. గురువారం ఉదయం హోటల్ తాజ్‌కృష్ణలో కేంద్రమంత్రితో ముఖ్యమంత్రి రేవంత్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో సన్న బియ్యం పంపిణీ విషయాన్ని కేంద్రమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ప్రజలు తినే బియ్యాన్ని సరఫరా

-మిగతా 2 లో..

# గవర్నర్లు, రాష్ట్రపతికి గడువు విధించలేం

## గవర్నర్లకు మూడు అంశాల్లోనే నిర్ణయం

### కారణం చెప్పకుండా గవర్నర్లు బిల్లులను వెనక్కి పంపలేరు

### 'బిల్లుల' అంశంపై సుప్రీం కీలక తీర్పు

02

**రాష్ట్రాల శాసనసభలు ఆమోదించి పంపించిన బిల్లులకు సమ్మతి తెలిపే అంశంలో సుప్రీంకోర్టు గురువారం కీలక తీర్పు వెలువరించింది. ఈ విషయంలో రాష్ట్రపతి, గవర్నర్లకు న్యాయస్థానం గడువు విధించడంపై దేశ ప్రథమ పౌరురాలు ద్రౌపదీ ముర్ము సంధించిన ప్రశ్నలపై అత్యున్నత న్యాయస్థానం సమాధానమిచ్చింది. పెండింగ్ బిల్లుల ఆమోదం కోసం రాష్ట్రపతి, గవర్నర్లకు గడువును విధించడం తగదని సీజేఐ జస్టిస్ బి.ఆర్.గవాయ్ నేతృత్వంలోని రాజ్యాంగ ధర్మాసనం స్పష్టంచేసింది. అయితే, కారణం చెప్పకుండా గవర్నర్లు బిల్లులను వెనక్కి పంపలేరని వెల్లడించింది. ఈ మేరకు దీనిపై గతంలో ద్విసభ్య ధర్మాసనం ఇచ్చిన తీర్పును సీజేఐ ధర్మాసనం పక్కనబెట్టింది.**







## ఇద్దరు ఎమ్మెల్యేలు గైర్హాజరు

దానం, కడియంలకు మరోమారు నోటీసులు

పోచారం, అరికెపూడిలతో ముగింపు

హైదరాబాద్, నవంబర్ 20 : సుప్రీం మరో నాలుగు వారాల గడువు ఇవ్వడంతో పార్టీ ఫిరాయింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న 10 మంది ఎమ్మెల్యేలకు తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ నోటీసులు

-మిగతా 2 లో..

## జగన్ సీబీఐ కోర్టుకు..

వ్యక్తిగత హాజరుతో పూర్తయిన లాంఛనం

జగన్ రాకతో అభిమానుల హల్‌చల్



**అక్రమాస్తుల కేసులో వైకాపా అధ్యక్షుడు, మాజీ సీఎం జగన్ సీబీఐ ప్రత్యేక కోర్టుకు హాజరయ్యారు. న్యాయమూర్తి ఎదుట విచారణకు వచ్చారు. విజయవాడ నుంచి బేగంపేట ఎయిర్‌పోర్టుకు వచ్చి అక్కడి నుంచి నాంపల్లిలోని కోర్టుకు ఆయన చేరుకున్నారు.**

హైదరాబాద్, నవంబర్ 20 : విచారణ అనంతరం జగన్ అక్కడి నుంచి లోటస్‌పాండ్‌కు వెళ్లిపోయారు. మరోవైపు వైకాపా నేత పేర్ని నాని, మరో ముగ్గురు నేతలను కోర్టు లోపలికి పోలీసులు అనుమతించలేదు. దీంతో వారు గేట్ వద్దే నిలుచున్నారు. ఈ కేసులో 2013 సెప్టెంబర్ నుంచి

-మిగతా 2 లో..

## కేంద్ర మంత్రి బండి సంజయ్‌కు ఊరట

పదో తరగతి ప్రశ్న పత్రం లీకేజీ కేసు కొట్టివేసిన హైకోర్టు

మరో కేసులో నాంపల్లి కోర్టుకు హాజరైన బండి



హైదరాబాద్, నవంబర్ 20 : కేంద్ర హోమ్ శాఖ మంత్రి బండి సంజయ్‌కు తెలంగాణ హైకోర్టులో ఊరట లభించింది. గతంలో కమలాపూర్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసును గురువారం నాడు హైకోర్టు కొట్టేసింది. 2023లో 10వ తరగతి ప్రశ్నాపత్రం

-మిగతా 2 లో..

## భార్యాపిల్లల హత్య కేసు నిందితుడికి ఉరి

వికారాబాద్ జిల్లా కోర్టు సంచలన తీర్పు




వికారాబాద్, నవంబర్ 20 : భార్య, పిల్లల్ని దారుణంగా హత్య చేసిన కేసులో వికారాబాద్ జిల్లా కోర్టు సంచలన తీర్పు వెలువరించింది. నిందితుడికి ఉరిశిక్ష ఖరారు చేసింది. వికారాబాద్ జిల్లాలో 2019లో ప్రవీణ్ అనే వ్యక్తి తన భార్య, ఇద్దరు పిల్లల్ని చంపేశాడు. అనంతరం ఆత్మహత్యగా చిత్రీకరించాడు. అయితే, ఈ

-మిగతా 2 లో..

# గవర్నర్లు, రాష్ట్రపతికి గడువు విధించలేం

(మొదటిపేజీ తరువాయి)

ప్రకారం గవర్నర్‌కు విచక్షణాధికారం ఉందని వెల్లడించింది. తన ముందుకు వచ్చిన బిల్లులను గవర్నర్ రాష్ట్రపతికి పంపడం, అభిప్రాయాలతో తిరిగి పంపడం, బిల్లును పరిశీలించి సూచనలు ఇవ్వడం వంటివి మాత్రమే చేస్తారని తెలిపింది. రాష్ట్ర పరిపాలనలో తుది అధికారం ఎన్నుకోబడిన మంత్రివర్గానిదేనని స్పష్టం చేసింది. ఒక రాష్ట్రంలో రెండు ఎగ్జిక్యూటివ్ పవర్స్ ఉండవని, ప్రభుత్వం ఒక్కటే ప్రధాన నిర్ణయాధికారి అని తేల్చి చెప్పింది. రాష్ట్రాల శాసనసభలు ఆమోదించి పంపిన బిల్లులకు ఆమోదం తెలిపే విషయంలో న్యాయస్థానం రాష్ట్రపతి, గవర్నర్లకు గడువు విధించటంపై ఆర్టికల్ 143 కింద రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము పంపిన ప్రెసిడెన్షియల్ రిఫరెన్స్‌పై స్పందిస్తూ సుప్రీంకోర్టు ఈ తీర్పును వెలువరించింది. రాష్ట్ర శాసనసభలు ఆమోదించి పంపించిన బిల్లులకు సమ్మతి తెలిపే అంశంలో సుప్రీంకోర్టు గురువారం కీలక తీర్పు వెలువరించింది.



### సుప్రీం తీర్పులో కీలక అంశాలివే..

- గవర్నర్‌కు రాజ్యాంగపరంగా మూడు ఆప్షన్లు ఉంటాయి. 1. బిల్లులకు సమ్మతి తెలియజేయడం 2. కారణం చెప్పి బిల్లును రిజర్వ్‌లో పెట్టడం లేదా రాష్ట్రపతికి పంపడం 3. బిల్లును తిరస్కరించి అసెంబ్లీకి పంపడం ఈ మూడు ఆప్షన్లు ఎంచుకోవడంలో గవర్నర్ విచక్షణాధికారాన్ని ఉపయోగిస్తారు. ఇందుకు న్యాయస్థానాలు గడువు విధించడం సబబు కాదు.
- గవర్నర్ల విధుల నిర్వహణ వ్యవహారాల్లో కోర్టులు జోక్యం చేసుకోవు. కానీ, కారణం లేకుండా దీర్ఘకాలంగా బిల్లులను పెండింగ్‌లో ఉంచిన సందర్భాల్లో కోర్టులు పరిమిత విచక్షణతో వ్యవహరించొచ్చు. రాష్ట్రపతి విషయంలోనూ ఇదే వర్తిస్తుంది.
- నిరవధిక ఆలస్యం కొనసాగుతున్న సందర్భాల్లో అది న్యాయసమీక్ష పరిధిలోకి వస్తుంది.
- గవర్నర్ బిల్లును రాష్ట్రపతికి రిజర్వ్ చేసిన ప్రతిసారీ ఆర్టికల్ 143 కింద రాష్ట్రపతి సుప్రీంను సంప్రదించాల్సిన అవసరం లేదు.
- ఆర్టికల్ 200 కింద గవర్నర్లకు విచక్షణాధికారం ఉంటుంది. అయితే, దాన్ని అపరిమితంగా వినియోగించలేరు.

### పెండింగ్ బిల్లుల అంశం పూర్వాపరాలివీ..

శాసనసభలు ఒకటికి రెండుసార్లు ఆమోదించిన బిల్లులను గవర్నర్లు ఆమోదం తెలపకుండా కాలయాపన చేయడం, రాష్ట్రపతి పరిశీలనలో ఉన్నవీ తీవ్ర జాప్యానికి గురికావడంపై ఈ ఏడాది ఏప్రిల్‌లో సుప్రీంకోర్టు సంచలన నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈ అంశంలో గవర్నర్‌తో పాటు రాష్ట్రపతికీ గడువు విధించింది. గరిష్ఠంగా మూడు నెలల్లోగా ఆ బిల్లులను ఆమోదించడమో, తిప్పి పంపించడమో చేయాలని జస్టిస్ జె.బి.పార్దీవాలా, జస్టిస్ ఆర్.మహాదేవన్ ధర్మాసనం నిర్దేశించింది. దీంతో రాజ్యాంగ అధికరణం 143(1) ప్రకారం తనకున్న అధికారాన్ని వినియోగిస్తూ రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము మే నెలలో పలు ప్రశ్నలతో సీజేఐకి లేఖ రాశారు. రాష్ట్రపతి విచక్షణ అధికారాల పరిధిలోకి వచ్చే రాష్ట్రాల బిల్లులకు ఆమోదం తెలిపే అంశంలో న్యాయస్థానం గడువు విధించడం ఎంతవరకు న్యాయ సమ్మతమో తెలపాలంటూ సుప్రీంకోర్టు అభిప్రాయాన్ని కోరారు. దీనిపై సీజేఐ నేతృత్వంలోని రాజ్యాంగ ధర్మాసనం ఏర్పాటైంది. పది రోజుల పాటు అన్ని పక్షాల వాదనలను ఆలకించిన ధర్మాసనం సెప్టెంబరు 11న తీర్పు రిజర్వు చేసింది. ఈ విషయంలో రాష్ట్రపతి, గవర్నర్లకు గడువు విధించలేమంటూ తాజాగా తీర్పు వెలువరించింది.



## తిరుపతి చేరుకున్న రాష్ట్రపతికి ఘనంగా స్వాగతం

(మొదటిపేజీ తరువాయి)

వంగలపూడి అనిత, టీటీడీ ఉన్నతాధికారులతోపాటు కూటమిలోని పార్టీల నేతలు ఆమెకు ఘనస్వాగతం పలికారు. అనంతరం రోడ్డు మార్గం ద్వారా తిరుచానూరుకు రాష్ట్రపతి చేరుకున్నారు. తిరుచానూరులో కొలువు తీరిన శ్రీ పద్మావతి అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆ తర్వాత అమ్మవారి తీర్థ ప్రసాదాలను రాష్ట్రపతికి వేద పండితులు అందజేశారు. ఇక రాష్ట్రపతి పర్యటన సందర్భంగా తిరుచానూరు లో పటిష్టమైన భద్రతను ఏర్పాటు చేశారు. స్థానికుల రాకపోకలను నిలిపివేశారు. దాంతో స్థానికులు కొంత ఇబ్బంది పడ్డారు. ఇక తిరుచానూరు పర్యటన ముగించుకుని.. సాయంత్రం రోడ్డు మార్గం ద్వారా రాష్ట్రపతి తిరుమల చేరుకుంటారు. రాత్రికి పద్మావతి అతిథి గృహంలో ఆమె బస చేస్తారు. శుక్రవారం ఉదయం శ్రీవెంకటేశ్వర స్వామి వారిని రాష్ట్రపతి దర్శించుకోనున్నారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పర్యటన నేపథ్యంలో తిరుమలలో సైతం పటిష్టమైన భద్రతాను ఏర్పాటు చేశారు. తిరుపతి పర్యటన ముగిసిన అనంతరం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము హైదరాబాద్‌కు బయలుదేరి వెళ్లనున్నారు.




## బీహార్ సిఎంగా నితీశ్ ప్రమాణం

(మొదటిపేజీ తరువాయి)

అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి అదరగొట్టింది. మొత్తం 243 అసెంబ్లీ సీట్లకు నితీశ్ కుమార్ నేతృత్వంలో ఎన్డీయే ఏకంగా 202 సీట్లు దక్కించుకుంది. బీజేపీ 101 సీట్లలో పోటీ చేసి 89 చోట్ల గెలుపొందింది. 101 సీట్లలోనే పోటీ చేసిన జేడీయూ 85 చోట్ల విజయం సాధించింది. తాజాగా ప్రమాణస్వీకారం చేసిన 27 మంత్రుల్లో.. 14 మంది బీజేపీ నుంచి కాగా, 9 మంది జేడేయూకు చెందిన నేతలు. బిహార్‌లో సీఎం నితీశ్ కుమార్ దాదాపు 19 ఏళ్లు పదవిలో ఉన్నారు. 2000 సంవత్సరంలో ఏడు రోజులు మాత్రమే సీఎంగా పని చేశారు. ఇప్పుడు ఎన్డీయే కూటమి మళ్లీ ఆయనకే పగ్గాలు అప్పగించడంతో పదోసారి సీఎంగా ప్రమాణం చేశారు. పదోసారి బిహార్ సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన నితీశ్ కుమార్‌కు ప్రధాని నరేంద్ర మోదీ శుభాకాంక్షలు తెలిపారు. 'సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన నితీశ్ కుమార్‌కు నా హృదయపూర్వక శుభాకాంక్షలు. నితీశ్ రాజకీయంలో ఎంతో అనుభవం ఉన్న నాయకుడు. రాష్ట్రంలో మంచి పాలన అందించిన వ్యక్తి అనే అద్భుతమైన రికార్డు ఆయనకు ఉందని ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టారు.



## దేశవ్యాప్తంగా సన్నబియ్యం పంపిణీ చేయాలి

(మొదటిపేజీ తరువాయి)

చేస్తేనే సంక్షేమ పథకం ఉద్దేశం నెరవేరుతుందని ముఖ్యమంత్రి అన్నారు. తెలంగాణలాగే కేంద్రం కూడా దేశవ్యాప్తంగా సన్న బియ్యం పంపిణీ అంశాన్ని పరిశీలించాలని కేంద్రమంత్రిని కోరారు. అవసరమైతే అధ్యయనం చేసి తగు నిర్ణయం తీసుకోవాలని వినతి చేశారు. దీనిపై కేంద్రమంత్రి సానుకూలంగా స్పందించారు. పూర్తిస్థాయి అధ్యయనం తర్వాత పరిశీలించి దేశవ్యాప్తంగా సన్న బియ్యం పంపిణిపై నిర్ణయం తీసుకుంటామని కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషి వెల్లడించారు. ఈ సమావేశంలో రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## భార్యాపిల్లల హత్య కేసు నిందితుడికి ఉరిశిక్ష ఖరారు

(మొదటిపేజీ తరువాయి)

కేసులో నిందితుడిపై నేరం రుజువు కావడంతో జిల్లా కోర్టు అతడికి ఉరిశిక్ష విధించింది. ఈ మేరకు కేసును విచారించిన వికారాబాద్ జిల్లా కోర్టు సంచలన తీర్పు ఇచ్చింది. భార్య, పిల్లలను చంపిన కేసులో నిందితుడికి కోర్టు ఉరి శిక్ష ఖరారు చేసింది. 2019లో భార్య, ఇద్దరు పిల్లలను ప్రవీణ్ అనే వ్యక్తి చంపాడు. భార్య, పిల్లల హత్యను ఆత్మహత్యగా చిత్రీకరించాడు. ప్రవీణెళి భార్య, పిల్లలను చంపాడని రుజువు కావడంతో కోర్టు ఉరిశిక్ష విధించింది. పోలీసుల సమాచారం ప్రకారం.. ప్రవీణ్ కుమార్(32) వృత్తిరీత్యా ప్రయివేటు ఉద్యోగి. వికారాబాద్‌లో భార్యాపిల్లలతో కలిసి నివాసం ఉండేవాడు. భార్య చాందినీకి వివాహేతర సంబంధం ఉందన్న అనుమానంతో ఆమెను ఇనుపరాడ్‌తో కొట్టి చంపాడు. ఐదేండ్ల కుమార్తె ఇన్జిల్‌ను, తొమ్మిదేళ్ల కుమారుడు అయాన్ కూడా హతమార్చాడు. అయితే చాందిని ప్రవీణ్‌కు రెండో భార్య. కాగా కుమారుడు అయాన్ చాందినికి మొదటి భర్త సంతానం. ఇన్జిల్ మాత్రం ప్రవీణ్ కూతురే. ఇక భార్య చాందిని మొబైల్‌లో సందేశాలు చూసి ప్రవీణ్ తీవ్ర ఆగ్రహావేశాలకు లోనయ్యాడు. తరుచూ మద్యం సేవించి భార్యతో గొడవపడేవాడని దర్యాప్తులో బయటపడింది. ఈ క్రమంలోనే భార్యాపిల్లలను హత్య చేసినట్లు పోలీసులు నిర్ధారించారు. అయితే వారిని హత్య చేసిన అనంతరం తాను కూడా ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్నప్పటికీ పోలీసుల ఎదుట లొంగిపోయాడు. అనంతరం అతన్ని రిమాండ్‌కు తరలించారు. నేరం తీవ్రత, ఆధారాలను పరిశీలించిన వికారాబాద్ కోర్టు ఉరిశిక్ష విధిస్తూ తీర్పునిచ్చింది

# కేటీఆర్‌కు బిగ్ షాక్



**హైదరాబాద్, నవంబర్ 20 :** మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కు బిగ్ షాక్ తగిలింది. ఈ ఫార్ములా -కారు రేసు కేసుకు సంబంధించి ఆయనపై విచారణ చేపట్టేందుకు గవర్నర్ అధికారికంగా అనుమతి మంజూరు చేశారు. ఈ కేసులోనిధుల దుర్వినియోగంపై విచారణ కొనసాగించేం దుకు గవర్నర్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. గవర్నర్ అనుమతితో ఏసీబీ త్వరలోనే కేటీఆర్‌పై చార్జ్‌షీట్ దాఖలు చేయనుందని సమాచారం. ప్రభుత్వం ఈ విషయంలో లేఖ రాయడంతో ఫార్ములా ఈ-కార్ రేసింగ్ కేసులో మాజీ మంత్రి కేటీఆర్‌ను ఏసీబీ విచారించేందుకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అనుమతించారు. ఈ కేసులో ఇప్పటికే పలుమార్లు కేటీఆర్ ఏసీబీ విచారణకు హాజరయ్యారు. ఫార్ములా ఈ-కార్ రేసింగ్‌లో రూ.54.88 కోట్ల నిధుల దుర్వినియోగం జరిగినట్లు ఆరోపణలున్నాయి. ఈక్రమంలో కేటీఆర్ ప్రాసిక్యూషన్‌కు గవర్నర్ అనుమతి కోరుతూ గతంలో ఏసీబీ లేఖ రాసింది. ఆయన పాత్రపై సాక్ష్యాలు ఉన్నాయంటూ అందులో పేర్కొంది. ఈక్రమంలో తాజాగా ఏసీబీ అధికారులకు అనుమతి ఇస్తూ గవర్నర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఫార్ములా ఈ-కార్ రేసింగ్ కేసులో త్వరలోనే ఏసీబీ ఛార్జీషీట్ దాఖలు చేయనుంది. ఈ కేసులో కేటీఆర్‌ను ఏ-1 గా, సీనియర్ ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్ ను ఏ-2గా ఏసీబీ పేర్కొంది. ఇప్పటికే కేటీఆర్ ఈ కేసు విషయంలో ఏసీబీ విచారణకు నాలుగు సార్లు హాజరయ్యారు. ఈ కేసులో ఏ-2గా ఉన్న ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్ విషయంలో తదుపరి చర్యలు తీసుకోవాల్సిందిగా అధికారులు ఇప్పటికే కేంద్రంలోని డీఓపీటీకు లేఖ రాశారు. గవర్నర్ అనుమతి నేపథ్యంలో, చార్జ్‌షీట్ దాఖలుకు ముందు ఏసీబీ అధికారులు మరోసారి కేటీఆర్‌ను లేదా ఇతర కీలక వ్యక్తులను విచారించే అవకాశం ఉంది. ఈ కేసుపై గవర్నర్ అనుమతి లభించడంతో, రాజకీయ వర్గాలలో, పరిపాలనా వర్గాలలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఏసీబీ త్వరలో దాఖలు చేయబోయే చార్జ్‌షీట్‌తో ఈ కేసు విచారణ కీలక మలుపు తిరగనుంది. ఫార్ములా ఈ-కారు రేసులో క్విడ్ ప్రోకో జరిగినట్టు ఏసీబీ నివేదిక ఇచ్చిన విషయం తెలిసిందే. రూ.54.88 కోట్ల నిధులు దారి మళ్లింపుపై ఆరోపణలు చేసింది. ఇక, 2024లో ఫార్ములా ఈ-కారు కేసులో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. కార్ రేస్ వ్యవహారంలో 2024 డిసెంబర్ నెలలో ఏసీబీ కేసు నమోదు చేసిన సంగతి తెలిసిందే. మాజీ మంత్రి కేటీఆర్‌ను ఏ1గా ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారు. కేసు విచారణలో భాగంగా ఇప్పటికే కేటీఆర్‌ను రెండు సార్లు, ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్‌ను 3 సార్లు ఏసీబీ అధికారులు విచారించారు. తాజాగా ప్రభుత్వానికి నివేదికను సమర్పించా రు. కేసుకు సంబంధించిన నివేదికను అవినీతి నిరోధక శాఖ( ఏసీబీ) అధికారులు మంగళవారం తెలంగాణ ప్రభుత్వానికి అందించారు. ప్రాసిక్యూషన్ అనుమతి కోరుతూ ఏసీబీ అధికారులు ఈ నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి పంపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో కేటీఆర్ మున్సిపల్ శాఖ మంత్రిగా పనిచేశారు. ఈ నేపథ్యంలో కేటీఆర్‌ను ఈ కేసులో ఏ1గా పేర్కొంటూ ఏసీబీ కేసు నమోదు చేసింది. ఫార్ములా- ఈ కార్ రేసు నిర్వహణ కోసం యూకేకు చెందిన ఫార్ములా -ఈ ఆపరేషన్స్, ఏస్ నెక్ట్స్‌జెన్ ప్రైవేట్ లిమిటెడ్, తెలంగాణ పురపాల కశాఖ 2022 అక్టోబరు 25న ఒప్పందం చేసుకున్నాయి. ఈ ఒప్పందం ప్రకారం కార్ రేస్ నిర్వహణకు అయ్యే ఖర్చును స్పాన్సర్‌గా ఉన్న ఏస్ నెక్ట్స్ జెన్ ప్రైవేట్ లిమిటెడ్ భరించాలి. అలాగే కార్ రేసు నిర్వహణకు వీలుగా తెలంగాణ పురపాలక శాఖ ట్రాక్‌ను ఏర్పాటు చేయాలి. అందు లో భాగంగా 2023 ఫిబ్రవరి 11 జరిగిన రేస్ కోసం తెలంగాణ పురపా లక శాఖ తరుపున హెచ్ఎండీఏ రూ.12 కోట్లు ఖర్చు చేసింది. రేసు నిర్వహణ ఖర్చును స్పాన్సర్‌గా ఉన్న ఏస్ నెక్ట్స్ జెన్ భరించింది.

## అమెరికా అభివృద్ధిలో వలసదారుల పాత్ర ఎనలేనిది

(మొదటిపేజీ తరువాయి)

సుందర్ పిచాయ్ ప్రశంసించారు. టెక్ రంగంలో వలసదారుల పాత్ర అద్భుతమని వ్యాఖ్యానించారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మద్దతుదారులు హెచ్-1బీ వీసా విధానం రద్దుకు పట్టుబడుతున్న నేపథ్యంలో ఆల్ఫబెట్ సీఈఓ ఈ వ్యాఖ్యలు చేశారు. అమెరికా టెక్ రంగంలో వలసదారుల పాత్రపై ఆల్ఫబెట్ సీఈఓ సుందర్ పిచాయ్ బీబీసీ వార్తాసంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు కీలక వ్యాఖ్యలు చేశారు. 'టెక్ రంగం అభివృద్ధి చెందిన తీరును మీరు ఓసారి గమనించండి.. ఇందులో వలసదారుల పాత్ర చాలా గొప్పది' అని ఆయన అన్నారు. హెచ్-1బీ వీసాలో లోపాలను సరిదిద్దేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని అన్నారు. ప్రతిభావంతులను అమెరికాకు తీసుకొచ్చే విధంగా మార్పులు ఉంటాయని తాను భావిస్తున్నట్టు తెలిపారు. పైచదువుల కోసం అమెరికాకు వెళ్లిన సుందర్ పిచాయ్.. హెచ్-1బీ వీసాతోనే తన కెరీర్‌ను ప్రారంభించారు. ఆర్థిక, సాంకేతిక రంగాల్లో అభివృద్ధికి వలసలు అవసరమని కూడా గతంలో ఓసారి స్పష్టం చేశారు. ఇక టెక్ రంగ వ్యాపారవేత్తలకు రాజకీయ ప్రాముఖ్యత పెరుగుతుండటంపై ఎదురైన ప్రశ్నలకు కూడా సీఈఓ సుందర్ పిచాయ్ స్పందించారు. ట్రంప్ ప్రమాణస్వీకారంలో పలువురు టెక్ రంగ నిపుణులు పాల్గొనడంపై మాట్లాడారు. 'ఏఐ సాంకేతికత ఎంతో అద్భుతమైనది. ఇది ఆర్థికాభివృద్ధికి దోహదపడుతుంది. జాతీయ భద్రతా కారణాల దృష్ట్యా కూడా ఏఐకి ఎంతో ప్రాధాన్యం ఉంది. సమాజానికి ఏఐతో ప్రయోజనాలు కలిగేలా ప్రభుత్వంతో కలిసి పనిచేయాలి. సాంకేతికత దుర్వినియోగమయ్యే ముప్పుపై ప్రభుత్వంతో కలిసి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆలోచించాలని ఆయన అన్నారు.

## 10వ తరగతి ప్రశ్నాపత్రం లీకేజీ వ్యవహారం

(మొదటిపేజీ తరువాయి)

లీకేజీ వ్యవహారంపై ఈ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. ఇందులో బండి సంజయ్ పేరును ప్రధాన నిందితుడిగా కమలాపురం పోలీసులు చేర్చారు. రాజకీయ కక్షల కారణంగానే ఈ కేసు నమోదు చేశారని హైకోర్టుకు బండి సంజయ్ న్యాయవాది తెలిపారు. కేసు నమోదులో సరైన సెక్షన్లు కానీ.. దర్యాప్తులో పూర్తి వివరాలు కానీ లేవని హైకోర్టు ఈ సందర్భంగా స్పష్టం చేసింది. ఈ కేసును కొట్టేస్తూ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. ఇదిలావుంటే బండి సంజయ్ గురువారం నాంపల్లి ప్రజా ప్రతినిధుల కోర్టుకు హాజరయ్యారు. గతంలో తనపై నమోదైన పలు కేసుల నేపథ్యంలో విచారణ కోసం కోర్టు వెళ్లారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా బండి సంజయ్ పని చేసిన విషయం తెలిసిందే.ఆ సమయంలో నల్గొండలోని వడ్ల కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా బీఆర్ఎస్, బీజేపీ నేతల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. అలాగే హుజూర్‌నగర్ నియోజకవర్గం నేరేడుచర్ల లో బండి సంజయ్ కాన్వాయ్‌పై బీఆర్ఎస్ నేతలు రాళ్ల దాడి చేశారు. నాటి ఘటనల్లో బండి సంజయ్‌పై పోలీసులు మూడు కేసులు నమోదు చేశారు. ఈ కేసుల విచారణలో భాగంగానే కేంద్ర హోమ్ శాఖ సహాయ మంత్రి బండి సంజయ్.. నాంపల్లి ప్రజా ప్రతినిధుల కోర్టుకు హాజరయ్యారు. అయితే, విచారణ అనంతరం జనవరి 7వ తేదీకి ఈ కేసును న్యాయమూర్తి వాయిదా వేశారు.

## సిబిఐ కోర్టుకు హాజరైన జగన్

(మొదటిపేజీ తరువాయి)



జగన్ బెయిల్‌పై ఉన్నారు. ఇప్పుడు కూడా వ్యక్తిగత హాజరు నుంచి తనకు మినహాయింపు ఇవ్వాలని ఆయన కోరగా సీబీఐ తీవ్రంగా వ్యతిరేకించింది. ఆరేళ్లుగా జగన్ కోర్టుకు ప్రత్యక్షంగా హాజరవడం లేదని, ఈ కేసుల్లో డిశ్చార్జి పిటిషన్లపై రోజువారీ విచారణ జరుగుతున్నం దున ప్రత్యక్షంగా హాజరవ్వాలని సీబీఐ తెలిపింది. దీంతో ఈ నెల 21లోగా వ్యక్తిగతంగా హాజరవ్వాలని కోర్టు ఆదేశించింది. ఈ నేపథ్యంలో ఒకరోజు ముందే ఆయన కోర్టుకు హాజరయ్యారు. అక్రమాస్తుల కేసులో వైకాపా అధ్యక్షుడు జగన్ సీబీఐ కోర్టుకు హాజరుకానున్న నేపథ్యంలో బేగంపేట ఎయిర్-పోర్ట్ వద్ద వైకాపా కార్యకర్తలు హల్‌చల్ చేశారు. కొందరు రప్పా రప్పా అంటూ నినాదాలు చేశారు. ఎయిర్ పోర్టు లోపలికి చొచ్చుకెళ్లే ప్రయత్నం చేయగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో వారితో వాగ్వాదానికి దిగారు. మరోవైపు సీబీఐ కోర్టు వద్ద పెద్ద ఎత్తున పోలీసులు మోహరించారు.

## ఐ-బొమ్మ రవి తొలిరోజు కస్టడీ..

### బ్యాంక్ లావాదేవీలపై ఆరా

**హైదరాబాద్:** ఐ-బొమ్మ కేసులో అరెస్టయిన ఇమంది రవి మొదటి రోజు కస్టడీ ముగిసింది. ఆరు గంటలపాటు సీసీఎస్ పోలీసులు ప్రశ్నించారు. అతడి బ్యాంక్ లావాదేవీలపై ఆరా తీశారు. నెట్‌వర్క్, ఇంటర్నెట్ సోర్స్‌లపై విచారించారు. రవిపై ఫారెనర్స్ యాక్ట్ సెక్షన్‌ను కూడా జోడించారు. ఎన్ఆర్ఈ, క్రిప్టో కరెన్సీ, వ్యాలెట్లు, బ్యాంక్ ఖాతాలపై విచారణ చేశారు. వెబ్‌సైట్, ఐపీ అడ్రస్ సర్వర్లపైనా దృష్టి పెట్టారు. ఐబొమ్మ వెబ్‌సైట్ నడిపేందుకు రవి పలు ఐపీ అడ్రస్‌లు మార్చినట్లు పోలీసులు గుర్తించారు. ఇప్పటికే పలు కీలక ఆధారాలు రాబట్టిన పోలీసులు.. అతడిని మరో నాలుగు రోజుల పాటు విచారించనున్నారు.

## బాలకృష్ణకు మరో అరుదైన గౌరవం

### గోవా ఫిల్మ్ ఫెస్టివల్‌లో ఘనంగా సన్మానం



**అమరావతి, నవంబర్ 20 :** నటుడు నందమూరి బాలకృష్ణకు మరో అరుదైన గౌరవం దక్కింది. గోవా వేదికగా గురువారం వైభవంగా ప్రారంభమైన 'ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ ఇండియా'వేడుకలో బాలయ్యను సన్మానించారు. నటుడిగా 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా బాలకృష్ణకు ఈ గౌరవం దక్కింది. గోవా గవర్నర్ అశోక్ గజపతిరాజు, కేంద్ర సమాచార ప్రసారశాఖ సహాయ మంత్రి ఎల్.మురుగన్, గోవా సీఎం ప్రమోద్ సావంత్ బాలకృష్ణను శాలువాతో సత్కరించారు. 50 ఏళ్ల నట ప్రస్థానాన్ని పూర్తి చేసుకున్న రజనీకాంత్‌ను కూడా ముగింపు వేడుకలో సన్మానించనున్నారు. ఈ నెల 28 వరకూ ఈ వేడుక కొనసాగనుంది.



## ఫిరాయింపు ఎమ్మెల్యేపై విచారణ

(మొదటిపేజీ తరువాయి)

జారీ చేశారు. గురువారం పోచారం శ్రీనివాసరెడ్డి, అరికెపూడి గాంధీలను విచారించారు. పదిమందిలో ఇద్దరు ఎమ్మెల్యేలు మాత్రం ఇప్పటి వరకు అఫిడవిట్‌లు దాఖలు చేయని పరిస్థితి. ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కడియం శ్రీహరి.. స్పీకర్ నోటీసులకు స్పందించని విషయం తెలిసిందే. దీంతో వారిరువురికి స్పీకర్ మరోసారి నోటీసులు జారీ చేశారు. అనర్హత పిటిషన్లపై అఫిడవిట్ దాఖలు చేయాలని అసెంబ్లీ స్పీకర్ స్పష్టం చేశారు. ఇక.. పార్టీ ఫిరాయింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎమ్మెల్యేల విచారణ గురువారంతో ముగిసింది. కేసు విచారణ ఆలస్యంపై సుప్రీం సీరియస్ అవడంతో పాటు నాలుగు వారాలు గడువు ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో విచారణలో వేగం పెంచాలని అసెంబ్లీ స్పీకర్ నిర్ణయించారు. ఇందులో భాగంగా రెండో విడత విచారణలో భాగంగా నలుగురు ఎమ్మెల్యేలను విచారణకు పిలిచారు. ఉదయం ఎమ్మెల్యేల విచారణ మొదలైంది. పోచారం శ్రీనివాస్ రెడ్డి వర్సెస్ జగదీశ్ రెడ్డి కేసును స్పీకర్ విచారించారు. ఇరు వర్గాల వాదనలను స్పీకర్ విన్నారు. అలాగే మధ్యాహ్నం అరికెపూడి గాంధీ వర్సెస్ ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ కేసు విచారించారు. వీరి విచారణతో మొత్తం ఎనిమిది మంది ఎమ్మెల్యేల విచారణ పూర్తి అవుతుంది. మరోవైపు ఎమ్మెల్యే దానం నాగేందర్ ఢిల్లీ వెళ్లారు. ఏఐసీసీ పెద్దలను కలవనున్నారు. ఫిరాయింపు ఎమ్మెల్యేల విచారణ ముగియనున్నప్పటికీ ఇప్పటి వరకు దానం అఫిడవిట్లు దాఖలు చేయలేదు. విచారణకు హాజరైతే వేటు పడుతుందని దానం భావిస్తున్నట్లు తెలుస్తోంది. వేటు పడితే ఆరు సంవత్సరాల పాటు పోటీ చేయడానికి నో ఛాన్స్. ఈ క్రమంలో రాజీనామా చేసేందుకు దానం మొగ్గు చూపుతున్నట్లు సమాచారం. రాజీనామా చేస్తే తన పరిస్థితి ఏంటని పార్టీ పెద్దలతో దానం సంప్రదింపులు జరుపనున్నట్లు తెలుస్తోంది.

# సిగాచి మృతుల కుటుంబాలకు ధోకా

- వారికి ఇస్తానన్న కోటి పరిహారం ఏమైంది
- డెత్ సర్టిఫికెట్లు కూడా ఇవ్వకుండా కాలయాపన
- తక్షణం ఆదుకోవాలంటూ సిఎంకు హరీష్ రావు లేఖ

**హైదరాబాద్, నవంబర్ 20 :** సిగాచి బాధితులకు ఇస్తామన్న కోటి పరిహారం హామీ ఏమైందని ప్రశ్నిస్తూ సీఎం రేవంత్ రెడ్డికి మాజీ మంత్రి హరీశ్‌రావు బహిరంగ లేఖ రాశారు. నాలుగు నెలలు గడిచినా సిగాచి బాధితులకు పరిహారం అందకపోవడంతో.. ప్రభుత్వ నిర్లక్ష్యంపై హరీశ్ రావు ధ్వజమెత్తారు. ఇచ్చింది 26 లక్షలే.. ప్రభుత్వం బాకీ పడింది 74 లక్షలు.. ఇది ముఖ్యమంత్రి మాట తప్పడం కాదా? అని హరీశ్ రావు నిలదీశారు. కార్మికులకు రావాల్సిన పీఎఫ్, ఈఎస్ఐ, ఇన్సూరెన్స్ డబ్బులను కూడా ప్రభుత్వం ఇప్పించే నష్టపరిహారంలో చూపించడం ప్రభుత్వ దిగజారుడుతనానికి నిదర్శనం. రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గారు నిస్సిగ్గుగా బాధితులకు రూ. 40 నుండి 50 లక్షలు అందించాం అని ప్రకటించడం అత్యంత శోచనీయం అన్నారు.. చికిత్స ఖర్చులను పరిహారంలో కోత విధించడం అమానవీయం. ఆచూకీ దొరకని 8 మందికి డెత్ సర్టిఫికెట్లు ఇవ్వకపోవడం దుర్మార్గం. సిగాచి యాజమాన్యానికి అధికారులు ఏజెంట్లుగా మారారు. బాధితులను చీదరించుకోవడం దారుణం అని హరీశ్‌రావు పేర్కొన్నారు.కేంద్రం ప్రకటించిన రూ. 2 లక్షలు ఇప్పించే సోయి రాష్ట్ర ప్రభుత్వానికి లేదా? హైకోర్టు మొట్టికాయలు వేసినా యాజమాన్యాన్ని



ఎందుకు అరెస్టు చేయడం లేదు? తక్షణమే కోటి పరిహారం చెల్లించాలి.. లేదంటే బీఆర్ఎస్ పక్షాన ఉద్యమిస్తాం అని హరీశ్ రావు హెచ్చరించారు. పరిహారం కోసం బాధితుల చెప్పులు అరిగేలా తిరుగుతున్నా.. పాలకుల మనసు కరగడం లేదు. సిట్ వేయరు.. అరెస్టులు చేయరు.. నిస్సిగ్గుగా సిగాచి యాజమాన్యాన్ని కాపాడుతున్నది కాంగ్రెస్ ప్రభుత్వమే అని హరీశ్‌రావు మండిపడ్డారు. ప్రభుత్వ నిర్లక్ష్యంతో కార్మికుల కుటుంబాలు రోడ్డున పడ్డాయి. వారికి న్యాయం చేయాలని కోరారు. సంగారెడ్డి జిల్లా పాశమైలారం పారిశ్రామిక వాడలోని 'సిగాచి' పరిశ్రమలో ఘోర ప్రమాదం జరిగి, నాలుగు నెలలు గడిచింది. 54 మంది కార్మికులను పొట్టనపెట్టుకున్న నాటి దుర్ఘటన ఇంకా కళ్లముందే కదలాడుతున్నది. ఇంటి పెద్దను కోల్పోయిన కుటుంబ సభ్యులు నడి రోడ్డున పడి కన్నీరు మున్నీరవుతున్నాయి. సిగాచి ప్రమాద బాధిత కుటుంబాలను ఆదుకోవడంలో మీరు, మీ ప్రభుత్వం దారుణంగా విఫలమైందన్నారు. ప్రమాదం జరిగిన జూన్ 30న మీరు స్వయంగా వచ్చి, మృతుల కుటుంబాలకు రూ. కోటి చొప్పున పరిహారం అందిస్తామని ఘనంగా ప్రకటించారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందిస్తామని మీడియా సాక్షిగా హామీ ఇచ్చారు. కానీ నిజానికి ఏం జరిగింది? పరిహారాన్ని పరిహాసంగా మార్చారు. నాలుగు నెలలు గడిచినా పరిహారం అందని ద్రాక్షగానే మిగిలిపోయింది. డెత్ సర్టిఫికెట్ లేక ఆ కుటుంబాలకు బీమా డబ్బులు రాక, పరిహారం అందక నరకం అనుభవిస్తున్నారు. నిబంధనల పేరు చెప్పి, ఆచూకి దొరకని వారిని మృతులుగా పరిగణించడానికి 7 ఏళ్లు వేచి చూడమనడం మానవత్వం అనిపించుకుంటుందా? అన్నారు. మరోవైపు కేంద్ర ప్రభుత్వం తరఫున ప్రకటించిన రూ. 2 లక్షల ఎక్స్‌గ్రేషియా కూడా ఇప్పటికీ బాధితులకు అందలేదు. కేంద్రంతో మాట్లాడి ఆ డబ్బులు ఇప్పించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానికి లేదా అని ప్రశ్నించారు.

## దేవుడిని అడ్డం పెట్టుకుని సినిమాలు

- కనీస సామాజిక బాధ్యత లేని రాజమౌళి
- వారణాసి టైటిల్ వ్యాఖ్యలపై మండిపడ్డ మాధవీలత



**హైదరాబాద్, నవంబర్ 20 :** దర్శకుడు రాజమౌళి దేవుణ్ణి అడ్డంగా పెట్టుకొని డబ్బులు సంపాదిస్తున్నారని బీజేపీ నాయకురాలు మాధవిలత పేర్కొన్నారు. తాజాగా వారణాసి టైటిల్ రిలీజ్ సందర్భంగా రాజమౌళి చేసిన కామెంట్లపై మాట్లాడుతూ... నమ్మకాన్ని వ్యాపారంగా వాడుకుంటున్నారని మండిపడ్డారు. హిందువులు తేరగా దొరుకుతున్నారా? రాముడికి ఒకే పెళ్లాం ఉంది అంటున్న రాజమౌళికి ఎంతమంది పెళ్లాలు ఉన్నారని ప్రశ్నించారు. కర్మ ఫలితం అనుభవించాడు కాబట్టే ఆంజనేయుడు లేడని అన్నాడు.. సినిమా చూసే మా వాళ్లకు బుద్ధి ఉండాలని హిందువులను ఉద్దేశించి అన్నారు. వందల కోట్లు సంపాదించిన నీవు.. బాహుబలి సినిమాకి పనిచేసిన వారికి ఏమైనా ఇచ్చావా? అని నిలదీశారు. రాజమౌళి భక్తిని తీసుకురాలేదు? దాన్ని వాడుకుంటున్నారన్నారు. భక్తే లేదు అనే వాడి దగ్గరికి మనం వెళ్తామా? నీవు ఏమి దైవ సేవ చేశావ్.. అయిన దేవుడు అన్ని కోట్లు ఇచ్చాడు కదా..? అని నిలదీశారు. నీకు ఎందుకు అంతా బాధ.. మనమే మన హిందూ ధర్మాన్ని కించ పరుస్తున్నామన్నారు మాధవి లత.. 'మా కష్టం మీద విష బిందువు వేస్తున్నారు.. దయచేసి మీరు ఇలాంటి కామెంట్స్ చేయకు.. వ్యక్తి గతం అయితే ఇంట్లో మాట్లాడుకోవాలి.. ఆయన మాట్లాడింది వ్యక్తిగతం కాదు.. సినిమా వాళ్లు ఈ అంశంపై స్పందించక పోవడం వాళ్ల సొంతం.. అక్కినేని నాగేశ్వరరావు ఎప్పుడు దైవ దూషణ చేయలేదు.. మన మతం మీద మనమే సినిమాలు తీస్తూ దూసిస్తే ఎలా? సినిమా చూసే వాళ్లు కూడా భక్తి లేదని అనుకుంటే ఆయన వ్యాపారం తుస్సు మంటుంది.. ఆయనకు సామాజిక బాధ్యత లేదు.. టికెట్ కొనుక్కుని సినిమా చూసే వాళ్ళను అవమానించారు.. మనసు గాయ పరిచారు.. అందరూ నాస్తికులు అయితే నీ సినిమా చూసేది ఎవరు? నా దేవుళ్ళను ఒవైసీ బ్రదర్స్ అవమానించారని నేను రాజకీయాల్లోకి వచ్చాను.. నా దేవుళ్ళ పైకి ఎవరు వచ్చిన ఊరుకోను.. నాకు పదవి వచ్చిన రాకున్నా ఇలానే ఉంటా.. రాజమౌళి మాటల ప్రభావం పడుతుంది.. ఆంజనేయ స్వామిని అన్నావు కాబట్టే ఇప్పుడు నీకు చుట్టుకుంటుంది.. షూటింగ్ లలో దేవుణ్ణి ఇంకా ఏమన్నావో..? రాజమౌళితో సమాధానం భగవంతుడు ఇప్పిస్తారు.. దేవుడు ఉన్నాడు అని ఆయనతోనే చెప్పిస్తారు.. బస్తీ మే సవాల్ చూడండి.. ఆయన మీద జాలి కూడా పోయింది.. రాముడి మీద అసహ్యంగా మాట్లాడారు.. ఆయనకు క్షమాపణకు కూడా అర్హత లేదు.. తగిన గుణపాఠం చెప్పాలి..' అని రాజమౌళిపై ఫైర్ అయ్యారు.

## నేడు హైదరాబాద్‌కు రాష్ట్రపతి రాక

### రేపు తిరిగి పుట్టపర్తికి ముర్ము ప్రయాణం

**హైదరాబాద్, నవంబర్ 20 :** తిరుమల పర్యటన ముగించుకుని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శుక్రవారం మధ్యాహ్నం 1.10 గంటలకు ప్రత్యేక విమానంలో బేగంపేట ఎయిర్‌పోర్ట్‌కు చేరుకుంటారు. అక్కడి నుంచి నేరుగా ఆమె రాజ్ భవన్‌కు వెళ్తారు. మధ్యాహ్నం భోజనం చేసి.. రాజ్ భవన్‌లో విశ్రాంతి తీసుకుంటారు. ఆ తర్వాత 3:50 గంటలకు బొల్లారంలోని రాష్ట్రపతి నిలయానికి ఆమె చేరుకుంటారు. సాయంత్రం 4.00 గంటలకు రాష్ట్రపతి నిలయం వేదికగా నిర్వహించే భారతీయ కళా మహోత్సవాన్ని రాష్ట్రపతి ముర్ము ప్రారంభిస్తారు. తిరిగి సాయంత్రం 6:15 గంటలకు ఆమె తిరిగి రాజ్ భవన్‌కు చేరుకుంటారు. రాత్రి తెలంగాణ రాజ్‌భవన్‌లో రాష్ట్రపతి ముర్ము బస చేయనున్నారు. 22వ తేదీ అంటే.. శనివారం ఉదయం 9:30 గంటలకు బేగంపేట ఎయిర్ పోర్ట్ నుంచి ప్రత్యేక విమానంలో ఆంధ్రప్రదేశ్ శ్రీసత్యసాయి జిల్లాలోని పుట్టపర్తికి బయలుదేరి వెళ్తారు. శ్రీ సత్యసాయి బాబా శత జయంత్యోత్సవాల్లో రాష్ట్రపతి ముర్ము పాల్గొనున్నారు. రాష్ట్రపతి పర్యటన నేపథ్యంలో హైదరాబాద్‌లో పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు.



## కేటీఆర్, గోరటిలపై ఎన్నికల కేసు కొట్టివేత

**హైదరాబాద్, నవంబర్ 20 :** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్సీ గోరెటి వెంకన్నల కు తెలంగాణ హైకోర్టులో ఊరట దొరికింది. సైఫాబాద్ పోలీస్ స్టేషన్లో వారిద్దరిపై నమోదైన కేసును హైకోర్టు కొట్టివేసింది. ఎన్నికల కోడ్ ఉల్లంఘించారని నమోదైన కేసులో ఊరట లభించింది. 2023 ఎన్నికల సమయంలో తెలంగాణ సచివాలయం ఎదురుగా ఉన్న అమరవీరుల జ్యోతి వద్ద ఇంటర్వ్యూలు చేశారని కేటీఆర్, ఎమ్మెల్సీ గోరెటి వెంకన్నపై సైఫాబాద్ పోలీసులు కేసు నమోదు చేశారు. కోడ్ ఉల్లంఘిస్తూ అనుమతి లేకుండా డ్రోన్ ఎగురవేశారనీ పోలీసులు కేసు పెట్టారు. ఎన్నికల కోడ్ అమలులో ఉండగా.. ప్రభుత్వ పథకాలపై గోరెటి వెంకన్నను కేటీఆర్ ఇంటర్వ్యూ చేశారని విచారణ సందర్భంగా పోలీసుల తరఫు న్యాయవాది ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. బీఆర్ఎస్ పార్టీకి లబ్ది చేకూర్చే విధంగా ఆ ఇంటర్వ్యూ ఉందని తెలిపారు. అయితే, రాజకీయ లబ్ది కోసమే కేసు నమోదు చేశారని కేటీఆర్ తరఫు న్యాయవాది ధర్మాసనానికి తెలిపారు. ఇరువైపులా వాదనలు విన్న హైకోర్టు.. కేటీఆర్, గోరెటి వెంకన్నపై నమోదైన ఎఫ్ఐఆర్‌ను కొట్టివేస్తూ తీర్పునిచ్చింది.

## డిసెంబర్1న సామూహిహిక వందేమాతరం గీతాలపన

**హైదరాబాద్,నవంబర్ 20 :** డిసెంబర్ 1వ తేదీన పటాన్ చెరు పట్టణంలో నిర్వహించ తలపెట్టిన వందేమాతరం 150 వసంతాల సామూహిక గీతాలాపన కార్యక్రమ ఏర్పాట్లను పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి పరిశీలించారు. గురువారం సాయంత్రం వివిధ శాఖల అధికారులతో కలిసి పటాన్ చెరు పట్టణంలోని నొవపాన్ పరిశ్రమ సమీపంలో గల ఖాళీ స్థలంలో కార్యక్రమం నిర్వహించబోతున్నట్లు తెలిపారు.30 వేల మంది విద్యార్థులు ఒకే సమయాన సామూహిక గీతాలాపన చేసేలా కార్యక్రమాన్ని తీర్చిదిద్దినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొనే ప్రతి ఒక్కరికి ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పూర్తిస్థాయి ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో పటాన్ చెరు డీఎస్పీ ప్రభాకర్, సీఐ వినాయక్ రెడ్డి, జాతీయ రహదారుల సంస్థ డీఈ రామకృష్ణ, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, మండల విద్యా శాఖ అధికారి నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

# క్రికెటర్ స్మృతి మందాన పెళ్లి

- బాలీవుడ్ సింగర్ పలాశ్ ముచ్చల్‌తో ఏడడుగులు
- 23న పెళ్లి అంటూ కొత్త జంటకు శుభాకాంక్షలు చెప్పిన ప్రధాని





**న్యూఢిల్లీ, నవంబర్ 20 :** మహిళలవరల్డ్ కప్ విజేత స్మృతి మంధాన పెళ్లి తేదీ వచ్చేసింది. ప్రపంచకప్ టోర్నీ ముగిసినప్పటి నుంచి మంధాన వివాహంపై వస్తున్న కథనాలకు ఎట్టకేలకు వెడ్డింగ్ కార్డ్‌తో ఎండ్ కార్డ్ పడింది. బాలీవుడ్ సింగర్ పలాశ్ ముచ్చల్‌తో ఈ ముద్దుగుమ్మ ఏడడుగులు నడువనుందనే వార్తలు వినిపించాయి. నవంబర్ 23 ఆదివారం ఈ స్టార్ జంట మూడుముళ్ల బంధంలోకి అడుగుపెట్టనుంది. ఈ విషయాన్ని ఏకంగా ప్రధాని నరేంద్ర మోడీ ధ్రువీకరించడం విశేషం. కాబోయే దంపతులకు శుభాకాంక్షలు తెలిపిన మోడీ.. పెళ్లి తేదీని బహిర్గతం చేశారు. భారత మహిళల జట్టు వైస్ కెప్టెన్ స్మృతి మంధాన ఈమధ్య నెట్టింట తెగ వైరలైంది. వరల్డ్ కప్‌లో తన ఆటతో పాటు ఆమె పెళ్లి పత్రిక కూడా సోషల్ మీడియాలో తెగ తిరిగింది. నవంబర్ 20వ తేదీన స్మృతి-పలాశ్ వివాహం అంగరంగ వైభవంగా జరగనున్నట్లు ప్రచారం జరిగింది. అంతేనా.. వీరి వివాహ ఆహ్వాన పత్రిక సోషల్ మీడియాలో వైరలైంది కూడా. మహారాష్ట్రలోని స్మృతి మంధాన స్వస్థలం సాంగ్లీలో జరగనుందని.. ఇప్పటికే పలువురికి ఆహ్వానాలు కూడా అందాయని కథనాలు వచ్చాయి. అవన్నీ ఇప్పుడు నిజం కాబోతున్నాయి. కాకపోతే పెళ్లి తేదీ 20 నుంచి 23కు మారిందంతే. ప్రధాని నరేంద్ర మోడీ శుభాకాంక్షల సందేశంతో ఈ విషయం బయటకొచ్చింది. 'స్మృతి మంధాన, పలాశ్ ముచ్చల్ నవంబర్ 23న పెళ్లి చేసుకోబోతున్నారని తెలిసి సంతోషిస్తున్నా. ఈ శుభసందర్భంగా ఇరుకుటుంబాలకు నా హృదయపూర్వక ధన్యవాదాలు. ఒక్కరిగా ఉంటూ..ఒకరి సమక్షంలో ఒకరు ఐకమత్యంగా ఉంటూ సాగాలని కోరుకుంటున్నా. వారి లక్ష్యాలు నెరవేరాలని, జంటగా వృద్ధి సాధించాలని, పరస్పర అవగాహనతో వీరిద్దరి జీవితం ఆనందమయం కావాలని ఆశిస్తున్నా. మంధాన, పలాశ్‌లు నమ్మకంతో కొత్త జీవితాన్ని ఆరంభించనున్నారు. ఒకరికొకరు మద్దతుగా ఉంటూ, బాధ్యతగా వ్యవహరిస్తూ.. ప్రేమానురాగాలతో వర్ధిల్లాలి' అని మోదీ తన సందేశంలో పేర్కొన్నారు. ఇటీవలే ఇండోర్‌లోని ప్రెస్ క్లబ్‌లో 'మంధానతో మీ అనుబంధం గురించి చెప్పండి?స అని జర్నలిస్టులు పలాశ్‌ను అడిగారు. అందుకు .. 'మంధాన త్వరలోనే ఇండోర్ కోడలు కాబోతోంది. ఇప్పుడు మీకు ఈ విషయం మాత్రమే చెప్పగలను. ఇంకేం చూస్తున్నారు.. మీకు హెడ్‌లైన్ ఇచ్చేశాను' అని పలాశ్ బదులిచ్చాడు. అతడి మాటలతో ఇరువురి పెళ్లిపై స్పష్టత వచ్చేసింది. అయితే.. వరల్డ్ కప్‌లో ఆడతున్న మంధాన కూడా ఈ విషయంపై స్పందించాల్సి ఉంది. ప్రపంచ కప్ ముందు ఆస్ట్రేలియాపై రెండు శతకాలతో చెలరేగిన మంధాన ఐసీసీ 'ప్లేయర్ ఆఫ్ ది మంత్' అవార్డ్ విజేతగా నిలిచింది. ఏడాది జూలై 19, శనివారం ఈ డాషింగ్ ఓపెనర్ 29వ వసంతంలో అడుగుపెట్టింది. ఈ సందర్భంగా పలాశ్ తన కలల రాణికి తన మనసుపుస్తకాన్ని ఆవిష్కరిస్తూ పుట్టిన రోజున శుభాకాంక్షలు తెలిపాడు. మన ప్రయాణం మొదలైనప్పటి నుంచి నువ్వే నా ప్రశాంతత. నా కన్ఫ్యూజన్ కూడా. నా బిగ్గెస్ట్ చీర్ లీడర్ నువ్వే. నాలో స్ఫూర్తిని నింపేది కూడా నీవే. ఒత్తిడిలోనూ కూల్‌గా ఉండడం నిన్ను చూసే నేర్చుకున్నా. హ్యాపీ బర్త్ డే స్మృతీ' అంటూ తన ప్రేమ సందేశాన్ని రాసుకొచ్చాడు. మనసైనోడి నుంచి విషెస్ అందుకున్న మంధాన.. నువ్వే నా హార్ట్ బీట్ అనే అర్థం వచ్చేలా 'థ్యాంక్యూ మై బాయ్' అనే పోస్ట్‌కు లవ్ ఎమోజీలతో బదులిచ్చింది.

### కేటీఆర్‌పై అక్రమ కేసులు

## రేవంత్ లక్ష్యం

- రాజకీయ కక్ష సాధింపునకు పరాకాష్ట
- బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు విమర్శ

**హైదరాబాద్, నవంబర్ 20 :** హైదరాబాద్ బ్రాండ్ ఇమేజీని పెంచిన కేటీఆర్‌పై అక్రమ కేసులు బనాయించి ఇబ్బంది పెట్టడమే రేవంత్ రెడ్డి లక్ష్యంగా పెట్టుకున్నాడని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు విమర్శించారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎప్పటికప్పుడు ఎండగడుతున్న కేటీఆర్‌పై అక్రమ కేసులు బనాయించి రాక్షసానందం పొందటం అప్రజాస్వామికమన్నారు. కేటీఆర్‌పై రాజకీయ కక్ష సాధింపు చర్యలకు ఇది పరాకాష్ఠ అని ఆయన విమర్శించారు. ఈ ప్రభుత్వం ప్రశ్నించే వారి గొంతులు నొక్కే ప్రయత్నం చేస్తోందన్నారు. ప్రతిపక్ష నేతలను వేధించడమే సీఎం రేవంత్‌రెడ్డి పనిగా పెట్టుకున్నారు. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ పెంచిన కేటీఆర్‌పై అక్రమ కేసులు పెట్టారు. స్థానిక ఎన్నికల్లో రాజకీయ లబ్ది కోసం చిల్లర డ్రామాలు చేస్తున్నారు. కేటీఆర్‌కు అండగా ఉంటాం అని హరీశ్‌రావు అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల వేళ రాజకీయ లబ్ది పొందేందుకు చేస్తున్న చిల్లర డ్రామాలను ప్రజలు గమనిస్తున్నారని చెప్పారు. అక్రమ కేసులతో కేటీఆర్, బీఆర్ఎస్ నాయకుల మనోస్థైర్యాన్ని దెబ్బతీయలేరని ఎక్స్ వేదికగా వెల్లడించారు. 'మా పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై రాజకీయకక్ష సాధింపు చర్యలకు పరాకాష్ట ఇది. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉండి ప్రశ్నించే గొంతులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నొక్కే ప్రయత్నం చేస్తుండటం దుర్మార్గం. పూర్తి పారదర్శకతతో నిర్వహించిన ఫార్ములా ఈ-రేస్‌లో రెండేళ్లుగా కోడిగుడ్డుపై ఈకలు పీకుతున్నది కాంగ్రెస్ సర్కార్. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజీని పెంచిన కేటీఆర్‌పై అక్రమ కేసులు బనాయించి ఇబ్బంది పెట్టడమే లక్ష్యంగా పెట్టుకున్నడు రేవంత్ రెడ్డి. ప్రభుత్వ వైఫల్యాలను ఎప్పటికప్పుడు ఎండగడుతున్న కేటీఆర్ పై అక్రమ కేసులు బనాయించి రాక్షసానందం పొందటం అప్రజాస్వామికం. స్థానిక సంస్థల ఎన్నికల వేళ రాజకీయ లబ్ది పొందేందుకు చేస్తున్న చిల్లర డ్రామాలను ప్రజలు గమనిస్తున్నారు. అక్రమ కేసులతో కేటీఆర్, బిఆర్ఎస్ నాయకుల మనోస్థైర్యాన్ని దెబ్బతీయలేరు. కేటీఆర్‌కు బీఆర్ఎస్ పార్టీ పూర్తి అండగా ఉంటుంది. రేవంత్ రెడ్డి దుర్మార్గ వైఖరిని న్యాయపరంగా ఎదుర్కొంటాం.' అని ట్వీట్ చేశారు.

## కేటీఆర్‌పై రాజకీయ కక్షసాధింపు

- స్థానిక ఎన్నికల ముందు ప్రభుత్వం కుట్ర
- మండిపడ్డ బిఆర్ఎస్ నేతలు వేముల, వినోద్



**హైదరాబాద్, నవంబర్ 20 :** బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై కక్ష సాధింపు చర్యలను మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. బీఆర్ఎస్ పార్టీని కట్టడి చేయడానికి బీజేపీ, కాంగ్రెస్ కలిసి కేటీఆర్‌పై కుట్రలు చేస్తున్నాయని ఆయన మండిపడ్డారు. ఎలాంటి అవినీతి జరగని ఫార్ములా ఈ కార్ రేస్‌లో విచారణకు ఏసీబీ అనుమతి ఇస్తూ గవర్నర్ అనుమతి తెలపడంతో కాంగ్రెస్, బీజేపీలు కలిసి కేటీఆర్‌పై కుట్రలు చేస్తున్నాయనేది తేటతెల్లామైంది. ఇచ్చిన హామీలు అమలు చేయలేక ప్రజల్లో ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత వచ్చినపుడు, ఎన్నికలు వచ్చినపుడు ఇలాంటి కేసుల అంశాన్ని తెరపైకి తెచ్చి రేవంత్ రెడ్డి డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నాడు అని ప్రశాంత్ రెడ్డి ధ్వజమెత్తారు. రెండేండ్లుగా ఫార్ములా ఈ రేస్‌పై విచారణ పేరుతొ కొండను తవ్వి ఎలుకను పట్టలేకపోయారు. ఇప్పుడు మళ్ళీ స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ వైఫల్యాల నుండి ప్రజల దృష్టిని మరల్చేందుకు కక్షపూరిత రాజకీయాలకు కాంగ్రెస్ తెరలేపింది. అందులో భాగంగానే విచారణ పేరిట కేటీఆర్‌ను ఇబ్బంది పెట్టాలని రేవంత్ రెడ్డి చూస్తున్నాడు. ఫార్ములా ఈ కార్ రేస్‌తో హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ని పెంచి తెలంగాణ రాష్టాన్ని ప్రపంచ వ్యాప్తం చేసిండు కేటీఆర్. అక్రమ కేసులతో కేటీఆర్, బిఆర్ఎస్ నాయకులను కట్టడి చేయగలం అనుకోవడం పొరపాటే. మీరెన్ని అక్రమ కేసులు పెట్టిన ప్రజలకు ఇచ్చిన హమీలు అమలు అయ్యేవరకు, కాంగ్రెస్ పార్టీ వైఫల్యాలను ప్రజల్లో ఎండగడుతూనే ఉంటాం. కేటీఆర్‌కు బీఆర్ఎస్ పార్టీ పూర్తి అండగా ఉంటుందని ప్రశాంత్ రెడ్డి పేర్కొన్నారు. న్యాయస్థానాలపై మాకు పూర్తి నమ్మకం ఉంది.. మీరు చేసే కుట్రలను న్యాయస్థానాల్లో ఎదుర్కొంటాం అని ఆయన పేర్కొన్నారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై రాజకీయ కక్ష సాధింపు చర్యలు సరికాదు అని మాజీ ఎంపీ వినోద్ కుమార్ అన్నారు. సమాజంలో ప్రజల అంశాలపై ప్రశ్నించే గొంతులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నొక్కే ప్రయత్నం చేయడం రాజ్యాంగ విరుద్ధం అని మండిపడ్డారు. పూర్తి పారదర్శకతతో నిర్వహించిన ఫార్ములా ఈ రేస్‌లో రెండేళ్లుగా కోడిగుడ్డుపై ఈకలు పీకుతున్నది కాంగ్రెస్ సర్కార్ అని విమర్శించారు. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజీని పెంచిన కేటీఆర్‌పై అక్రమ కేసులు బనాయించి ఇబ్బంది పెట్టడమే లక్ష్యంగా పెట్టుకున్నడు రేవంత్ రెడ్డి అని వినోద్ కుమార్ ధ్వజమెత్తారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎప్పటికప్పుడు ఎండగడుతున్న కేటీఆర్‌పై అక్రమ కేసులు బనాయించి రాక్షసానందం పొందటం అప్రజాస్వామికం. అక్రమ కేసులతో కేటీఆర్, బిఆర్ఎస్ నాయకుల మనోస్థైర్యాన్ని దెబ్బతీయలేరు. సీఎం రేవంత్ రెడ్డి కుట్రలను న్యాయపరంగా ఎదుర్కొంటాం అని వినోద్ కుమార్ పేర్కొన్నారు.

## దేవుళ్ల పేరుతో సినిమాలు తీస్తావ్

- నమ్మకం లేదంటావా రాజమౌళి
- మండిపడ్డ ఎమ్మెల్యే రాజాసింగ్



**హైదరాబాద్, నవంబర్ 20 :** రాజమౌళి ప్రతి సినిమాను హిందూ సమాజం బహిష్కరించాలని ఎమ్మెల్యే రాజాసింగ్ పిలుపునిచ్చారు. ఇటీవల ఓ ఈవెంట్‌లో భాగంగా రాజమౌళి చేసిన వ్యాఖ్యలపై తాజాగా రాజాసింగ్ స్పందించారు. ప్రస్తుతం డైరెక్టర్ రాజమౌళికి సంబంధించిన ఓ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారుతోందన్నారు.. తన అమ్మానాన్నలకు హనుమంతుడిపై విశ్వాసం ఉంది కానీ.. తనకు లేదని రాజమౌళి అన్న మాటలను రాజాసింగ్ గుర్తు చేశారు. నీకు విశ్వాసం లేదు కానీ.. అదే ధర్మం, దేవుళ్లపై సినిమాలు చేసి.. రూ. కోట్లల్లో సంపాధించుకున్నావు కదా..? అని ప్రశ్నించారు. అసలు నీ ప్లాన్ ఏంది..? ఇప్పుడు వారణాసి పేరుతో మహేష్‌బాబును పెట్టి మరో సినిమా తీస్తున్నావ్.. ఈ మూవీ ప్రమోషన్‌లో భాగంగా ఈ వ్యాఖ్యలు చేశావా? అని నిలదీశారు. లేదా నువ్వు నిజంగానే నాస్తికుడివా..? ఓ సారి డిక్లేర్ చేయ్యాలని డిమాండ్ చేశారు. అసలు నీ తప్పేం లేదు.. అసలు తప్పు హిందులదే అన్నారు. నీలాంటి నీఛపు డైరెక్టర్లను హిందువులు కనుగొనలేక పోతున్నారన్నారు. ధర్మం పట్ల, హిందూ దేవుళ్ల పట్ల నమ్మకం లేని రాజమౌళి సినిమాలు హిందువులు ఎందుకు చూడాలని రాజాసింగ్ నిలదీశారు. 'బాహుబలి సినిమా తీశావు.. ప్రభాస్‌తో శివలింగాన్ని ఎత్తించావు.. కోట్ల రూపాయలు సంపాధించుకున్నావు.. మళ్లీ మా హిందు దేవుళ్లపై నమ్మకం లేదని చెబుతున్నావు. రాజమౌళికి ఇది కొత్తేం కాదు.. భగవాన్ శ్రీకృష్ణుడికి చెందిన 16 వేల మంది దాసులను, లవర్స్ అంటూ హేళన చేశాడు. నాకు రాముడిపైన ఇష్టం లేదు.. రాముడి స్టోరీ బోరింగ్ స్టోరీ అని గతంలో ట్వీట్ చేశాడు. ఇప్పుడు హనుమంతుడిపైన కామెంట్స్ చేశాడు.. హిందువులకు ఓ సూచన.. ఇలాంటి డైరెక్టర్లపై కంప్లేంట్ ఇవ్వండి. ఇలాంటి వ్యక్తులను జైల్లో వేస్తేనే హిందూ దేవుళ్లపై కామెంట్స్ చేస్తే ఏం జరుగుతుందో తెలుస్తుంది. ఇలాంటి పనికిరాని డైరెక్టర్ సినిమాలు చూడొద్దు.. మనం ఇలాంటి వ్యక్తులు తీసిన సినిమాలు చూస్తాం.. వాళ్లు వందలు వేల రూపాయలు సంపాధించుకుంటారు. ఇలా నాస్తికత్వం పేరుతో మన దేవుళ్లపై కామెంట్స్ చేస్తారు.. అందుకే ఈ డైరెక్టర్ సినిమాలు బ్యాన్ చేద్దాం..' అని రాజాసింగ్ వ్యాఖ్యానించారు.

## హిందూసమాజాన్ని వేదనకు గురి చేసిన రాజమౌళి

- క్షమాపణలు చెప్పకుంటే సినిమాలు ఆపేస్తాం
- విశ్వహిందూ పరిషత్ క్షేత్ర కార్యదర్శి తనికెళ్ల సత్య రవికుమార్

**హైదరాబాద్, నవంబర్ 20 :** హనుమంతుడుపై టాలీవుడ్ సినీ దర్శకుడు ఎస్ఎస్ రాజమౌళి చేసిన వ్యాఖ్యలపై క్షమాపణలు చెప్పకపోతే.. కచ్చితంగా ఆయన సినిమాలు ఆపేస్తాం అంటూ విశ్వహిందూ పరిషత్ హెచ్చరించింది. తండ్రి మనోభావాలను సైతం కించపరుస్తూ మాట్లాడారని విశ్వహిందూ పరిషత్ తెలుగు రాష్ట్రాల క్షేత్ర కార్యదర్శి తనికెళ్ల సత్య రవికుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రాముడు, కృష్ణుడు, హనుమంతుడు దేవుళ్లుగా కనిపించలేదా? అని ప్రశ్నించారు. హిందూ సమాజం చూస్తూ ఊరుకోదని దర్శకుడు రాజమౌళిని రవికుమార్ హెచ్చరించారు. రాజమౌళి వ్యాఖ్యలు హిందూ సమాజాన్ని తీవ్ర వేదనకు గురిచేశాయని పేర్కొన్నారు. 'ప్రముఖ దర్శకుడు రాజమౌళి గారు హిందూ సమాజం ముందు గల్లీ స్థాయి వ్యక్తిగా దిగజారిపోయారు. హనుమంతుడికి, మీ క్లిప్స్ రిలీజ్ అవకపోవడానికి సంబంధం ఏంటి?. కృష్ణుడు నీ దృష్టిలో జగద్గురువు కాదు. రాముడు, కృష్ణుడి, హనుమంతుడిపై మీరు చేసిన విమర్శలను విశ్వహిందూపరిషత్ ఖండిస్తుంది. మీ వ్యాఖ్యలను ధర్మ ద్రోహంగా భావిస్తాం. అంజనేయ స్వామిని నిందించడం మీకు ఫ్యాషన్‌గా మారింది. మదం, గర్వంతో మాట్లాడిన ప్రేలాపనలుగా భావిస్తాం.మీ తండ్రిని కూడా బాధించేలా మాట్లాడావు. మీ ప్రచారాలకు, మీ క్లిప్స్ కి హనుమంతుడికి సంబంధం ఏమిటి. కాసుల గర్వంతో మాట్లాడితే విశ్వహిందూ పరిషత్ క్షమించదు. బేషరతుగా హిందూ సమాజానికి క్షమాపణలు చెప్పు. దైవాన్ని అపహాస్యం చేసేలా మీ సినిమాల్లో ఉంటే.. విశ్వహిందూ పరిషత్ ఆ సినిమాలు ఆపేస్తుంది' అని సత్య రవికుమార్ వార్నింగ్ ఇచ్చారు.

# రాజకీయమంటే హంగామా చేయడమా!



**రాజకీయాలు పూర్తిగా కలుషితమయ్యాయి. నేరచరిత్ర ఉన్నవారు కూడా హంగామా చేస్తున్నారు. కోర్టులో కేసుకు హాజరు కావడం కోసం హంగామా చేయడం దారుణం కాక మరోటి కాదు. దానికోసం పోలీసులు హైరానా పడడం, భారీగా బందోబస్తు ఏర్పాటు చేయడం పరిపాటిగా మారింది. వీరికోసం ప్రజలకు రక్షణగా ఉండాల్సిన పోలీస్ సిబ్బంది సమయాన్ని, శక్తిని వృధా చేస్తున్నారు. తాజాగా హైదరాబాద్‌లో సిబిఐ కోర్టుకు హాజరయ్యేందుకు వచ్చిన జగన్ యధావిధిగా తన మార్క్ హంగామాతో వచ్చారు. పదినిముషాల పాటు కోర్టులో హాజరు కావడానికి మందీబార్బలంతో రావడం, ఇతరులకు అసౌకర్యం కలిగించడం, ఆయన గారి కోసం పోలీసులు నానా హడావిడి చేయడం, రక్షణ కోసం అంటూ జనాన్ని రోడ్డుమీది నుంచి తరిమెయ్యడం లాంటివి చూశాం. గురువారం హైదరాబాద్‌లో జగన్ చేసిన హంగామా చూశాక ఇలాంటి నేతలను ఎన్నకుందుకు ప్రజలు సిగ్గుపడాలి. మన ఓట్లతో వీరు ఊరేగడమేంటని ఆలోచన చేయాలి. జగన్ ఎన్నికయ్యాక ఇప్పటి వరకు అసెంబ్లీకి రావడం లేదు. అలాగే ప్రతిపక్షనేత హోదా ఇస్తేనే వస్తానని మొండి కేశారు. ఇక విశాఖ వచ్చినా, గుంటూరుకు వెళ్లినా ఇదే రకంగా హంగామా చేశారు. ఆయన ర్యాలీగా వచ్చే తోవలో ప్రాణాలు పోగ్గొట్టుకుంటే మాకేంది అన్న రీతిలో జగన్ అహంకారంగా సాగుతున్నారు.**

ఇకపోతే గతంలో కెటిఆర్ కూడా ఒకటి రెండు సందర్భాల్లో ఇలాగే చేశారు. ఇ- కార్ రేసులో విచారణకు వచ్చిన ప్పుడు, మరో సందర్భంలో ఇలా చేశారు. భారీ కాన్వాయ్‌లతో రావడం, హంగామా చేయడం అవసరమా అన్నది ఆలోచన చేయాలి. కోర్టులు ఆంక్షలు విధిస్తే తప్ప వీరు ర్యాలీలు ఆపేలా లేరు. కనీసం కోర్టుకు విచారణకోసం వచ్చే సందర్భంలో అయినా కోర్టులే ఆంక్షలు విధిస్తే మంచిందని ప్రజలు కోరుకుంటున్నారు. అధికారంలో ఉండగా అడ్డదిడ్డంగా సంపాదించడం, ప్రజలను పురుగుల్లా చూడడం, ఓట్ల కోసం దండాలు పెట్టడం, పీఠమెక్కగానే హంగామాలు చేయడం భారత రాజకీయాల్లో పరిపాటిగా మారింది. ప్రజలే దీనిగురించి ఆలోచించాలి. ఇలాంటి వారిని రాజకీయాలకు దూరం పెట్టాలి. అధికారంలో ఉంటే తమంత గొప్పవారు లేరని భావించడం,అధికారం పోయాక, అధికారంలో ఉన్నవారిని విమర్శించడం ఇప్పుడు కొత్త తరం రాజకీయాలు చూస్తున్నాం. ప్రత్యర్థులను వేధించడమే అధికారం పరమావధి అన్నట్టుగా తెలుగునాట రాజకీయాలను మార్చిన ఘనత కేసీఆర్, జగన్‌రెడ్డిలకు దక్కింది. ఓటుకునోటు కేసులో పట్టుకుని జైలులో వేసిన రేవంత్‌రెడ్డి తెలంగాణ ముఖ్యమంత్రి కావడాన్ని కేసీఆర్, కేటీఆర్,హరీష్ రావులు జీర్ణించుకోలేక పోతున్నారు. ఈ కారణంగానే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై కేటీఆర్,హరీష్ రావులు ఒంటికాలి మీద లేస్తున్నారు. అసభ్యంగా వాడు, వీడు అని సంబోధిస్తున్నారు. జగన్ కూడా అప్పుడే ఎపిలో అంతా అయిపోయిందన్న భావనలో మాట్లాడుతున్నారు. కూటమి ప్రభుత్వం దారుణంగా ఉందని రంకెలు వేస్తున్నారు. ఇలాంటి జగన్,కేసీఆర్‌లనే ప్రజలు మట్టికరిపించారని మరచి మాట్లాడుతున్నారు. ఇకపోతే ఏం జరుగుతుందో తెలుసుకోకుండా అటు జగన్, ఇటు కెటిఆర్ అర్జంటుగా గద్దెమీద ఊర్చోవాలన్న తొందరలో ఏదిపడితే అది మాట్లాడేస్తున్నారు. సోషల్ మీడియాలో ఎవరు పడితే వాళ్లు, ఏదిపడితే అది వాగుతున్నారు. తమచేతిలో సోషల్ మీడియా ఉందన్న గర్వంతో ఇష్టానుసారం పోస్టులు పెడుతున్నారు.

ఎన్నికల్లో ఓటమి తర్వాత వీరిద్దరూ సోషల్ మీడియాపై ఎక్కువగా ఆధారపడుతున్నారు. బలమైన సోషల్ మీడియా సైన్యాన్ని ఏర్పాటు చేసుకుంటే ఎన్నికల్లో గెలిచిపోవచ్చునని, అలా లేనందునే గత ఎన్నికల్లో ఓడిపోయా మని కేటీఆర్ గతంలో ఓ సందర్భంలో అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో జగన్‌కు బలమైన సోషల్ మీడియా సైన్యం ఉండి కూడా గత ఎన్నికల్లో ఓటమిని తప్పించుకోలేదు. తాను చేసిందంతా ప్రజల మంచికోసమే అన్న భ్రమలో బటన్ నొక్కుతూ పోయారు. ఇప్పుడేమో ర్యాలీలు, హంగామాలతో మళ్లీ తన ప్రతాపం చాటుతున్నారు. ప్రజల్ని తక్కువ అంచనా వేయడం వల్లే తాము ఓడిపోయామని ఈ రెండు పార్టీల వాళ్లు ఇంకా గుర్తిచడం లేదు. తాము అధికారంలో ఉంటే అంతా సవ్యంగా ఉందని, ఇతరులు అధికారంలో ఉంటే సర్వనాశనం అయిపోతోందని ఎపిలో జగన్, తెలంగాణలో కెటిఆర్ భావిస్తున్నారు. కెసిఆర్ ఉన్నప్పుడే తెలంగాణ బాగుండేదని, ఇప్పుడు ప్రమాదంలో పడిందని కెటిఆర్ నిరంతరంగా ప్రచారం చేయించు కుంటున్నారు. జగన్ అనుయాయులు కూడా ఇదే తరహాలో మీడియా సమావేశాలు పెట్టివాపోతున్నారు. మధ్యలో తెలంగాణ సెంటిమెంట్‌తో బిఆర్‌ఎస్ నేతలు మళ్లీ తమ రాజకీయ పాచికలు వేస్తున్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో, ఆ తర్వాత కూడా కొంత కాలంపాటు ఇదే సెంటిమెంట్‌ను రగిలించి బీఆర్‌ఎస్ రాజకీయంగా లాభపడింది.

అధికారం పోవడంతో ఈ ఇద్దరు నేతలు సొంత మీడియాలో అసత్య కథనాలు, అబద్దాలను ప్రచారం చేసుకుంటున్నారు. అయితే క్షేత్రస్థాయిలో ప్రజలకు ఎవరేమిటో తెలుసు. అందుకే జూబ్లీహిల్స్‌లో బిఆర్‌ఎస్ బోల్తాపడింది. బిజెపి కూడా అతిగా ఊహించుకుని బొక్కబోర్లా పడింది. ఇవన్నీ ఒక ఎత్తయితే హంగామా రాజకీయాలను రాజకీయ పార్టీల నేతలు మానుకోవాలి. ప్రజలను పరామర్శించ డానికి హంగామా అవసరం లేదు. కోర్టుకు హాజరయినప్పుడు కూడా మందీమార్బలంతో ర్యాలీలు అవసరం లేదు. ఈ విషయాలు అన్ని పార్టీలకు అవసరం. అధికారంలో ఉన్నా, లేకపోయిన పార్టీలు ఈ సూత్రాన్ని పాటించాలి. తమ బలప్రదర్శన కోసం ప్రజలను ఇబ్బందులకు గురిచేయవద్దు. తమను ఆదరించి అక్కున చేర్చుకున్న వాళ్లే ఎన్నికల్లో ఎందుకు తిరస్కరించారో ఓడిన ప్రతి నాయకుడు తెలుసుకోవాలి. గుణపాఠం నేర్చుకో వాలి. ఓడిపోతే ఎదుటి పార్టీ వారిపై నెపం నెట్టి తప్పించుకోవడం రాజకీయ లక్షణం కాదని గుర్తించాలి. తెలంగాణలో తమకు తిరుగులేదని భావించిన బీఆర్‌ఎస్‌కు ఈ దు స్థితి ఎందుకు ఏర్పడిందో, ఎపిలో బటన్లు నొక్కినా ఎందుకు ప్రజలు తిరస్కరించారో గుర్తించి దిద్దుబాటు చర్యలు తీసుకొంటేనే ఈ రెండు పార్టీలకు మనుగడ ఉంటుంది. అహంకారపూరిత పోకడలను సమాజం హర్షించదని ప్రతి రాజకీయ నేతా గుర్తించాలి.

# సోషల్ మీడియా చర్చలో ఎగ్‌ఫ్రీజింగ్

**ముందే దాచుకున్న అండాలతో ఎప్పుడైన గర్భం**

**ఉపాసనా కామినేని పోస్ట్‌తో ఇప్పుడు సర్వత్రా ఆసక్తి**



**హైదరాబాద్, నవంబర్ 20 :** టాలీవుడ్ నటుడు రామ్ చరణ్ భార్య ఉపాసన కామినేని కొణిదల. ఇటీవల ఐఐటీ హైదరాబాద్ ఈవెంట్‌లో ఎగ్ ఫ్రీజింగ్‌పై చేసిన వ్యాఖ్యలు వివాదం సృష్టించాయి. అలాగే ఇప్పుడు ఎగ్ ఫ్రీజ్‌పై చర్చలు మొదలయ్యాయి. దీనిపై సర్వత్రా ఆసక్తి కూడా కనిపిస్తోంది. ఇదో రకంగా మంచిదే. కొత్త అంశాలను నవదంపతులు తెలుసుకునే అవకాశం రావడంతో సోషల్ మీడియాలో చర్చకు దారితీసింది. ఇక వివరాల్లోకి వెళితే...ఈ వివాదం నేపథ్యంలో ఉపాసన మళ్లీ స్పందించారు. ఎక్స్ అకౌంట్‌లో తన వ్యాఖ్యలను సమర్థిస్తూ ఓ పోస్టు చేశారు. కెరీర్‌పై దృష్టి పెట్టే మహిళలు.. తమ ఎగ్స్‌ను ఫ్రీజ్ చేసుకోవాలని, ఆ తర్వాత తమకు నచ్చిన సమయంలో గర్భాన్ని దాల్చాలని ఉపాసన సలహా ఇచ్చారు. ఆ సలహాపై దేశవ్యాప్తంగా చర్చ మొదలైంది. డాక్టర్లు, ఇన్‌ఫ్లూయన్సెర్లు, సోషల్ మీడియా యూజర్లు ఉపాసన వ్యాఖ్యలను తొలుత తప్పుపట్టారు. ఆ వ్యాఖ్యల పట్ల స్పష్టత కావాలని కొందరు ఆన్‌లైన్‌లో ఆమెను అడిగారు. ఈ నేపథ్యంలో ఉపాసన మళ్లీ ఎగ్ ఫ్రీజింగ్ గురించి స్పందించారు. అండాల సంరక్షణపై ఆరోగ్యకరమైన చర్చ జరుగుతున్నట్లు ఆమె చెప్పారు. తన వ్యాఖ్యలు ప్రజల్లో చర్చకు దారితీయడం సంతోషకరమని అన్నారు. ప్రజల స్పందన గౌరవిస్తున్నట్లు ఆమె తెలిపారు. ఎగ్ ఫ్రీజింగ్ వల్ల కలిగే లాభనష్టాల గురించి ఆమె వెల్లడించారు. తన వ్యక్తిగత అనుభవాలను ఆమె తన పోస్టులో పేర్కొన్నారు. పెళ్లి, ఫలదీకరణ గురించి ఆమె తన పోస్టులో రాశారు. తనకు 27 ఏళ్ల వయసులో పెళ్లి జరిగిందని, తన ఇష్టపూర్వకంగా జరిగిందని, 29 ఏళ్ల వయసులో వ్యక్తిగత, ఆరోగ్య కారణాల దృష్ట్యా తన అండాలను ఫ్రీజ్ చేయాలని నిర్ణయించుకున్నానని, 36 ఏళ్ల వయసులో తనకు తొలి సంతానం కలిగిందని, 39 ఏళ్ల వయసులో కవల పిల్లలకు జన్మనివ్వనున్నట్లు ఉపాసన తన పోస్టులో తెలిపారు. పెళ్లి, కెరీర్ మధ్య పోటీ సహజమే అని, కానీ నిండు జీవితంలో అవి రెండు ముఖ్యమే అని, అయితే నేను ఆ రెండింటికి టైం ఫిక్స్ చేసుకున్నానని, తన హక్కును తాను వినియోగించుకున్నట్లు ఉపాసన పేర్కొన్నారు. మర్యాద పూర్వకంగా స్పందిస్తున్న తన ఫాలోవర్లకు ఉపాసన థ్యాంక్స్ చెప్పింది. ఉద్యోగ సంస్థలు మహిళలకు ఎక్కువ అవకాశాలు ఇవ్వాలన్న అభిప్రాయాన్ని ఆమె వ్యక్తం చేసింది. ఐఐటీ హైదరాబాద్‌లో జరిగిన కెరీర్ కౌన్సిలింగ్‌లో మాట్లాడుతూ.. మహిళలకు అతిపెద్ద బీమా తమ అండాలను ఫ్రీజ్ చేసుకోవడమే అని ఆమె అన్నారు. ఎందుకంటే ఎప్పుడు పెళ్లి చేసుకోవాలి, ఎప్పుడు పిల్లలను కనాలన్న అంశాలపై నిర్ణయం తీసుకోవడం సులువు అవుతుందన్నారు. ఆర్థికంగా బలోపేతం అయిన తర్వాత ఆ నిర్ణయాలను అమలు చేయవచ్చు అని ఆమె అన్నారు. ఎంత మంది పెళ్లి చేసుకోవాలని విద్యార్థులను ఉపాసన ప్రశ్న అడిగిన సమయంలో.. అమ్మాయిల కన్నా అబ్బాయిలే ఎక్కువ మంది చేతులు లేపారు. దీనిపై ఉపాసన స్పందిస్తూ.. ఇది ప్రగతిశీల భారత్‌కు నిదర్శనమన్నారు. ఉపాసన చేసిన ఆ సూచన వల్ల ఆన్‌లైన్‌లో విమర్శలు వెల్లువెత్తాయి. తన సలహా జీవసంబంధమైన పరిమితులకు భిన్నంగా ఉన్నట్లు కొందరు విమర్శకులు పేర్కొన్నారు. ఫెర్టిలిటీ చికిత్స సులువైన అంశం కాదన్నారు. ఐవీఎఫ్, ఎగ్ ఫ్రీజింగ్ వల్ల ఆర్థిక ఇబ్బందులు తలెత్తుతాయన్నారు. ఓ ప్రముఖ గైనకాలజిస్ట్ స్పందిస్తూ .. బ్యాంకుల్లో కోట్లు ఉన్నవాళ్లు ఎగ్ ఫ్రీజింగ్ గురించి సలహా ఇవ్వడం సులువే అన్నారు. ఐవీఎఫ్ చికిత్సకు లక్షలు ఖర్చు అవుతోందన్నారు. ఎగ్ ఫ్రీజింగ్ కోసం ప్రతి ఏడాది లక్షల్లో ఖర్చు అవుతుందన్నారు. ఒక్క సిట్టింగ్ కూడా ఖర్చు చేయలేని మహిళలు ఉన్నట్లు తెలిపారు. ఒకవేళ అండాలను ఫ్రీజ్ చేసినా.. అవి చివరకు విజయవంతంగా గర్భం దాల్చే అవకాశం ఉంటుందో లేదో చెప్పలేమని మరో గైనిక్ డాక్టర్ అన్నారు.

# ఆయుధ వ్యాపారి సంజయ్ భండారీ కేసు

**కాంగ్రెస్ రాబర్ట్ వాద్రాపై ఇడి ఛార్జిషీట్**

**న్యూఢిల్లీ, నవంబర్ 20 :** కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకా గాంధీ భర్త, వ్యాపారవేత్త రాబర్ట్ వాద్రాపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఛార్జిషీట్ దాఖలు చేసింది. బ్రిటన్‌కు చెందిన ఆయుధ వ్యాపారి సంజయ్ భండారీ కేసుతో ముడిపడిన మనీలాండరింగ్ కేసులో ఈ అభియోగ పత్రాన్ని ప్రత్యేక కోర్టులో సమర్పించింది. రాబర్ట్ వాద్రాపై ఇది రెండో మనీలాండరింగ్ ఛార్జిషీట్. ఈ ఏడాది జులైలో షికోపుర్ భూముల వ్యవహారంలో ఈడీ ఆయనపై ఓ అభియోగ పత్రాన్ని దాఖలు చేసిన విషయం తెలిసిందే. దిల్లీలోని ఆయుధ వ్యాపారి సంజయ్ భండారీ ప్రాంగణంపై 2016లో ఆదాయపు పన్ను శాఖ అధికారులు దాడులు నిర్వహించారు. డిజిటల్ డేటా, ఇతర డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నారు. ఇందులో రాబర్ట్ వాద్రా పేరు వెలుగుచూసిందని, లండన్‌లోని ఓ స్థిరాస్తితో వాద్రాకు సంబంధం ఉందనే ఆరోపణలు వచ్చాయి. ఈ క్రమంలోనే 2017 ఫిబ్రవరిలో ఈడీ 'నగదు అక్రమ చలామణి చట్టం' కింద భండారీ తదితరులపై కేసు నమోదు చేసింది. లండన్‌లోని స్థిరాస్తికి సంబంధించి భండారీతో వాద్రా సంబంధాలపై ఈడీ దర్యాప్తు చేస్తోంది. ఇందులో భాగంగా గతంలో వాద్రాను విచారించింది. ఆయన ఈ ఆరోపణలను ఖండిస్తూ వస్తున్నారు. ఇదిలా ఉండగా.. 2016లో ఐటీ దాడులు జరిగిన వెంటనే సంజయ్ భండారీ లండన్‌కు పారిపోయాడు. అతడి అప్పగింత అభ్యర్థనను బ్రిటన్ కోర్టు తిరస్కరించింది. దిల్లీ కోర్టు జులైలో అతడిని పరారీలో ఉన్న ఆర్థిక నేరస్థుడిగా ప్రకటించింది.

# కర్నాటకలో మళ్లీ సిఎం రాజకీయం

**డికెకు పగ్గాలు అప్పగించాలంటున్న ఆయన వర్గం**



**బెంగళూరు, నవంబర్ 20 :** కర్ణాటకలో మళ్లీ పవర్ పాలిటిక్స్‌కు తెరలేచాయి. తాజాగా కర్ణాటక అధికార పార్టీ పంచాయితీ ఢిల్లీ హైకమాండ్‌కు చేరింది. కర్ణాటకలో కాంగ్రెస్ సర్కార్ ఏర్పడి రెండున్నరేళ్లు పూర్తి చేసుకుంది. ఇప్పుడు డీకే శివకుమార్ వర్గం.. సీఎం సిద్ధరామయ్యను మార్చాలంటూ డీకే శివకుమార్ వర్గం ఎమ్మెల్యేలు ఢిల్లీ వెళ్తున్నారు. రాష్ట్రంలో డీకే శివకుమార్‌కు సీఎం పగ్గాలు ఇవ్వాలని ఆయన వర్గం ఎమ్మెల్యే కొరనున్నట్లు సమాచారం. అయితే రాష్ట్రంలో సీఎం మార్పు ఊహాగానాలే అంటూ సీఎం సిద్ధరామయ్య కొట్టిపారేశారు. కర్ణాటకలో పవర్ షేరింగ్‌పై ఇప్పుడు పవర్ పాలిటిక్స్ నడుస్తున్నాయని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడిన అనంతరం కాంగ్రెస్ హైకమాండ్ రాష్ట్రంలో ఎవరిని సీఎం చేయాలనే దానిపై పెద్ద ఎత్తున చర్చలు జరిపింది. ఆ సమయంలో పీసీసీ చీఫ్‌గా ఉన్న డీకే శివకుమార్, గతంలో సీఎంగా పని చేసిన సిద్ధరామయ్య పేర్లు తెరపైకి వచ్చాయి. వాళ్లిద్దరిలో కూడా సీనియర్‌గా ఉన్న సిద్ధరామయ్య వైపు పార్టీ అధిష్టానం మొగ్గు చూపి సీఎంగా పగ్గాలు అప్పగించింది. అయితే ఆ సమయంలో పలు కీలక శాఖలతో డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ వర్గం ప్రమాణస్వీకారం చేసింది. ఆ సమయంలో ఈ ఇద్దరు నాయకుల మధ్య రాజీ జరిగిందనే చర్చ బయటికి వచ్చింది. వీరిద్దరి మధ్య 2.5 ఫార్ములా సయోధ్య జరిగిందనే చర్చ కూడా జోరుగా ప్రచారం జరిగింది. మొదటి 2.5 ఏళ్లు రాష్ట్రంలో సిద్ధరామయ్య సీఎంగా ఉంటారని, తర్వాత కాలం డీకే శివకుమార్ ముఖ్యమంత్రిగా పని చేస్తారని ఒక రాజీ జరిగిందనే ప్రచారం బయటికి వచ్చింది. అందులో భాగంగా మొదటగా సిద్ధరామయ్య ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారని డీకే వర్గం చెబుతుంది. కానీ ఇప్పుడు అనుకున్న సమయం ముగిసిన కూడా సీఎం కుర్చీ శివకుమార్‌కు ఎందుకు ఇవ్వడం లేదనే దానిపై ఆయన వర్గం వాళ్లు ప్రశ్నలు సంధిస్తున్నారు. గత వారమే సిద్ధరామయ్య, శివకుమార్ ఇద్దరు కూడా ఢిల్లీకి వెళ్లారు. ఆ సమయంలో వాళ్లిద్దరూ హైకమాండ్ పెద్దలతో విడివిడిగా సమావేశం అయ్యారు. పార్టీ పెద్దలకు రాష్ట్రంలోని పరిస్థితులు, ముఖ్యమంత్రి మార్పు అంశంపై వాళ్లిద్దరూ చర్చించినట్లు సమాచారం. అయితే ఆ సమయంలోనే హైకమాండ్ సీఎం మార్పుపై ఏ విషయం అయినా తామే నిర్ణయం తీసుకుంటామని, ఎవరు కూడా ఎటువంటి ఊహాగాలకు పోవద్దని, దీనిపై ఎక్కడ కూడా మాట్లాడవద్దని స్పష్టం చేసినట్లు సమాచారం. ఈ ఢిల్లీ పర్యటన తర్వాత ఇద్దరు నాయకులు కూడా సైలెంట్‌గా ఉన్నప్పటికి ఇప్పుడు డీకే శివకుమార్ వర్గానికి చెందిన కొందరు ఎమ్మెల్యేలు హస్తినకు బాట పడుతున్నారు. ఈ రాత్రి వాళ్లు బెంగళూరు నుంచి ఢిల్లీకి వెళ్లి పార్టీ పెద్దలను కలిసి డీకే శివకుమార్‌ను సీఎంను చేయాలనే ఒక డిమాండ్‌ను చేసే ఛాన్స్ ఉందని సమాచారం. డీకే వర్గం ఎమ్మెల్యేలు పార్టీ జాతీయ అధ్యక్షుడు ఖర్గేను కలుస్తారా, లేదంటే రాహుల్ గాంధీని కలుస్తారా అనేది మాత్రం ఇంకా అధికారికంగా బయటికి రాలేదు.

# రాజమౌళి వ్యాఖ్యలు హిందువులను కించపర్చడమే

- దేవుడిపై నమ్మకం లేకపోతే ఇంట్లో మాట్లాడుకోవాలి
- అదే దేవుడిని అడ్డం పెట్టుకుని సంపాదిస్తున్నారుగా
- బిజెపి అధికార ప్రతినిధి సాధినేని యామిని శర్మ ఫైర్



**అమరావతి,నవంబర్ 20 :** ప్రముఖ దర్శకుడు ఎస్ఎస్ రాజమౌళి ఇటీవల చేసిన వ్యాఖ్యలపై ఏపీ బీజేపీ అధికార ప్రతినిధి సాధినేని యామిని శర్మ ఫైర్ అయ్యారు. రాజమౌళి సినిమాలు చూసి హిందూ దేవుళ్లపై గౌరవం ఉందనుకున్నాం అని, ఆయన కామెంట్లపై హిందువులు ఇప్పుడు రగిలి పోతున్నారన్నారు. ఆంజనేయుడిపై నమ్మకం లేదనడం హిందువుల మనోభవాలు దెబ్బతీయడమే అని ధ్వజమెత్తారు. అంత పేరు, అంత డబ్బు, ప్రతిష్ట హిందూ దేవుళ్లను ఉపయోగించుకుని తెచ్చుకుంటారని విమర్శించారు. హిందూ దేవుళ్లని, సనాతన ధర్మాన్ని అవమానించే హక్కు ఎవరిచ్చారని,.. హిందూ సమాజం చులకనగా కనిపిస్తోందా అని రాజమౌళిని యామిని శర్మ ప్రశ్నించారు. గురువారం విజయవాడలో సాధినేని యామిని శర్మ మీడియాతో మాట్లాడుతూ? 'చట్ట ప్రకారంగా ఏమైనా చేసుకోవచ్చు. సంబంధం లేకుండా హిందూ దేవుళ్లను అంటే ఊరుకోం. దర్శకుడిగా రాజమౌళికి పేరు రావడానికి ఆ దేవుడే కారణం. ఏదో ఒక విధంగా రామ, కృష్ణ అనడం వల్లనే ఆ స్థాయి వచ్చింది. వ్యక్తిగత అంశాలతో హిందూ దేవుళ్లపై కామెంట్ చేస్తే ఊరుకోం అని ఘాటుగా హెచ్చరించారు. సినీ ఇండస్ట్రీలో కొంతమంది అహంకారంతో మాట్లాడితే ఏం జరిగిందో అందరికీ తెలుసు. ఒళ్ళు దగ్గర పెట్టుకుని, స్పృహలో ఉండి మాట్లాడాలి. మనోభావాలు దెబ్బతీసే హక్కు ఎవరికీ లేదు. సనాతన ధర్మానికి నిరూపణలు అవసరం లేదు.. వీళ్ళెవరు నిరూపించడానికి. మీరు సినిమాలు చేసుకోండి.. మీ టీజర్ల కోసమో, మీ పబ్లిసిటీ కోసమో వినియోగించుకోవడానికి దేవుడు కమర్షియల్ కాదు' అని యామిని శర్మ ఆగ్రహం వ్యక్తం చేశారు. సూపర్ స్టార్ మహేష్ బాబుతో రాజమౌళి తెరకెక్కిస్తున్న 'వారణాసి' సినిమా టైటిల్ గ్లింప్స్ తాజాగా విడుదలైన విషయం తెలిసిందే. టైటిల్ గ్లింప్స్ విడుదల కోసం పెద్ద ఎత్తున రాజమౌళి ఓ ఈవెంట్ నిర్వహించారు. గ్లింప్స్ విడియో రిలీజ్‌కు పదే పదే సాంకేతిక ఆటంకాలు ఎదురుకావడంతో.. రాజమౌళి నిరాశ చెంది హనుమంతుడిపై కామెంట్స్ చేశారు. దేవుడి పైన తనకు పెద్దగా నమ్మకం లేదని, హనుమంతుడు తన వెనుకాల ఉండి నడిపించారని నాన్న చెప్పినపుడు వెంటనే కోపం వచ్చిందన్నారు. హనుమంతుడు ఉంటే ఇదేనా నడిపించేది అని రాజమౌళి అసహనం వ్యక్తం చేశారు. ఈ కామెంట్స్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.



# బిహార్ ఎన్నికల్లో ఓటమి

**ప్రశాంత్ కిశోర్ మౌనవ్రతం**

**బిహార్ :** బిహార్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ప్రశాంత్ కిశోర్ కు చెందిన జన్ సురాజ్ పార్టీ ఒక్క సీటు కూడా దక్కించుకోలేక పోయింది. ఎన్నికల ఫలితాలకు బాధ్యత వహిస్తూ ప్రశాంత్ కిశోర్ ఒకరోజు మౌనవ్రతం చేపట్టారు. ప్రధాని మోదీ, ఎన్డీయే నాయకుల సమక్షంలో నీతీశ్ కుమార్ సీఎంగా ప్రమాణస్వీకారం చేసిన సంగతి తెలిసిందే. ఈక్రమంలో ప్రశాంత్ కిశోర్ ఈ వ్రతం చేపట్టడం గమనార్హం. ఇటీవల ప్రశాంత్ కిశోర్ విలేకరులతో మాట్లాడుతూ.. పార్టీ పరాజయానికి 100 శాతం బాధ్యత తనదేనన్నారు. తప్పిదాలను సరిదిద్దుకుని తిరిగి మరింత బలంగా వస్తామని, వెనక్కి వెళ్లే ప్రసక్తే లేదన్నారు. ఈ క్రమంలోనే ఒకరోజు మౌనవ్రతం చేపట్టనున్నట్లు ప్రకటించారు. ఆ ప్రకటన ప్రకారం.. తాజాగా భితిహర్వా గాంధీ ఆశ్రమంలో ఈ మౌనవ్రతాన్ని చేపట్టారు. ఇది ఈరోజు మొత్తం కొనసాగుతుందని పార్టీ తెలిపింది. ఇక, ఇటీవల ఎన్నికల ఫలితాలపై మాట్లాడుతూ.. అధికార కూటమిపై ప్రశాంత్ తీవ్ర విమర్శలు చేశారు. ఎన్నికలకు ముందు ప్రతి నియోజకవర్గంలో 60వేల మంది లబ్ధిదారులకు నీతీశ్ ప్రభుత్వం రూ.10వేలు చొప్పున ఇవ్వకుంటే ఆ పార్టీ 25 స్థానాలకే పరిమితమయ్యేదన్నారు. ఓట్లు పొందకపోవడం నేరం కాదని, అయితే.. అవినీతి, విభజన రాజకీయాలు మాత్రం తాను చేయలేదని అధికార పక్షాన్ని ఉద్దేశిస్తూ విమర్శించారు. ఇక, బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో 243 సీట్లకు గాను.. 202 సీట్లు దక్కించుకొని ఎన్డీయే కూటమి ఘన విజయం సాధించిన సంగతి తెలిసిందే. నేడు రాష్ట్రంలో ఎన్డీయే కూటమి కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. పట్నాలోని గాంధీ మైదానంలో నీతీశ్‌తో పాటు 27 మంది మంత్రులుగా ప్రమాణం చేశారు. ఈ కార్యక్రమానికి ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్‌సింగ్, జేపీ నడ్డా తదితరులు హాజరయ్యారు.

# ఢిల్లీ ఎర్రకోట పేలుళ్ల ఘటన

**శ్రీనగర్‌లో మరో నలుగురిని అరెస్ట్ చేసిన ఎన్‌ఐఏ**

**న్యూఢిల్లీ, నవంబర్ 20 :** ఢిల్లీ ఎర్రకోట సమీపంలో జరిగిన పేలుళ్లతో సంబంధం ఉన్న మరో నలుగురు నిందితులను ఎన్‌ఐఏ పట్టుకుంది. గురువారం శ్రీనగర్‌లో వీరిని అరెస్ట్ చేసింది. దీంతో ఈ దాడితో సంబంధం ఉన్న మొత్తం అరెస్టులు 6కి పెరిగాయి. నవంబర్ 10న ఢిల్లీలోని ఎర్రకోట దగ్గర జరిగిన పేలుడు ఘటనపై జాతీయ దర్యాప్తు సంస్థ ముమ్మరంగా దర్యాప్తు సాగిస్తోన్న సంగతి తెలిసిందే. జిల్లా సెషన్స్ జడ్జి, పాటియాలా హౌస్ కోర్టు జారీ చేసిన ఆర్డర్ల మేరకు నలుగురు నిందితులను జమ్మూ కాశ్మీర్‌లోని శ్రీనగర్‌లో అదుపులోకి తీసుకున్నారు. వారిని జమ్మూ కాశ్మీర్‌లోని పుల్వామాకు చెందిన డాక్టర్ ముజమ్మిల్ షకీల్ గనై, జమ్మూ కాశ్మీర్‌లోని అనంత్‌నాగ్‌కు చెందిన డాక్టర్ అదీల్ అహ్మద్ రాథర్, ఉత్తర ప్రదేశ్‌లోని లక్నోకు చెందిన డాక్టర్ షాహీన్ సయీద్ ఇంకా, జమ్మూ కాశ్మీర్‌లోని షోపియన్‌కు చెందిన ముఫ్తీ ఇర్ఫాన్ అహ్మద్ వాగేగా గుర్తించారు. వీరందరూ ఢిల్లీ బ్లాస్ట్ లో ముఖ్యమైన పాత్ర పోషించారని దర్యాప్తు ఏజెన్సీ చెబుతోంది. టీవల ఈ కేసుకు సంబంధించి ఇద్దరు నిందితులను ఎన్‌ఐఏ అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. పేలుడుకు ఉపయోగించిన కారు ఎవరి పేరున రిజిస్టర్ అయిందో అతనైన(అమీర్ రషీద్ అలీ)ని, దాడిలో పాల్గొన్న ఉగ్రవాదికి సాంకేతిక సహాయం అందించిన డానిష్ అలియాస్ జాసిర్ బిలాల్ వానిలను అదుపులోకి తీసుకుం ది. ఈ కేసులో పూర్తి కుట్రను వెలికితీసే ప్రయత్నాలలో భాగంగా వీరిద్దరినీ ఇంటరాగేట్ చేస్తోంది.కాగా, ఈ పేలుడు ఘటన జరిగిన వెంటనే కేంద్ర హోం మంత్రిత్వ శాఖ దీనిపై దర్యాప్తును ఎన్‌ఐఏ కి అప్పగించింది. దాడికి కారణమైన గ్రూపులోని ప్రతి సభ్యుడిని గుర్తించి అరెస్టు చేయడానికి ఏజెన్సీ వివిధ రాష్ట్ర పోలీసు దళాలతో కలిసి పనిచేస్తోంది. నవంబర్ 10న ఢిల్లీలోని నేతాజీ సుభాష్ మార్గ్‌లో ముష్కరమూకలు జరిపిన పేలుడులో 15 మంది మరణించారు.




## సిఎం రేవంత్‌తో అనలాగ్ సిఇవో భేటీ

**హైదరాబాద్, నవంబర్ 20 :** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని అనలాగ్ ఎఐ కంపెనీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ అలెక్స్ కిప్‌మాన్ హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిసి రాష్ట్రాభివృద్ధికి సంబంధించిన పలు కీలక అంశాలపై చర్చించారు. తెలంగాణను భవిష్యత్ నగరాల దిశగా తీసుకెళ్లడానికి చేపడుతున్న ఏఐ సిటీ ప్రాజెక్టు, ఫ్యూచర్ సిటీ అభివృద్ధి, మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ వంటి కార్యక్రమాల్లో తర్వాతి తరం 'ఫిజికల్ ఇంటెలిజెన్స్' సిస్టమ్‌లను ఎలా అనుసంధానించొచ్చన్నది ఈ సమావేశంలో చర్చించారు. సీఎం రేవంత్ రెడ్డి అభ్యర్థన మేరకు తమ ఆధునిక సాంకేతిక ప్లాట్‌ఫారమ్‌లను ఉపయోగించి హైదరాబాద్ నగరం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలైన ట్రాఫిక్ రద్దీ, పట్టణ వరదలు, వాతావరణ మార్పుల అంచనా వంటి అంశాలను పరిష్కరించడంలో సహకరించేందుకు అంగీకారాన్ని తెలిపింది. ఈ పరిష్కారాలు నగర పాలనను స్మార్టుగా మార్చడంలో కీలక పాత్ర పోషించనున్నాయని అధికారులు భావిస్తున్నారు. అదేవిధంగా రాబోయే డిసెంబర్ 8, 9 తేదీల్లో నిర్వహించనున్న 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్'కు హాజరయ్యేలా కిప్‌మాన్‌ను ముఖ్యమంత్రి ఆహ్వానించారు.

## పెట్టుబడులకు హైదరాబాద్ వేదిక

### తెలంగాణ నార్త్ ఈస్ట్ టెక్నో కల్చరల్ ఫెస్టివల్‌లో రేవంత్




**హైదరాబాద్, నవంబర్ 20 :** పెట్టుబడులకు హైదరాబాద్ వేదికగా మారిందని, తాము పక్క రాష్ట్రాలతో కాకుండా దుబాయ్, సింగపూర్ లాంటి దేశాలతో పోటీ పడతామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. హైదరాబాద్ వేదికగా 6 రోజుల పాటు రెండు విడతలుగా జరిగే తెలంగాణ నార్త్ ఈస్ట్ టెక్నో కల్చరల్ ఫెస్టివల్‌ను గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ ప్రారంభించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, జూపల్లి కృష్ణారావ్, సీఎస్ రామకృష్ణారావు, డీజీపీ శివధర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ వివిధ రంగాల్లో దూసుకుని పోయేలా కార్యాచరణతో ముందుకు సాగుతున్నామని అన్నారు. త్రిపుర గవర్నర్ ఇంద్రసేనా రెడ్డి గౌరవ అతిథిగా హాజరయ్యారు. తెలంగాణతో పాటు పాటు 8 ఈశాన్య రాష్ట్రాలకు చెందిన 600 మంది పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. ఈ నెల 21, 22 తేదీల్లో మొదటి దశ ఫెస్టివల్‌లో సినిమాలు, సాహిత్యం వంటి అంశాలపై సెమినార్లు, చర్చా గోష్టిలు, ప్రదర్శనలు ఉంటాయని, 25 నుంచి 27 వరకు సాగే 2వ విడతలో ఆరోగ్యం, సాంకేతికత వంటి అంశాలపై చర్చలు ఉంటాయని చెప్పారు. రోజూ 2వేల మంది ఈ కార్యక్రమంలో పాల్గొంటారని, 40 మంది పౌర పురస్కార విజేతలు కూడా దీనికి హాజరవుతారని గవర్నర్ కార్యాలయ కార్యదర్శి దాన కిశోర్ తెలిపారు. రెండు రాష్ట్రాల మధ్య సాంస్కృతిక వారసత్వం ఇచ్చి పుచ్చుకోవడానికే కాదు ఒకరి ఉత్పత్తులు మరొకరు అమ్మడానికి, కొనడానికి దోహదం చేస్తుందని త్రిపుర గవర్నర్ ఇంద్రసేనా రెడ్డి అన్నారు. సంస్కృతి, సహజ వనరుల పరంగా ఈశాన్య రాష్ట్రాలు ఎంతో గొప్పవని.. మన దేశం అతిథి దేవో భవ అంటే వారు అభివృద్ధి దేవో భవ అంటున్నారని తెలిపారు. సంక్షేమ ఫలాలు అందరికీ చేరడమే అసలైన అభివృద్ధి అన్నారు. తొలి రోజు ఉత్తమ ప్రదర్శన కనబరిచిన కళాకారులకు గవర్నర్ బహుమతులు అందజేశారు. మిజోరాం యువజన సర్వీసులు, క్రీడల మంత్రిని సీఎం రేవంత్ రెడ్డి సన్మానించారు.

## కేంద్ర ప్రభుత్వ పథకాలు సకాలంలో లబ్ధిదారులకు అందాలి

- అన్ని శాఖల అధికారులు అంకిత భావంతో పనిచేయాలి
- మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యులు అండ్ దిశా కమిటీ చైర్మన్ పోరిక బలరాం నాయక్
- దిశా సమావేశానికి హాజరైన భద్రాచలం నియోజక వర్గం శాసన సభ్యులు తెల్లం వెంకట్రావు




**ములుగు జిల్లా, నవంబర్ 20 :** కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ అభివృద్ధి సంక్షేమ పథకాలపై నిరంతర పర్యవేక్షణ చేయాలని మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యులు అండ్ దిశా కమిటీ చైర్మన్ పోరిక బలరాం నాయక్ తెలిపారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరం లో గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన దిశా కమిటీ సమావేశం పోరిక బలరాం నాయక్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశం నకు భద్రాచలం నియోజక వర్గం శాసన సభ్యులు తెల్లం వెంకట్రావు జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్ దిశ కమిటి మెంబర్ పూర్ణచందర్ జిల్లా అదనపు కలెక్టర్లు మహేందర్ జీ రెవెన్యూ పాల్గొన్నారు. ఎంపీ దిశా కమిటీ చైర్మన్ మాట్లాడుతూ జిల్లాలో వనరులు పుష్కలంగా ఉన్నాయని సద్వినియోగం చేసుకుని అభివృద్ధి సాధించాలని సూచించారు. జిల్లాలో పనిచేస్తున్న అన్ని శాఖల అధికారులు అంకిత భావంతో పనిచేస్తూ జిల్లా అభివృద్ధికి సహకరించాలని అన్నారు. జిల్లాలో చేపట్టే అభివృద్ధి పనులపై ఆయా శాఖల అధికారులు అంచనాలు తయారు చేసి సమర్పించిన పక్షంలో కేంద్రం నుండి నిధులు తేవడానికి సహకరిస్తానని అధికారులు ఏజెన్సీ ప్రాంతంలో పనిచేయడం అదృష్టంగా భావించాలని అన్నారు.కేంద్ర ప్రభుత్వం ద్వారా రావాల్సిన అధికారులను రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో రాబట్టుకొని ప్రజా ప్రతినిధులు అధికారుల సహకారంతో జిల్లాను ప్రగతి పథంలో తీసుకెళ్తామని అన్నారు. ఉపాధి హామీ పనులను సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. భూభారతి దరఖాస్తుల పరిశీలనలో రాష్ట్రంలో జిల్లాను 3వ స్థానంలో నిలిపినందుకు జిల్లా యంత్రాంగాన్ని ఈ సందర్భం గా అభినందించారు. క్షేత్ర స్థాయిలో అధికారుల సాంకేతిక సమస్యలను అధిగమించి పనులను జాప్యం చేయకుండా పూర్తి చేయాలని అన్నారు.విద్యుత్ అధికారులు తమ సిబ్బంది ని ప్రతి గ్రామంలోని సమస్యపై ఖచ్చితంగా అవగాహన కలిగి ఉండాలని క్షేత్ర స్థాయి సిబ్బందికి అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ప్రజలకు విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చూడాలని అన్నారు. భద్రాచలం నియోజక వర్గం శాసన సభ్యులు తెల్లం వెంకట్రావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అభివృద్ధి పనులపై సంబంధిత శాఖల అధికారులు గ్రామీణ ప్రాంతంలోని ప్రజలకు వివరించాలని అన్నారు. జిల్లాలో కొత్త అభివృద్ధి కార్యక్రమాల పనులను త్వరితగతిగా ప్రారంభించాలని అన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లోని పలు శాఖలలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయడానికి చర్యలు తీసుకోవాలని కోరారు.జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. మాట్లాడుతూ సమావేశంలో చర్చించిన అంశాలపై సమగ్ర నివేదికలు తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. సమస్యలపై నిరంతర పర్యవేక్షణ కొనసాగాలని అధికారులను సూచించారు. ఈ సమావేశం లో ఆర్డీఓ వెంకటేష్ డి ఆర్ డి ఓ శ్రీనివాస్ రావు డి ఎస్ పి రవీందర్ సంబంధిత శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరూ పర్యావరణాన్ని పరిరక్షించాలి

- జిల్లా విద్యాధికారిణి చైతన్య జైని
- సిజిఆర్ ఆధ్వర్యంలో యంగ్ ఎర్త్ లీడర్స్‌తో ప్రతిజ్ఞ




**ఖమ్మం, రాజముద్ర న్యూస్ :** పర్యావరణ పరిరక్షణ బాధ్యత విద్యార్థులు,పౌర సమాజం పై ఉందని జిల్లా విద్యాధికారిణి చైతన్య జైని తెలిపారు.తిరుమలాయపాలెం మండలంలోని సుబ్లేడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వర్షపు నీటి నిలువ,ఇంకుడు గుంతలు,తడి,ఔషద మొక్కల పెంపకం, పొడిచెత్త వేరు చేసే యూనిట్లను గురువారం ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకం వల్ల పర్యావరణ కాలుష్యం పెరిగి క్యాన్సర్ వ్యాధి వ్యాప్తికి దారితీస్తుందని తెలిపారు.ప్రతి విద్యార్థి పాఠశాల,బజారుతో పాటుగా ఎక్కడికి వెళ్లిన గుడ్డ సంచితో వెళ్లాలని,ప్లాస్టిక్ కవర్లు వినియోగించవద్దని సూచించారు.ప్రతి విద్యార్థి తన పుట్టినరోజుకి తప్పకుండా ఒక మొక్కను నాటి,సంరక్షణ బాధ్యతలు తీసుకుని పర్యావరణా



న్ని పరిరక్షించాలని కోరారు.యంగ్ ఎర్త్ లీడర్స్ తో ప్రతిజ్ఞ చేయించి బ్యాడ్జ్ అందించారు.అనంతరం పాఠశాలలో చదువు తున్న 120 మంది విద్యార్థులకి స్టీల్ వాటర్ బాటిల్స్ ను సొంత ఖర్చులతో అందిస్తానని చైతన్య జైనీ హామీ ఇచ్చారు.

### కాకరవాయి ఉన్నత పాఠశాలలో...

కాకరవాయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణ,చెట్ల పెంపకం, ఔషద మొక్కల ఆవశ్యకత పై అవగాహన కార్యక్రమం కల్పించారు.ఔషద మొక్కలు ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుతాయని,వీటిని వినియోగించటం ద్వారా వైద్య ఖర్చులను తగ్గించుకోవచ్చని సిజిఆర్ ప్రతినిధి పుడమి పత్రిక ఎడిటర్ రమేష్ రావు, మాజీ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ ఎండి.రఫీవుద్దిన్ వివరించారు.అనంతరం విద్యార్థులు,ఉపాధ్యాయులతో కలిసి ఔషద మొక్కలను నాటారు. ఔషద మొక్కలను పెంచే బాధ్యతను పాఠశాల విద్యార్థుల్లో ఎర్త్ లీడర్స్‌ను ఎంపిక చేసి వారికి అప్పగించారు.ఈ కార్యక్రమంలో కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ వ్యవస్థాపకులు లక్ష్మారెడ్డి, యంగ్ ఎర్త్ లీడర్స్ నిర్వాహకులు యానాల వెంకటరెడ్డి, ఏఎంఓ పెసర ప్రభాకర్ రెడ్డి,పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎన్.మధుసూదన్ రావు,ఉపాధ్యాయులు,సిజిఆర్ ప్రతినిధి కోటయ్య,తదితరులు పాల్గొన్నారు.

## మహిళలకు రక్షణ కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం

- ఎస్ఎఫ్ఐ కేంద్ర కమిటీ సభ్యురాలు మమత
- రంగారెడ్డి జిల్లా ఎస్ఎఫ్ఐ గర్ల్స్ కన్వెన్షన్ ఎన్నిక
- విద్యార్థినీల నినాదాలతో దద్దరిల్లిన చేవెళ్ల
- భారీ ర్యాలీతో కన్వెన్షన్ నిర్వహణ




**చేవెళ్ల, రాజముద్ర న్యూస్:** మహిళలకు రక్షణ కల్పించడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం అయ్యాయని ఎస్ఎఫ్ఐ కేంద్ర కమిటీ సభ్యురాలు మమత అన్నారు. గురువారం రోజున చేవెళ్లలో భారత విద్యార్థి పెదరేషన్ (ఎస్ఎఫ్ఐ) రంగారెడ్డి జిల్లా గర్ల్స్ కన్వెన్షన్ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మమత హాజరై మాట్లాడుతూ.. మహిళలకు రక్షణ కల్పించడం లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని అగ్రహం వ్యక్తం చేశారు. షి టీమ్స్ ఎక్కడ కూడా సరిగ్గా పని చేయడం లేదని, మహిళలపై హత్యాచారాలు రోజు రోజుకి పెరిగి పోతున్నాయని, వాటిని అరికట్టడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమవుతున్నాయని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి అధికంగా హత్యాచార ఘటనలు పెరిగిపో తున్నాయని, భేటీ బచావో, బేటి పడావో అనే నినాదాలు ప్రభుత్వాలు పనికి వస్తున్నాయి కానీ, నిజంగా జరిగే దుర్మార్గాలను అరికట్టడంలో మాత్రం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని



దుయ్యబట్టారు. కళాశాలల లో విద్యార్థినిలపై ర్యాగింగ్ ఘటనలు ప్రతి రోజు చూస్తున్నామని, ఇంజనీరింగ్, మెడికల్ కళాశాలలో హత్యాచారం జరుగుతున్న కానీ వాటిని అరికట్టడంలో ఎందుకు నిర్లక్ష్యంగా వివరిస్తున్నారో ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి ప్రభుత్వాలు ఉండటం సిగ్గుచేటనిఆగ్రహం వ్యక్తం చేశారు. ఆడ పిల్లలకు అండగా ఉంటూనే ఆడ పిల్లను పుట్టనిద్దాం, చదవనిద్దాం, కాపాడుకుందాం అని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన స్కూటీల హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు. సంక్షేమ హాస్టల్ వసతి గృహాలలో విద్యార్థులకు ఉన్న సమస్యలను పరిష్కరించాలన్నారు. నిధులను కేటాయించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, కేంద్ర ప్రభుత్వం నూతన జాతీయ విద్యా విధానాన్ని తీసుకువచ్చి, కాశయ కరుణ చేయడం సరికాదన్నారు. అనంతరం జిల్లా కన్వెన్షన్ కమిటీని 10 మంది సభ్యులతో ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గర్ల్స్ కన్వీనర్ గా, జిల్లా కో కన్వీనర్- అంబిక, కీర్తన, కమిటీ సభ్యులు, అమ్ములు, అక్షిత, మానస, నందిని, నవమి, మౌనిక, ప్రియా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కె వై ప్రణయ్, బి శంకర్, ఎస్ఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు , శ్రీకాంత్, తరంగ్, ఎస్ఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా సహాయ కార్యదర్శి బేగరి అరుణ్ కుమార్, ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ అధ్యక్షుడు శ్రీనివాస్, సహాయ కార్యదర్శి చరణ్ గౌడ్, ఎస్ఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా కమిటీ సభ్యులు సింధు, వంశీ, ఎస్ఎఫ్ఐ చేవెళ్ల మండల అధ్యక్ష కార్యదర్శులు , ఇర్ఫాన్, మాల చందు, ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ సభ్యులు యశ్వంత్, పవన్ కుమార్, విష్ణు, నవీన్, విష్ణు గుప్త తదితరులు పాల్గొన్నారు.

# ముక్తికి మార్గం మార్గశిరం

(నేటి నుండి మార్గశిర మాసం ప్రారంభం సందర్భంగా మా ఆర్గాన్ న్యూస్ పాఠకుల కొరకు...)

**దైవారాధనకు, ఉపవాస దీక్షలకు అత్యంత ప్రాముఖ్యం ఉన్న మాసం కార్తీకం తర్వాత చెప్పుకో తగిలింది మార్గశిరమే. విష్ణు సహస్రనామ పట్టణంతో లక్ష్మీనారాయణ మూర్తిని భక్తిశ్రద్ధలతో కొలిచే మార్గశిరానికి పండుగ మాసం అని పేరు.**

ఏడాదికి 12 మాసాలు ఉంటే వాటిలో మార్గశిరాన్ని కానీ నంటూ కృష్ణ పరమాత్ముడే స్వయంగా తెలిపాడు. గీత జయంతిని మనుధర్మాన్ని వైకుంఠ ఏకాదశిని మహాలక్ష్మి దత్తాత్రేయ ఆరాధనను విశేషంగా జరిపే నెల మార్గశిరం. పౌర్ణమి తర్వాత నుంచి ధనుర్మాసం అంటారు. ఈ నెల రోజులు చేసే ప్రతి పూజను కృష్ణుడే స్వయంగా స్వీకరిస్తాడని భక్తుల నమ్మకం. అందుకే ఎంతోమంది విష్ణు భక్తులు ఈ విషయంలోనే విష్ణు సహస్రనామ పట్టణంతో పాటు ధనుర్మాస వ్రతాన్ని ఆచరించేందుకు సిద్ధమవుతారు. తిరుమల తిరుపతి దేవస్థానంలోనూ ధనుర్మాస సమయంలో సాక్షాత్తు భూదేవి అవతారమైన ఆండాళ్ రచించిన తిరుప్పావైని సుప్రభాతానికి బదులుగా స్వామికి వినిపిస్తారు. ఈ నెల రోజులు సహస్రనామార్చనలతో తులసీదళాలకు బదులుగా బిల్వపత్రాలతో స్వామిని పూజిస్తారు. అలాగే ధనుర్మాస వ్రతాన్ని ఆచరించేవారు రోజుకు ఒకటి చొప్పున తిరుప్పావై పాశురాలను గానం చేస్తూ గోదాదేవి రంగనాథ స్వామి శ్రీకృష్ణుని పూజిస్తారు. ఇంటి ముందు రంగవల్లి కలనీ గొబ్బెమ్మలను అలంకరించడం నది స్నానాలు పూజలు జపాలను ఆచరించడం వల్ల కోరిన కోరికలు నెరవేరుతాయి అని ప్రతీతి. ఈ ధనుర్మాస వ్రతానికి సంబంధించిన అంశాలు



బ్రాహ్మణ పురాణాలను నారాయణ సంహితలతో కనిపిస్తాయి.

### ముక్కోటి దేవత లతో దర్శనం

ఏడాదికి 24 ఏకాదశి తిధులు ఉంటే సూర్యుడు ఉత్తరాయణానికి ముందే వచ్చే ధనుర్మాస ధనుర్మాస శుద్ధ ఏకాదశి వైకుంఠ ఏకాదశి లేదా ముక్కోటి ఏకాదశిగా పిలుస్తారు ఈ రోజున వైకుంఠ వాకిళ్లు తెలుసుకొని ఉంటాయని అంటారు అందుకే వైష్ణవాలయాలలో భక్తుల కోసం తెల్లవారుజామున ఉత్తర ద్వారాలు తెరుస్తారు. ఈరోజు మహావిష్ణువు గరుడ వాహనం పైన మూడు కోట్ల దేవతలతో కలిసి భూలోకానికి దిగివచ్చి భక్తులకు దర్శనం ఇస్తాడని అంటారు ఈ రోజు ఉపవాసం ఉంటే మిగతా 23 ఏకాదశి తిధులతో ఉపవాసం ఉన్న ఫలితం లభిస్తుందని విష్ణుపురాణం చెబుతుంది.




## మట్టిని తరలిస్తున్న టిప్పర్‌ను పట్టుకున్న రెవెన్యూ అధికారులు

**ఖమ్మం, రాజముద్ర న్యూస్ :** తిరుమలాయపాలెం మండల కేంద్రంలోని గ్రామ శివారు(రమణ తండా మార్గంలో) నుండి టిప్పర్ లో మట్టిని లోడ్ చేసి అక్రమంగా తరలిస్తుండగా గురువారం రెవెన్యూ అధికారులు పట్టుకున్నారు.గత కొన్ని రోజులుగా మట్టిని తరలిస్తున్నారనే సమాచారం మేరకు గిర్దావర్ పవన్ స్థానిక కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయం సమీపంలో టిప్పర్ ను పట్టుకుని సీజ్ చేసి స్థానిక తహశీల్దార్ కార్యాలయంనకు తరలించారు.అనేక టిప్పర్ ల ద్వారా మట్టి రవాణా జరుగుతున్న నేపథ్యంలో ఒక్క టిప్పర్ ను మాత్రమే పట్టుకుని మిగతా టిప్పర్ లను విడిచిపెట్టడం పలు అనుమానాలకు తావిస్తుంది.ఒకానొక దశలో మట్టి రవాణా అంటేనా అక్రమార్కుల కన్ను తిరుమలాయపాలెం మండలం పై పడుతుంది.ఇక్కడి నుండైతే మట్టిని సులభతరంగా తరలించవచ్చునేది మట్టి మాఫియాదారుల భావన.ఇకనైనా సంబంధిత అధికారులు మట్టి మాఫియాను అడ్డుకోకపోతే ప్రకృతి గుట్టలు అంతరించిపోయే అవకాశం ఉంది.



## సొంత నిధులతో బోర్ పంపు ఏర్పాటు

### గ్రామ సేవా కోసం ఎల్లప్పుడు ముందు ఉంటానన్నా పామెన రాములు

**చేవెళ్ల, రాజముద్ర న్యూస్:** తను పుట్టిన గ్రామసేవకు ఎల్లప్పుడూ ముందుంటానని తంగడ పల్లి గ్రామ వాసి పామెన రాములు తెలిపారు. రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలం తంగడ పల్లి గ్రామంలోని 1వ వార్డులో స్టాటర్, 4వ వార్డులో నీటి సమస్యను అధిగమించేందుకు గ్రామస్థుడు పామెన రాములు సొంత నిధులతో బోర్‌పంపు ఏర్పాటు చేశారు. గ్రామంలో నీటి కొరతను గమనించిన రాములు గ్రామంలోని నీటి సమస్యను తీర్చేందుకు తన వంతు సహాయంగా ముందడుగు వేయడంతో గ్రామ పెద్దల సమక్షంలో బోర్‌పంపు ప్రారంభ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పామెన రాములు మాట్లాడుతూ....గ్రామ ప్రజలకు తోడుగా నిలబడి, గ్రామాభివృద్ధికై తన వంతు సాయం ఎల్లప్పుడూ అందిస్తానన్నారు. అవసరమైన చోట సేవ చేయడం నా కర్తవ్యంగా భావిస్తున్నానని తెలిపారు. తను పుట్టిన గ్రామానికి సేవ చేయడానికి తాను ఎల్లప్పుడు ముందుంటానని ఈ సందర్భంగా రాములు తెలిపారు. గ్రామస్థులు స్పందిస్తూ...తమ వార్డుల్లో చాలా కాలంగా నీటి సమస్య కొనసాగుతోందని, ప్రభుత్వ పరిష్కారం ఆలస్యమవుతున్న వేళ పామెన రాములు సొంత ఖర్చుతో బోర్‌పంపు ఏర్పాటు చేయడం తమకు ఎంతో ఉపయోగంగా మారిందని పేర్కొన్నారు. గ్రామాభివృద్ధికి ఇలాంటి సేవా కార్యక్రమాలు ఎంతో దోహదం చేస్తాయని గ్రామ ప్రజలు చెప్పారు. ఈ కార్యక్రమంలో పామేన రాములు, హరికృష్ణ, లాకెట్ రాజు, షాకీర్, లక్ష్మయ్య, రమేష్, బాలు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



## మరకత శివాలయంలో సినీ గేయ రచయిత రామజోగయ్య శాస్త్రి

**శంకర్ పల్లి, రాజముద్ర న్యూస్:** శంకర్ పల్లి మండల పరిధిలోని చందిప్ప గ్రామంలో వెలిసిన 11 శతాబ్దానికి చెందిన శ్రీ మహిమగల బ్రహ్మసూత్ర మరకత శివాలయం లో గురువారం కార్తీకమాస అమావాస్యను పురస్కరించుకుని టాలీవుడ్ సినీ గేయ రచయిత రామ జోగయ్య శాస్త్రి దంపతులు స్వామి వారికి పూజలు, అభిషేకం చేశారు. అనంతరం ఆలయ కమిటీ చైర్మన్ గోపాల్ రెడ్డి, అర్చకులు సాయి శివ, ప్రమోద్ ఆయనను స్వామి వారి శేషవస్త్రంతో సత్కరించి, స్వామి వారి చిత్రపటాన్ని బహుకరించి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఉన్నారు.



## బాల్య వివాహాల నిర్మూలన ప్రతి ఒక్కరి బాధ్యత

- జిల్లా బాలల పరిరక్షణ విభాగం అధికారి భాను ప్రకాష్
- కౌకుంట్లలో బాల్య వివాహాల నిర్మూలనపైన అవగాహన

**చేవెళ్ల, రాజముద్ర న్యూస్:** చేవెళ్ళ మండలం కౌకుంట్ల గ్రామంలోని జిల్లా పరిషత్ ప్రాథమిక పాఠశాలలో బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమాన్ని గురువారం ఐసిడిఎస్ సిబ్బంది ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా బాలల పరిరక్షణ విభాగం అధికారి భాను ప్రకాశ్ మాట్లడుతూ.... 18 సంవత్సరాల లోపు అమ్మాయిలకు, 21 సంవత్సరాల లోపు అబ్బాయిలకు వివాహం చేస్తే అది బాల్య వివాహం అవుతుందని, కావున బాల్య వివాహాలు జరిపితే 1 లక్ష రూపాయలు జరిమానా, రెండు సంవత్సరాలు జైలు శిక్ష పడుతుందని తెలిపారు. బాల్య వివాహానికి సహకరించిన ప్రతి ఒక్కరిపైన చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది అన్నారు. గ్రామ స్థాయిలోని అధికారులు బాల్య వివాహాలు జరగకుండా చూడాలన్నారు. బాల్య వివాహాలు చేస్తున్నట్టు సమాచారం తెలిస్తే వెంటనే చైల్డ్ హెల్ప్ లైన్ 1098 టోల్ ఫ్రీ నెంబర్ కు కాల్ చేయాలని సూచించారు. సూపర్వైజర్ శకుంతల మాట్లడుతూ... ప్రతి ఒక్కరూ బాల్య వివాహం జరగకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, అంగన్వాడీ టీచర్స్ పాల్గొన్నారు.

## అంగారకుడి ఉపరితలంపై
# మిస్టీరియస్ శిల

- అంతరిక్ష పరిశోధనా సంస్థ నాసా గుర్తింపు
- రోవర్ పంపిన చిత్రాలపై మరిన్ని పరిశోధనలు

**న్యూయార్క్, నవంబర్ 20 :** అమెరికా అంతరిక్ష పరిశోధనా సంస్థ నాసా అంగారకుడి ఉపరితలంపై మిస్టీరియస్ రాయిని గుర్తించింది. ఈ రాయి మార్స్ సహజ, భౌగోళిక నిర్మాణంతో పూర్తిగా భిన్నంగా కనిపిస్తున్నది. శాస్త్రవేత్తలు 80 సెంటీమీటర్ల పొడవున్న ఈ రాయికి 'ఫిప్పాక్స్‌లా' అని నామకరణం చేశారు. ప్రస్తుతానికి ఈ రాయిని ఏలియన్ రాక్‌గా పేర్కొంటున్నారు. ఈ రాయిని సెప్టెంబర్ 19న గుర్తించారు. నాసా పెర్సెవరెన్స్ రోవర్ పంపిన ఈ రాయిని చూసి నాసా శాస్త్రవేత్తలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. రోవర్ జెజెరో క్రేటర్ సమీపంలోని వెర్నోడెన్ ప్రాంతంలోని రాళ్లపై అధ్యయనం జరుపుతున్నది. రోవర్ మాస్ట్‌క్యామ్-జెడ్ కెమెరా ఈ రాయిని గుర్తించి ఫొటో తీసింది. ఈ ఫొటోను నాసా బ్లాగ్ పోస్ట్‌లో షేర్ చేసింది. ఫిప్పాక్స్‌లా మరో సౌర వ్యవస్థకు చెందిన కావొచ్చునని తెలిపింది. ఈ రాయి విన్న డేన్స్‌ను పోలి ఉంటుందని పరిశోధకులు పేర్కొంటున్నారు. మరో సిద్ధాంతం ఏంటంటే ఇది ఉల్కాపాతం ఫలితంగా కూడా వచ్చి ఉండవచ్చని పేర్కొంటున్నారు. క్యూరియాసిటీ రోవర్ 2014లో రెండు మీటర్ల వెడల్పు లెబనాన్ ఉల్కను, 2023లో కాకో ఉల్కను గుర్తించింది. ఈ తర్వాత శాస్త్రవేత్తలు జెజెరో క్రేటర్‌లో ఇలాంటి లోహాలను గుర్తించాలని ఆశించారు. ఈ రాక్‌ను నాసా పరిశోధకుల బృందం గతవారంలో నిశితంగా పరిశీలించింది. రాయి ఆకారం, పరిమాణం, చుట్టుపక్కల ప్రాంతాల్లోని రాళ్లతో పోలిస్తే భిన్నంగా ఉందని పేర్కొంది. పెర్సెవరెన్స్ రోవర్ సూపర్‌క్యామ్ లేజర్, స్పెక్ట్రోమీటర్లతో చేసిన విశ్లేషణలో ఈ రాయిలో ఐరన్, నికెల్ మూలకాలు ఎక్కువ సాంద్రతతో ఉన్నట్లుగా గుర్తించారు. అంగారకుడి ఉపరితలంపై ఇలాంటి మూలకాలు చాలా అరుదుగా కనిపిస్తాయి. గ్రహశకలాల కేంద్ర భాగాల్లో ఏర్పడే ఐరన్-నికెల్ ఉల్కలలో అధికంగా ఉంటాయి. ఈ క్రమంలో మరో సౌర వ్యవస్థ నుంచి మార్స్‌పైకి వచ్చి ఉండవచ్చని నాసా అంచనా వేస్తున్నది.



## జెలెన్‌స్కీకి షాకిచ్చిన ట్రంప్..

**వాషింగ్టన్, నవంబర్ 20 :** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీకి షాక్ ఇచ్చారు. పుతిన్ ప్రభుత్వానికి అనుకూలంగా ఉన్న రష్యా-ఉక్రెయిన్ శాంతి ప్రణాళికను చడీచప్పుడు లేకుండా ఆమోదించారు. ఈ మేరకు అంతర్జాతీయ మీడియా కథనం వెల్లడించింది. మూడేళ్లకు పైగా కొనసాగుతోన్న రష్యా-ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు పలికేందుకు 28 పాయింట్లతో ఒక ప్లాన్ సిద్ధం చేశారు. అందులో ఎక్కువ పాయింట్లు రష్యాకు అనుకూలంగా ఉన్నాయి. ఆ ప్రతిపాదనలను అమెరికా, రష్యా అధికారులు సంయుక్తంగా రూపొందించారు. ఇటీవల దానిని జెలెన్‌స్కీ ప్రభుత్వానికి అందించారు. దీనిపై ట్రంప్ ప్రత్యేక రాయబారి స్టీవ్ విట్కాఫ్, ఉక్రెయిన్ జాతీయ భద్రతాధిపతి రుస్తుమ్ ఉమరోవ్ మధ్య సమావేశం జరిగింది. ఈ ప్రణాళికకు అంగీకారం తెలపాలని అమెరికా కోరుకుంటుందని ఆ సందర్భంగా విట్కాఫ్ స్పష్టం చేశారు. కానీ పలు నిబంధనలను జెలెన్‌స్కీ వ్యతిరేకిస్తున్నారు. వాటిని అంగీకరించడం అంటే తమ సార్వభౌమత్వాన్ని వదులుకోవడమేనని కీవ్ ఆందోళన వ్యక్తంచేస్తోంది. మిత్ర దేశం నిరాకరిస్తున్నా.. ట్రంప్ మాత్రం దానికి మద్దతు తెలిపారని ఆ కథనం పేర్కొంది. ఆ ప్లాన్ ప్రకారం.. ఉక్రెయిన్ తూర్పు డాన్‌బాస్‌లో ఇప్పటికే తమ నియంత్రణలో ఉన్న ప్రాంతంతో పాటు మిగిలిన ప్రాంతాన్ని రష్యాకు అప్పగించాలి. ఉక్రెయిన్ తన సైనిక బలాన్ని సగానికి సగం తగ్గించుకోవాలి. అలాగే ఆ దేశ రక్షణకు కీలకమైన అమెరికా సైనిక సహాయాన్ని ఉపసంహరించుకోవాలి. ఉక్రెయిన్ గడ్డపై విదేశీ బలగాలకు అనుమతి ఉండకూడదు. రష్యా భూభాగంలోకి దాడి చేయగల ఆయుధాలను ఉక్రెయిన్‌కు ఎవరూ అందించకూడదు. స్వదేశంలో వెలుగుచూస్తోన్న అవినీతి కుంభకోణాల్లో తన సన్నిహితుల పేర్లు ఉండటంతో జెలెన్‌స్కీ రాజకీయంగా ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఆయన సహాయకుల్లో పలువురిని వారి పదవుల నుంచి తొలగించాలన్న డిమాండ్లు తీవ్రమవుతున్నాయి. ఈ రాజకీయ అస్థిరతలను వాషింగ్టన్ ఒక అవకాశంగా చూస్తోందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలోనే ఈ ప్లాన్‌ను ప్రతిపాదించడం గమనార్హం.



## నేపాల్‌లో మళ్లీ జెన్-జడ్ ఆందోళనలు

**నేపాల్ :** నేపాల్‌లో మళ్లీ జెన్-జడ్ ఆందోళనలు చెలరేగాయి. గతంలో అధికారంలో ఉన్న పార్టీ మద్దతుదారులు, యువ నిరసనకారుల మధ్య పలు ప్రాంతాల్లో ఘర్షణ వాతావరణం నెలకొంది. దాంతో అప్రమత్తమైన ప్రభుత్వం కర్ఫ్యూ అమల్లోకి తెచ్చింది. ఎక్కువ మంది ఒక చోట చేరడంపై నిషేధం విధించింది. ఇటీవల నేపాల్‌లో జనరేషన్-జడ్ నిరసనలు కేపీ శర్మ ఓలీ ప్రభుత్వాన్ని గద్దెదించిన విషయం తెలిసిందే. బారా జిల్లాలో బుధవారం జెన్-జడ్ నిరసనకారులు, ఓలీ మద్దతుదారులు ర్యాలీలు నిర్వహించారు. కొద్దిసేపటికే రెండు గ్రూపుల మధ్య ఘర్షణ చెలరేగింది. ఎయిర్‌పోర్ట్ సమీపంలో కూడా పరిస్థితులు ఉద్రిక్తంగా మారడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. దాంతో ఈ రాత్రి వరకు కర్ఫ్యూ అమల్లో ఉంటుందని వెల్లడించారు. శాంతియుత పరిస్థితులను నెలకొల్పేందుకు భద్రతా బలగాలు సన్నద్ధతతో ఉండాలని నేపాల్ తాత్కాలిక ప్రధాని సుశీలా కార్కి ఆదేశించారు. రాజకీయంగా రెచ్చగొట్టే సమాచారానికి ప్రజలంతా దూరంగా ఉండాలని, ప్రజాస్వామ్య ప్రక్రియపై విశ్వాసం ఉంచాలని పిలుపునిచ్చారు. రెండు నెలల క్రితం సామాజిక మాధ్యమాల నిషేధంతో మొదలై.. అవినీతికి వ్యతిరేక ఉద్యమంగా మారిన నేపాల్ ఆందోళనలు హింసాత్మక రూపం దాల్చిన సంగతి తెలిసిందే. దాంతో ప్రధాని కేపీ శర్మ సహా పలువురు మంత్రులు తమ పదవులకు రాజీనామా చేశారు. ఆ క్రమంలోనే తాత్కాలిక ప్రధానిగా సుశీల నియమితులయ్యారు. 2026 మార్చి 5న ఎన్నికలు జరగనున్నాయి. వాటిని ప్రజాస్వామ్యయుతంగా నిర్వహించే దిశగా తాము పనిచేస్తామని ఆమె గతంలో వెల్లడించారు.

# జెఫ్రీ ఎప్‌స్టీన్ సెక్స్ కుంభకోణం

### ఫైల్స్ విడుదల బిల్లుపై ట్రంప్ సంతకం



**వాషింగ్టన్, నవంబర్ 20 :** అమెరికాను కుదిపేసిన సెక్స్ కుంభకోణం ఎప్‌స్టీన్ ఫైల్స్‌కు సంబంధించి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజాగా కీలక నిర్ణయం తీసుకున్నారు. ఎఫ్‌స్టీన్ ఫైల్స్‌ను విడుదల చేసే బిల్లుపై ట్రంప్ సంతకం చేశారు. ఈ విషయాన్ని ట్రంప్ ట్రూత్ సోషల్‌లో ప్రకటించారు. ఈ సందర్భంగా డెమోక్రాట్లపై పలు ఆరోపణలు చేశారు. 'డెమోక్రాట్ల గురించి.. లైంగిక నిందితుడు జెఫ్రీతో వారికి ఉన్న అనుబంధాల గురించిన నిజాలు బహుశా త్వరలోనే బయటపడవచ్చు. ఎందుకంటే నేను ఈ కేసుకు సంబంధించిన ఫైల్స్ విడుదల బిల్లుపై సంతకం చేశాను' అని ట్రంప్ పేర్కొన్నారు. తమ విజయాల నుంచి ప్రజల దృష్టిని మరల్చేందుకు.. ఎప్‌స్టీన్ కేసును ఆయుధంగా పదేపదే ఉపయోగిస్తున్నారన్నారు. 'ఎప్‌స్టీన్ ఫైల్స్ ట్రాన్స్పరెన్సీ యాక్ట్' అని ఈ బిల్లుకు పేరు పెట్టారు. ఈ ఫైల్స్ విడుదల చేయడాన్ని తాను వ్యక్తిగతంగా సాధించిన పారదర్శక విజయంగా ట్రంప్ అభివర్ణించారు. ఎప్‌స్టీన్ ఫైల్స్ విడుదల అంశాన్ని మంగళవారం ప్రతినిధుల సభ ముందుకు తీసుకురాగా.. 427-1 ఓట్లతో ఆమోదం లభించింది. తర్వాత సెనెట్‌లో దీనికి ఏకగ్రీవ ఆమోదం లభించాక.. తాజాగా ట్రంప్ దానిపై సంతకం చేశారు. ఇక, ఇప్పుడు న్యాయశాఖ ఎప్‌స్టీన్‌కు సంబంధించి అన్ని ఫైల్స్‌తో పాటు 2019లో జైలులో అతడి మరణంపై దర్యాప్తు గురించిన సమాచారాన్ని 30 రోజుల్లో విడుదల చేయాల్సి ఉంటుంది. అయితే, బాధితులకు సంబంధించిన వివరాలు, దర్యాప్తును ప్రభావితం చేసే వివరాలను బయట పెట్టకుండా ఉండే అవకాశాన్ని కల్పిస్తోంది. ఎప్‌స్టీన్ సెక్స్ కుంభకోణం అగ్రరాజ్యాన్ని కుదిపేసిన విషయం తెలిసిందే. ఎప్‌స్టీన్ పేద, మధ్యతరగతి బాలికలు, యువతులకు భారీ మొత్తం ఆశ చూపించి ఇళ్లకు రప్పించి అఘాయిత్యాలకు పాల్పడేవాడనేది ప్రధాన ఆరోపణ. కొన్నేళ్ల తర్వాత ఈ చీకటి వ్యవహారం బయటపడింది. అరెస్టైన నిందితుడు ఎప్‌స్టీన్ 2019లో జైల్లోనే అనుమానాస్పద స్థితిలో మరణించాడు. ఎప్‌స్టీన్ కేసు ఫైల్స్‌లో ట్రంప్ పేరు కూడా ఉందని గతంలో వార్తలు వచ్చాయి. అయితే, ఎప్‌స్టీన్‌తో పరిచయం ఉన్నప్పటికీ.. ట్రంప్ ఎలాంటి తప్పు చేయలేదని వైట్‌హౌస్, స్పీకర్ జాన్సన్ అన్నారు. ఎప్‌స్టీన్ ఫైల్స్‌ను బహిర్గతం చేయడాన్ని ఇంతవరకు ట్రంప్ వ్యతిరేకిస్తూ వచ్చినా రాజకీయ ఒత్తిళ్ల నేపథ్యంలో యూటర్న్ తీసుకున్న ఆయన.. ఈ బిల్లుకు మద్దతివ్వాలంటూ రిపబ్లికన్లను కోరారు.

## అమెరికాతో 93 మిలియన్ డాలర్ల
# ఆయుధ ఒప్పందం

### అధునాతన జావెలిన్ క్షిపణి వ్యవస్థ సరఫరాకు అంగీకారం



**వాషింగ్టన్, నవంబర్ 20 :** భారత్-అమెరికాల మధ్య కీలకమైన రక్షణ ఒప్పందం కుదిరింది. దీంతో అధునాతన జావెలిన్ క్షిపణి వ్యవస్థ మన దేశానికి అందనుంది. రష్యాతో పోరులో ఉక్రెయిన్‌కు వరంలా వచ్చిన ఈ ఆయుధానికి ప్రపంచవ్యాప్తంగా విపరీతమైన ఆదరణ ఉంది. భుజం మీద నుంచి గురిపెట్టి ప్రయోగించే ఈ మిసైల్.. కొన్ని వందల సంఖ్యలో రష్యన్ ట్యాంకులను పేల్చేసింది. ఈ క్రమంలో అమెరికాతో 93 మిలియన్ డాలర్ల విలువైన ఆయుధాలను భారత్‌కు విక్రయించేందుకు అగ్రరాజ్యం ఆమోదించింది. జావెలిన్ ట్యాంక్ విధ్వంసకర క్షిపణిని భుజంపై నుంచి శత్రు ట్యాంకుల పైకి గురిపెట్టి ప్రయోగించవచ్చు. దీనిలో 3.7 అడుగుల క్షిపణి, డిస్పోజబుల్ లాంచ్ ట్యూబ్, కమాండ్ కంట్రోల్ యూనిట్ ఉంటాయి. వాస్తవానికి ట్యాంక్ విధ్వంసకర ఆయుధాన్ని ప్రయోగించిన ప్రదేశం నుంచి పొగ, వేడి వెలువడతాయి. ప్రత్యర్థులు హీట్ సెన్సర్లతో వాటిని గుర్తిస్తారు. కానీ, జావెలిన్‌లో తొలుత ట్యూబ్ నుంచి ఓ మోటర్ క్షిపణిని బయటకు కొంతదూరం విసురుతుంది. ఆ తర్వాత క్షిపణి మోటార్ పనిచేయడం మొదలుపెట్టి లక్ష్యం వైపు దూసుకెళుతుంది. దీనిని కంప్యూటర్‌తో నియంత్రిస్తారు. దీంతో కచ్చితంగా జావెలిన్‌ను ఎక్కడినుంచి ప్రయోగించారో శత్రువుకు అర్థం కాదు. ఈ లోపు ప్రయోగించిన వారు సురక్షిత ప్రదేశంలో దాక్కోవచ్చు. రీయాక్టివ్ ఆర్మర్ రక్షణ కవచాలను ఛేదించి.. ట్యాంకును ధ్వంసం చేసేలా దీనిలో రెండు దశల్లో పేలుడు పదార్థాలను అమర్చారు. తొలిదశలో కవచాన్ని ఛేదించి.. ఆ తర్వాత దశలో వార్‌హెడ్ ట్యాంక్‌ను ధ్వంసం చేస్తుంది. వీటిని అమెరికాకు చెందిన రక్షణరంగ దిగ్గజాలు రేథియాన్, లాక్‌హీడ్ మార్టీన్ సంస్థలు అభివృద్ధి చేశాయి. వీటి ఉత్పత్తి చాలా క్లిష్టమైన, ఖరీదైన వ్యవహారం. వీటి ధర 2 లక్షల డాలర్ల వరకూ ఉంటుందని అంచనా. రష్యాతో పోరులో ఉక్రెయిన్ ఈ క్షిపణులను విపరీతంగా వినియోగించింది. మాస్కోకు చెందిన పలు యుద్ధ ట్యాంకులను పేల్చేసింది. వీటి నుంచి తప్పించుకోవడం కోసం రష్యా తమ ట్యాంకులపై లోహపు బోన్లను అమర్చిందంటే.. వీటి సామర్థ్యాన్ని అర్థం చేసుకోవచ్చు. మొత్తం 93 మిలియన్ డాలర్ల ఆయుధాలను విక్రయించేందుకు భారత్-అమెరికా మధ్య ఒప్పందం కుదిరింది. ఇందులో 45.7 మిలియన్ డాలర్ల విలువైన జావెలిన్ మిసైల్ వ్యవస్థలు, సంబంధిత హార్డ్‌వేర్‌ను అగ్రరాజ్యం అందించనుంది. దీంతోపాటు 47.1 మిలియన్ డాలర్ల విలువైన ఎక్స్‌కాలిబర్ ప్రొజెక్టైల్స్, ఇతర సైనిక పరికరాలను విక్రయించనుంది. తొలివిడతలో భాగంగా జావెలిన్ ఎఫ్‌జీఎం-148 మిసైల్స్, 25 జావెలిన్ లైట్‌వెయిట్ కమాండ్ లాంఛ్ యూనిట్స్ వంటి వాటిని భారత్‌కు అందించనుంది.

## 'మేధావి' ఉగ్రవాదులు మరింత ప్రమాదకరం

### 'సుప్రీం'లో పోలీసుల వాదన



**న్యూఢిల్లీ, నవంబర్ 20 :** మేధావులు ఉగ్రవాదులుగా మారితే.. క్షేత్రస్థాయిలోని వారికన్నా మరింత ప్రమాదకరంగా తయారవుతారని దిల్లీ పోలీసులు సుప్రీం కోర్టులో వాదించారు. డాక్టర్లు, ఇంజినీర్లు దేశ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడటం ఇప్పుడు ఓ ట్రెండ్‌గా మారిందన్నారు. దిల్లీలో 2020లో జరిగిన అల్లర్లకు సంబంధించి నిర్బంధంలో ఉన్న ఉమర్ ఖాలిద్, శర్జీల్ ఇమామ్ తదితరుల బెయిల్ పిటిషన్లను తీవ్రంగా వ్యతిరేకిం చారు. వారికి బెయిల్ ఇవ్వొద్దని జస్టిస్ అరవింద్ కుమార్, జస్టిస్ ఎన్.వి.అంజరియాలతో కూడిన 'సుప్రీం' ధర్మాసనాన్ని కోరారు. పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ), జాతీయ పౌరసత్వ పట్టిక (ఎన్ఆర్సీ)లకు వ్యతిరేకంగా 2020లో దిల్లీలో జరిగిన నిరసనలు హింసాత్మకం కావడంతో 53 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ అల్లర్లకు సూత్రధారులుగా పేర్కొంటూ ఉమర్ ఖాలిద్, శర్జీల్ ఇమామ్, గుల్ఫిషా ఫాతిమా, మీరాన్ హైదర్, రహమాన్ తదితరులపై ఉగ్రవాద వ్యతిరేక చట్టాల కింద, అప్పటి ఐపీసీలోని వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి ఐదేళ్లుగా నిర్బంధంలో ఉంచిన సంగతి తెలిసిందే. నిందితుల వల్లే ఈ కేసులో జాప్యం జరిగిందని, దీన్ని వారు తమకు అనుకూలంగా మలుచుకోలేరని దిల్లీ పోలీసుల తరఫున హాజరైన అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్.వి.రాజు 'సుప్రీం' ధర్మాసనం ఎదుట వాదించారు. 'సీఏఏ'కు వ్యతిరేకం గా ఇమామ్ రెచ్చగొట్టే ప్రసంగాలు చేశారని ఆరోపిస్తూ.. సంబంధిత వీడియోలను చూపించారు. ఇమామ్ ఓ ఇంజినీరి ంగ్ గ్రాడ్యుయేట్ అని పేర్కొంటూ.. "ఈ రోజుల్లో ఓ ట్రెండ్ నడుస్తోంది. వైద్యులు, ఇంజినీర్లు తమ పనులు చేయడం లేదు. దేశ వ్యతిరేక కార్యకలాపాల్లో పాల్గొంటున్నారు" అని వ్యాఖ్యానించారు. "ఇవి సాధారణ నిరసనలు కావు. హింసతో కూడుకున్నవి. అంతర్జాతీయ మీడియాలో కవరేజీ కోసం.. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత పర్యటనను వాడుకున్నారు. ఆందోళనల మాటున ప్రభుత్వాన్ని మార్చడమే వారి అంతిమ ఉద్దేశం. ఆర్థిక విధ్వంసం, దేశవ్యాప్తంగా గందరగోళాన్ని సృష్టించడమే వారి లక్ష్యం. మేధావులు అని అనిపించుకునే వాళ్లు క్షేత్రస్థాయి ఉగ్రవాదుల కన్నా ప్రమాద కరమైనవారు" అని రాజు అన్నారు. బుధవారం సైతం ఈ పిటిషన్లపై వాదనలు జరిగాయి. ఇది కేవలం సీఏఏకి వ్యతిరే కంగా జరిగిన ఉద్యమం కాదని, సమాజాన్ని మత ప్రాతిప దికన విభజించే ప్రయత్నమని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా పేర్కొన్నారు.

## కశ్మీర్ టైమ్స్ ఆఫీసులో సోదాలు.. ఏకే-47 తూటాలు లభ్యం

**జమ్మూకశ్మీర్ :** జమ్మూకశ్మీర్‌లోని ఓ మీడియా సంస్థ కార్యాలయంలో తూటాలు లభ్యంకావడం కలకలం సృష్టిస్తోంది. పోలీసు విభాగానికి చెందిన స్టేట్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ జరిపిన సోదాల్లో జమ్మూలోని కశ్మీర్ టైమ్స్ ఆఫీసులో ఏకే-47 బుల్లెట్లు దొరికాయని పోలీసు వర్గాలు వెల్లడించాయి. క్యాట్రిడ్జ్‌లు, పిస్టల్ రౌండ్స్, మూడు గ్రనేడ్ లెవర్స్‌ను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నాయి. గురువారం ఉదయం నుంచి ఈ తనిఖీలు జరుగుతున్నాయి. కశ్మీర్ టైమ్స్ ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ అనూరాధ భాసిన్‌పై ఎఫ్ఐఆర్ నమోదైంది. భారతదేశం, జమ్మూకశ్మీర్ కేంద్ర పాలిత ప్రాంతానికి వ్యతిరేకంగా, వేర్పాటు వాదానికి అనుకూల సమాచారాన్ని వ్యాప్తి చేస్తున్నారన్న ఆరోపణల నేపథ్యంలో ఈ సోదాలు జరిగాయి. ఆమె కార్యకలాపాలు, సంబంధాలను పరిశీలించడమే దర్యాప్తు లక్ష్యమని పోలీసు వర్గాలు వెల్లడించాయి. కశ్మీర్ టైమ్స్.. జమ్మూకశ్మీర్‌కు చెందిన ప్రముఖ మీడియా సంస్థ. దీనిని వేద్ భాసిన్ స్థాపించారు. 1954లో ఇది ప్రచురణను ప్రారంభిం చింది. 1964 వరకు వీక్లీగా ఉన్న ఈ పత్రిక తర్వాత డైలీగా మారింది. ఈ సోదాలపై కశ్మీర్ టైమ్స్ సీనియర్ ఎడిటర్లు ప్రబోధ్ జమ్వాల్, అనూరాధ స్పందించారు.




## విదేశీ ఉద్యోగులు లేకపోతే
# విజయం సాధించలేం

### ట్రంప్ కీలక వ్యాఖ్యలు

**వాషింగ్టన్, నవంబర్ 20 :** హెచ్-1బీ వీసా ఉద్యోగులను ఉద్దేశిస్తూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజాగా కీలక వ్యాఖ్యలు చేశారు. విదేశీ ఉద్యోగుల అవసరం అమెరికాకు ఉందని అంగీకరించారు. ఈ విషయాన్ని 'మాగా' మద్దతుదారులు అర్థం చేసుకోకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. అమెరికా- సౌదీ పెట్టుబడుల ఫోరమ్‌లో మాట్లాడుతూ.. ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. అమెరికాలో చాలా పెద్ద సంఖ్యలో ప్లాంట్లను నిర్మించనున్నట్లు తెలిపారు. ఇవి దేశ ఆర్థికవృద్ధికి దోహదపడతాయన్నారు. ఈ ప్లాంట్లలో పనిచేసేందుకు నైపుణ్యం కలిగిన విదేశీయులను తీసుకురావాల్సి ఉంటుందన్నారు. వారు అమెరికన్లకు కూడా ఆ నైపుణ్యాలను నేర్పించాలన్నారు. యూఎస్‌లోని కంపెనీ ల్లో బిలియన్ డాలర్ల కొద్దీ పెట్టుబడులు పెట్టే వారిని అనుమతించకపోతే.. తాము విజయం సాధించలేమని ట్రంప్ వ్యాఖ్యానించారు. విదేశీ ఉద్యోగులు అమెరికన్లకు నైపుణ్యాలు నేర్పించి తిరిగి స్వదేశాలకు వెళ్లొచ్చన్నారు. విదేశీ వృత్తి నిపుణులు వేలాది మందిని తమతో తీసుకురావాలని.. వారిని తాను స్వాగతిస్తానని ట్రంప్ చెప్పారు. యూఎస్‌లో అధిక నైపుణ్యం కలిగిన విదేశీ ఉద్యోగుల అవసరం ఉందని వ్యాఖ్యానించారు. ఇది మాగా సభ్యులకు అర్థం కాలేదంటూ అసహనం వ్యక్తంచేశారు. విదేశీ ఉద్యోగులను అనుమతించకపోతే తాము విజయం సాధించలేమని అంగీకరించారు. ట్రంప్ అధికారం చేపట్టినప్పటి నుంచి వలసలపై కఠిన నిర్ణయాలు తీసుకుంటూ వస్తున్నారు. ఇటీవల హెచ్1బీ వీసా ఫీజును లక్ష డాలర్లకు పెంచుతున్నట్లు చేసిన ప్రకటన ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. విదేశీ వృత్తి నిపుణుల కారణంగా అమెరికన్లకు ఉద్యోగావకాశాలు లభించడం లేదని మొన్నటి వరకు ట్రంప్ వాదించారు. అయితే, దీనిపై ఇటీవల ఆయన స్వరం మార్చారు. హెచ్-1బీ వీసా కార్యక్రమాన్ని ట్రంప్ సమర్థించారు. ప్రపంచంలోని ప్రతిభావంతులను అమెరికాకు తీసుకువచ్చేందుకు ఇది ఉపయోగపడుతుందన్నారు. విదేశీ ఉద్యోగుల అవసరం తమకు ఉందని.. వారు యూఎస్‌కు వచ్చి స్థానికులకు నైపుణ్యాలు నేర్పించి వెళ్లాలంటూ సూచనలు చేశారు. అయితే, ట్రంప్ నిర్ణయాలను మాగా సభ్యులు వ్యతిరేకిస్తున్నారు.



## బంగ్లా ఎన్నికలు..

### ఇక కేర్‌టేకర్ ప్రభుత్వాల కిందే..

**బంగ్లాదేశ్ :** బంగ్లాదేశ్‌లో విద్యార్థుల అల్లర్ల నేపథ్యంలో మాజీ ప్రధాని హసీనా సర్కారు కుప్పకూలిన అనంతరం.. యూనస్ నేతృత్వంలో కేర్‌టేకర్ ప్రభుత్వం ఏర్పడిన సంగతి తెలిసిందే. యూనస్ ప్రభుత్వ అధికారాలను విస్తృతం చేసేలా.. ఆ దేశంలోని సుప్రీంకోర్టు తాజాగా సంచలన తీర్పు వెలువరించింది. పార్టీయేతర కేర్‌టేకర్ ప్రభుత్వ వ్యవస్థను పునరుద్ధరిస్తున్నట్లు తెలిపింది. ఎన్నికల సమయంలో నిష్పాక్షికంగా పనిచేసే కేర్‌టేకర్ ప్రభుత్వ వ్యవస్థను రద్దు చేస్తూ 2011లో సుప్రీం తీర్పునిచ్చింది. తాజాగా ఆ తీర్పు చట్టవిరుద్ధమని అత్యున్నత న్యాయస్థానం వ్యాఖ్యానించింది. ప్రధాన న్యాయమూర్తి రెఫాత్ అహ్మద్ నేతృత్వంలోని ఏడుగురు సభ్యులతో కూడిన అప్పిలేట్ డివిజన్ గురువారం ఈ తీర్పును వెలువరించింది. 1996లో ఈ కేర్‌టేకర్ ప్రభుత్వ వ్యవస్థను ప్రవేశపెట్టారు. పార్టీతో సంబంధం లేకుండా నిష్పాక్షికంగా, స్వేచ్ఛగా ఎన్నికలు జరిగేలా చూడటం దీని ప్రధాన విధి. ఇది మొత్తం 90 రోజులు అధికారంలో ఉంటుంది. తాజా తీర్పు నేపథ్యంలో ప్రస్తుతం యూనస్ నేతృత్వంలో ఉన్న కేర్‌టేకర్ ప్రభుత్వం ఆధ్వర్యంలోనే 13వ పార్లమెంటు ఎన్నికలు జరగనున్నాయి. ఆ తర్వాత సుప్రీం తీర్పు ప్రకారం.. 14వ పార్లమెంటు ఎన్నికల నుంచి కేర్‌టేకర్ ప్రభుత్వ వ్యవస్థ అమల్లోకి వస్తోంది. బంగ్లా మాజీ ప్రధాని షేక్ హసీనాకు ఆ దేశంలోని అంతర్జాతీయ నేర విచారణ ట్రైబ్యునల్ (ఐసీటీ) మరణశిక్ష విధిస్తూ సంచలన తీర్పు ప్రకటించిన సంగతి తెలిసిందే. గతేడాది జరిగిన ఆందోళనల సమయంలో మానవత్వానికి వ్యతిరేకంగా నేరాలకు పాల్పడ్డారనే కేసుపై హసీనాతో పాటు ఆమె సన్నిహితులపైనా ఐసీటీ ఈ తీర్పునిచ్చింది. ఈ క్రమంలోనే హసీనాను ఎలాగైనా స్వదేశానికి రప్పించాలని యూనస్ సర్కారు పట్టుదలతో ఉంది. ప్రస్తుతం ఆమె భారత్‌లో ఉంది. హసీనాను తమకు అప్పగించాలని యూనస్ ప్రభుత్వం కోరుతున్నప్పటికీ.. భారత్ విముఖత చూపుతోంది. ఈ క్రమంలో యూనస్ ప్రభుత్వానికి అనుకూలించేలా ఆ దేశ సుప్రీం ఇలాంటి తీర్పునివ్వడం గమనార్హం.

## బాలుడికి గాయమైతే ఫెవిక్విక్ రాసి..

### ఉత్తర్‌ప్రదేశ్‌లో డాక్టర్ నిర్వాకం

**ఉత్తర్‌ప్రదేశ్ :** గాయాలతో ఆసుపత్రికి వచ్చిన ఓ చిన్నారి పట్ల ఓ డాక్టర్ నిర్లక్ష్యంగా వ్యవహరించారు. చికిత్సలో కుట్లకు బదులు ఫెవిక్విక్ వాడటంతో ఆ తల్లిదండ్రులు కంగుతిన్నారు. ఉత్తర్‌ప్రదేశ్‌లోని మేరఠ్‌లో వెలుగు చూసిన ఈ ఘటనపై దర్యాప్తు జరుగుతోంది. అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం.. మేరఠ్‌లోని జాగృతి విహార్ కాలనీలో సర్దార్ జస్పిందర్ సింగ్ కుటుంబం నివసిస్తోంది. ఇటీవల అతడి కుమారుడు ఇంటివద్ద ఆడుకుంటూ గాయపడ్డాడు. తలకు దెబ్బతగిలింది. దాంతో వెంటనే దగ్గర్లోని ఒక ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. అప్పుడు అక్కడ విధుల్లో ఉన్న డాక్టర్ ఐదు రూపాయాల ఫెవిక్విక్ తీసుకొని, గాయంపై వేశారు. కుట్లు వేయడానికి బదులుగా దానిని ఉపయోగించారు. ఆ తర్వాత నుంచి ఆ పిల్లాడు నొప్పితో విలవిల్లాడిపోయాడు. "అబ్బాయి భయపడుతున్నాడు. కొద్దిసేపట్లో నొప్పి తగ్గిపోతుంది" అని తమకు చెప్పాడని డాక్టర్ నిర్వాకం గురించి సింగ్ దంపతులు ఫిర్యాదులో పేర్కొన్నారు. రాత్రి గడిచినా ఆ నొప్పి తగ్గకపోవడంతో మరో ఆసుపత్రికి తీసుకెళ్లారు. అప్పటికే గాయంపై అంటుకుపోయిన ఫెవిక్విక్‌ను తొలగించేందుకు మరో ఆసుపత్రి వైద్యులకు 3 గంటల సమయం పట్టింది. అనంతరం గాయానికి కుట్లు వేశారు. ఒకవేళ ఫెవిక్విక్ కంట్లోకి జారి ఉంటే పరిస్థితి ఎలా ఉండేదో అని ఆ తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తంచేశారు. ఈ ఘటన తమ దృష్టికి వచ్చిందని మేరఠ్ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ అశోక్ కఠారియా మీడియాకు వెల్లడించారు. దర్యాప్తులో గుర్తించిన అంశాల ఆధారంగా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

# అనిల్ అంబానీకి చెందిన మరిన్ని ఆస్తులు అటాచ్

రిలయన్స్ గ్రూప్ ఛైర్మన్ అనిల్ అంబానీ మనీలాండరింగ్ ఆరోపణలు ఎదుర్కొంటున్న సంగతి తెలిసిందే. దీని దర్యాప్తును ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ముమ్మరం చేసింది. తాజాగా రిలయన్స్ గ్రూప్‌నకు సంబంధించిన మరిన్ని ఆస్తులను అటాచ్ చేసినట్లు తెలుస్తోంది. ఇప్పటికే రూ.7,500 కోట్ల విలువైన ఆస్తులను ఈడీ అటాచ్ చేసింది. తాజాగా జత చేసిన ఆస్తుల విలువ రూ.1,400 కోట్లకు పైగా ఉండొచ్చని అంచనా వేస్తున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. ఈడీ తాజా చర్యలపై రిలయన్స్ గ్రూప్ ఇప్పటివరకు ఎలాంటి ప్రకటన చేయలేదు. ఈ కేసుకు సంబంధించి ఇటీవల ఈడీ ముందు విచారణకు హాజరుకావాల్సిన అనిల్ అంబానీ గైర్హాజరయ్యారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరవుతానని ఆయన అభ్యర్థించగా.. ఈడీ అందుకు నిరాకరించింది. అనిల్ గ్రూప్ కంపెనీలు కోట్ల రూపాయల బ్యాంకు రుణాల మోసానికి పాల్పడినట్లు ఆరోపణలు రావడంతో సీబీఐ దర్యాప్తు చేపట్టింది. కేంద్ర దర్యాప్తు సంస్థ ఎఫ్ఐఆర్ ఆధారంగా ఈడీ దీనిపై మనీలాండరింగ్ కేసు నమోదు చేసింది. రిలయన్స్ ఇన్‌ఫ్రా సహా అనిల్ అంబానీకి చెందిన పలు కంపెనీలు రూ.17,000 కోట్లకు పైగా నిధులను అక్రమంగా తరలించినట్లు ఆరోపణలున్నాయి. ఈ క్రమంలోనే ఈ ఏడాది జులైలో రిలయన్స్ గ్రూప్‌లోని 50 కంపెనీలకు చెందిన 35 ప్రాంతాల్లో, 25 మంది వ్యక్తులపై ఈడీ సోదాలు నిర్వహించింది. దీనిపై ఈడీ దర్యాప్తు కొనసాగుతుంది.








# ‘డార్క్ ప్యాటర్న్స్’కు 26 ఇ-కామర్స్ సంస్థలు గుడ్‌బై

**న్యూఢిల్లీ :** దేశంలోని 26 ప్రముఖ ఇ-కామర్స్ సంస్థలు తమ ప్లాట్‌ఫామ్స్‌లో డార్క్ ప్యాటర్న్స్ లేవని స్వయంగా ప్రకటించాయి. ఈ విషయాన్ని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. జెప్టో, జొమాటో, స్విగ్గీ, జియోమార్ట్, బిగ్‌బాస్కెట్ వంటి ప్లాట్‌ఫామ్స్ ఇందులో ఉన్నాయని తెలిపింది. డిజిటల్ మార్కెట్‌లో వినియోగదారుల హక్కుల రక్షణలో ఇదో కీలక ముందడుగుగా కేంద్ర వినియోగదారుల వ్యవహారాల శాఖ అభివర్ణించింది. ‘డార్క్ ప్యాటర్న్స్ ప్రివెన్షన్ అండ్ రెగ్యులేషన్’ మార్గదర్శకాలు-2023కు అనుగుణంగా తమ ప్లాట్‌ఫామ్‌లు ఉన్నట్లు ఈ సంస్థలు స్వీయ ప్రకటనలు సమర్పించాయి. వినియోగదారులను తప్పుదారి పట్టించే, మోసపూరిత ఆన్‌లైన్ డిజైన్ పద్ధతులను అరికట్టేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. దీంతో సంబంధిత సంస్థలు అంతర్గతంగా లేదా థర్డ్ పార్టీలతో ఆడిట్ నిర్వహించి డార్క్ ప్యాటర్న్స్‌ను గుర్తించి తొలగించాయి. డార్క్‌ప్యాటర్న్స్ ఏవీ తమ ప్లాట్‌ఫారాల్లో లేవని ఈ 26 సంస్థలు ప్రకటించాయని సెంట్రల్ కన్స్యూమర్ ప్రొటెక్షన్ అథారిటీ తెలిపింది. ఫాల్స్ అర్జెన్సీ, బాస్కెట్ స్నీకింగ్, కన్‌ఫర్మ్ షేమింగ్, ఫోర్స్డ్ యాక్షన్, సబ్‌స్క్రిప్షన్ ట్రాప్, ఇంటర్‌ఫేస్ ఇంటర్‌ఫియరెన్స్, బైట్ స్విచ్, డ్రిప్ ప్రైసింగ్, డిస్‌గైజ్డ్ అడ్వర్టైజ్‌మెంట్స్, నాగింగ్, ట్రిక్ వర్డింగ్, సాస్ బిల్లింగ్, రోగ్ మాల్వేర్స్ వంటివి డార్క్‌ప్యాటర్న్స్‌గా పేర్కొంటారు. ఫార్మ్‌ఈజీ, జెప్టో మార్కెట్‌ప్లేస్, ఫ్లిప్‌కార్ట్, మింత్రా, వాల్‌మార్ట్ ఇండియా, మేక్‌మైట్రిప్, బిగ్‌బాస్కెట్, జియోమార్ట్, జొమాటో, స్విగ్గీ, బ్లింకిట్, పేజ్ ఇండస్ట్రీస్, విలియమ్ పెన్, క్లియర్‌ట్రిప్, రిలయన్స్ జ్యువెల్స్, రిలయన్స్ డిజిటల్, నెట్‌మెడ్స్, టాటా 1ఎంజీ, మీషో, ఇక్సిగో, హామ్‌లేస్, అజియో, టిరా బ్యూటీ, డ్యూరోఫ్లెక్స్, కూరాడెన్ ఇండియా సంస్థలు స్వీయ ఆడిట్లు పూర్తి చేసి డార్క్ ప్యాటర్న్స్‌ను తొలగించినట్లు తెలిపాయి.

# లాభాల్లో ముగిసిన సూచీలు..



**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు భారీ లాభాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలకు తోడు ఫైనాన్షియల్, ఆయిల్ అండ్ గ్యాస్ స్టాక్స్‌లో కొనుగోళ్ల మద్దతుతో సూచీలు రాణించాయి. హెచ్‌డీఎఫ్‌సీ, రిలయన్స్ ఇండస్ట్రీస్ సూచీలకు దన్నుగా నిలిచాయి. ఈ క్రమంలోనే గతేడాది సెప్టెంబర్‌లో నమోదు చేసిన రికార్డు గరిష్ఠాలకు కాస్త దూరంలో నిలిచాయి. సెన్సెక్స్ ఉదయం 85,470.92 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 85,186.47) లాభాల్లో ప్రారంభమైంది. రోజంతా లాభాల్లోనే కొనసాగింది. ఇంట్రాడేలో 85,801.70 వద్ద గరిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 446.21 పాయింట్ల లాభంతో 85,632.68 వద్ద స్థిరపడింది. నిఫ్టీ సైతం 139.50 పాయింట్ల లాభంతో 26,192.15 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 88.71గా ఉంది. గతేడాది సెప్టెంబర్ 27న సెన్సెక్స్ 85,978 పాయింట్ల వద్ద జీవనకాల గరిష్ఠాలను తాకగా.. నిఫ్టీ 26,277 వద్ద ఆల్‌టైమ్ గరిష్ఠాలను నమోదు చేసింది. సెన్సెక్స్ 30 సూచీలో బజాజ్ ఫైనాన్స్, బజాజ్ ఫిన్‌సర్వ్, రిలయన్స్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, టెక్ మహీంద్రా షేర్లు ప్రధానంగా రాణించాయి. ఏషియన్ పెయింట్స్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, టైటాన్, హిందుస్థాన్ యూనిలీవర్, కోటక్ మహీంద్రా బ్యాంక్ షేర్లు నష్టాలు చవిచూశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ 64.14 డాలర్ల వద్ద ట్రేడవుతుండగా.. బంగారం ఔన్సు 4063 డాలర్ల వద్ద కొనసాగుతోంది.



# రెండో టెస్టులో గిల్ ఆడతాడా?

## అప్‌డేట్ ఇచ్చిన బ్యాటింగ్ కోచ్


భారత్, సౌతాఫ్రికా మధ్య నవంబర్ 22 నుంచి గువాహటిలో రెండో టెస్టు ప్రారంభంకానుంది. ఈ మ్యాచ్‌లో కెప్టెన్ శుభ్‌మన్ గిల్ ఆడతాడా? లేదా అనేది మ్యాచ్‌కు ముందు రోజు (నవంబర్ 21) తేలుతుందని భారత బ్యాటింగ్ కోచ్ సితాన్షు కోటక్ తెలిపాడు. శుక్రవారం అతనికి ఫిట్‌నెస్ నిర్వహిస్తారని, అనంతరం మ్యాచ్‌లో ఆడాలా? వద్దా అనేది ఫిజియో, డాక్టర్లు నిర్ణయిస్తారని పేర్కొన్నాడు. కోల్‌కతా టెస్టులో గిల్ మెడ నొప్పి కారణంగా ఆట మధ్యలోనే మైదానాన్ని వీడిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం టీమ్‌ఇ ండియాతోపాటు గువాహటికి వెళ్లిన భారత కెప్టెన్.. ప్రాక్టీస్‌కు దూరంగా ఉన్నాడు. ‘శుభ్‌మన్ గిల్ వేగంగా కోలుకుంటున్నాడు. నిన్న అతడితో మాట్లాడా. అతను మ్యాచ్ ఆడాలా? వద్దా అనే దానిపై రేపు (శుక్రవారం) సాయంత్రం ఫిజియో, డాక్టర్లు తుది నిర్ణయం తీసుకుంటారు. గిల్ పూర్తిగా కోలుకుని మళ్లీ సమస్య రాకుంటే ఆడతాడు. ఆట మధ్యలో మళ్లీ నొప్పి రాకుండా ఉండటం ముఖ్యం. ఏదైనా సందేహం ఉంటే విశ్రాంతి తీసుకుంటాడు. ఏ జట్టు అయినా శుభ్‌మన్ గిల్ వంటి కెప్టెన్, ప్లేయర్‌ని మిస్ కావాలని కోరుకోదు. అతను ఆడకపోతే భారత్‌కు మంచి ప్రత్యామ్నాయ ఆటగాళ్లున్నారు. అతని స్థానంలో వచ్చే ఆటగాడు సెంచరీ చేస్తాడేమో. గత మ్యాచ్‌లో భారత్ 30 పరుగుల తేడాతో ఓడింది. గిల్ రెండు ఇన్నింగ్స్‌ల్లో బ్యాటింగ్ చేసి ఉంటే 30 పరుగులు పెద్ద విషయం కాదు’ అని సితాన్షు కోటక్ వివరించాడు.



# కోచ్‌గా నేర్పించడం నీ బాధ్యత..

# ఆటగాళ్లను నిందించడమేంటి?

## గంభీర్‌పై మాజీ ప్లేయర్ ఆగ్రహం



సౌతాఫ్రికాతో జరిగిన తొలి టెస్టులో టీమ్‌ఇండియా ఓటమిపాలవడంతో హెడ్ కోచ్ గంభీర్‌పై తీవ్రస్థాయిలో విమర్శలు వస్తున్నాయి. గంభీర్ ఒంటెద్దు పోకడల వల్లే టీమ్‌ఇండియా స్వదేశంలోనూ పరాజయాలు చవిచూస్తోందని అభిమానులు, మాజీ క్రికెటర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కోల్‌కతాలో సఫారీలతో జరిగిన మ్యాచ్‌లో భారత్ 124 పరుగుల లక్ష్యాన్ని ఛేదించలేకపోయింది. దక్షిణాఫ్రికా స్పిన్నర్ల ధాటికి 93 పరుగులే చేసింది. ఈ ఓటమికి పిచ్ కారణం కాదని, బ్యాటర్లు సరిగ్గా ఆడకపోవడం వల్లే భారత్ ఓడిందని మ్యాచ్ అనంతరం గంభీర్ అన్నాడు. ఈ వాదనను మాజీ క్రికెటర్ మనోజ్ తివారీ తప్పుబట్టాడు. స్పిన్‌ను ఎలా ఎదుర్కోవాలనే విషయంలో సరిగ్గా కోచింగ్ ఇవ్వకపోవడం వల్లే భారత్ ఓడిందన్నాడు. విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ టెస్టు క్రికెట్‌లో కొనసాగటానికి ఆడటానికి సిద్ధంగా ఉన్నప్పటికీ.. జట్టు పరివర్తన దశ అంటూ వారు రిటైర్మెంట్ తీసుకునేలా ఒత్తిడి తెచ్చారని వ్యాఖ్యానించాడు. ‘భారత క్రికెట్‌లో పరివర్తన దశ అనేది దానికి తావు లేదు. భారత జట్టుకు పరివర్తన అవసరం లేదు. న్యూజిలాండ్, జింబాబ్వే వంటి దేశాలకు ఇది అవసరం. మా దేశవాళీ క్రికెట్‌లో ఎంతోమంది ప్రతిభావంతులు అవకాశాల కోసం ఎదురుచూస్తున్నారు. స్టార్ ఆటగాళ్లు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ మరికొంత కాలం టెస్టు క్రికెట్ ఆడాలని భావించారు. ఈ అనవసరమైన పరివర్తన అనే చర్చతో వారిపై ఒత్తిడి తీసుకొచ్చారు. దీంతో వారు రిటైర్మెంట్ ప్రకటించారు. సౌతాఫ్రికాతో తొలి టెస్టులో భారత్ ఓటమికి బ్యాటర్లను బాధ్యులను చేయడం కరెక్ట్ కాదు. ఓడిపోయిన తర్వాత వారి టెక్నిక్‌ను తప్పుపట్టలేరు. కోచ్‌గా నేర్పించడం మీ బాధ్యత. బ్యాటర్లు సరిగ్గా డిఫెన్స్ ఆడలేదని అంటున్నారు. మ్యాచ్‌కు ముందు మీరు సరిగ్గా ట్రైనింగ్ ఇవ్వలేదు? గంభీర్ ఆటగాడిగా ఉన్నప్పుడు స్పిన్ బాగా ఆడేవాడు. కాబట్టి, అతను మరింత బాగా నేర్పించాలి’ అని మనోజ్ తివారీ సూచించాడు. నవంబర్ 22 నుంచి గువాహటి వేదికగా భారత్, సౌతాఫ్రికా మధ్య రెండో టెస్టు ప్రారంభం కానుంది. మనోజ్ తివారీ భారత్ తరఫున 12 వన్డేలు ఆడి 26.09 సగటుతో 287 పరుగులు చేశాడు. అంతర్జాతీయ టీ20ల్లో ఒకే ఇన్నింగ్స్ ఆడి 15 రన్స్ చేశాడు. ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో 148 మ్యాచ్‌లు ఆడి 47.86 సగటుతో 10,195 పరుగులు చేశాడు. ఇందులో 30 సెంచరీలు, 45 అర్ధ శతకాలున్నాయి.

# ఐపీఎల్ ఆరు నెలల లీగ్‌గా మారాలి

# వేలంను ఆపేయండి

## మాజీ క్రికెటర్ రాబిన్ ఉతప్ప




**ఐపీఎల్‌లో వేలం ప్రక్రియను తొలగించి ఏడాది పొడవునా ఆటగాళ్లను ట్రేడ్ చేసుకోవడానికి వీలు కల్పించి, డ్రాఫ్ట్ సిస్టమ్‌కు మారాలని మాజీ క్రికెటర్ రాబిన్ ఉతప్ప అభిప్రాయపడ్డాడు. మారుతున్న కాలానికి అనుగుణంగా లీగ్‌లో మార్పులు చేయాలన్నాడు. ఈ లీగ్‌ను రెండున్నర నెలల నుంచి ఆరు నెలల టోర్నీగా మార్చాలని సూచించాడు. ఉతప్ప రెండుసార్లు (కోల్‌కతా, చెన్నై తరపున) ఐపీఎల్ టైటిల్ సాధించిన సంగతి తెలిసిందే. ఐపీఎల్‌లో 205 మ్యాచ్‌లు ఆడి 4,952 రన్స్ చేశాడు. 2014లో కేకేఆర్ ఛాంపియన్‌గా నిలవడంలో కీలకపాత్ర పోషించాడు. ఆ సీజన్‌లో 660 పరుగులు చేసి ఆరెంజ్ క్యాప్ దక్కించుకున్నాడు.**

‘వాళ్లు దీన్ని స్టార్టప్ దశకు మించి తీసుకెళ్లడం లేదు. ఇది ఆశ్చర్యంగా ఉంది. ఐపీఎల్ ప్రపంచంలోనే అగ్రగామి క్రికెట్ లీగ్. మారుతున్న కాలానికి అనుగుణంగా మన ఆలోచనలూ మారాలి. వేలం ప్రక్రియను నిలిపివేసి సంవత్సరం పొడవునా ట్రేడ్ విండోను తెరిచి ఉంచండి. ఆక్షన్‌ను వదిలేసి డ్రాఫ్ట్ సిస్టమ్‌ను తీసుకురండి. నేను ఐపీఎల్ ఆడుతున్నప్పటి నుంచి ఈ విషయం చెబుతున్నా. వారు టీవీ వినోదం గురించే ఆలోచిస్తున్నారు. డ్రాఫ్ట్ విధానం అంతకంటే గొప్పది కావొచ్చు. ఇది అభిమానులను ఆకట్టుకుంటుంది. దీన్ని అమలు చేయండి. అంతేకాకుండా ఐపీఎల్ ఆరు నెలల లీగ్‌లాగా ఉండాలని నేను భావిస్తున్నాను. మధ్యలో అంతర్జాతీయ మ్యాచ్‌లను కలిగి ఉండవచ్చు. కానీ, ఐపీఎల్ అభివృద్ధి చెందాలి’ అని రాబిన్ ఉతప్ప పేర్కొన్నాడు. ఐపీఎల్ 2026 మినీ వేలం అబుదాబిలో డిసెంబరు 16న జరగనుంది.

### ఏమిటీ డ్రాఫ్ట్ సిస్టమ్?

క్రికెట్‌లో డ్రాఫ్ట్ సిస్టమ్ అనేది ఆటగాళ్లను సమాన పద్ధతిలో జట్లకు కేటాయించడానికి ఉపయోగించే ఒక విధానం. అత్యుత్తమ ప్రతిభను కనబర్చిచే క్రికెటర్లపై ఒక ఫ్రాంఛైజీకి గుత్తాధిపత్యం ఉండకుండా జట్ల బలబలాల మధ్య సమతుల్యం తీసుకురావడానికి దీన్ని ప్రవేశపెట్టారు. డ్రాఫ్ట్‌లో అర్హత ఉన్న ఆటగాళ్ల సమూహం నుంచి జట్లు వంతులవారీగా ఎంపిక చేసుకుంటాయి. ఒక జట్టు ఒక ఆటగాడిని ఎంచుకుంటే ఆ ప్లేయర్‌తో ఒప్పందం కుదుర్చుకోవడానికి ప్రత్యేక హక్కులను పొందుతుంది. లీగ్‌లోని ఏ ఇతర జట్టు కూడా ఆ ఆటగాడిని తీసుకోవడానికి వీలు లేదు. బిగ్ బాష్ లీగ్, పాకిస్థాన్ సూపర్ లీగ్, ది హండ్రెడ్ వంటి అనేక లీగ్‌ల్లో ఈ విధానాన్ని అనుసరిస్తున్నారు.



# నీళ్ల సీసాలు అందించి పెద్ద ఇల్లు కట్టుకున్నా..

## భారత మాజీ స్టార్ పార్థివ్ పటేల్ సరదా వ్యాఖ్య

భారత మాజీ వికెట్ కీపర్, బ్యాటర్ పార్థివ్ పటేల్ ఇటీవల ఓ కామెడీ షోలో పాల్గొన్నాడు. ఈ సందర్భంగా నీటి గురించి చర్చ రాగా.. 2003 ప్రపంచ కప్‌లో ఆటగాళ్లకు నీటి సీసాలు మోసుకెళ్లి పెద్ద ఇల్లు కట్టుకున్నానని చమత్కరించాడు. 2002లో భారత్ తరఫున అరంగేట్రం చేసిన పార్థివ్.. 2003 ప్రపంచ కప్‌నకు ఎంపికయ్యాడు. కానీ, ఒక్క మ్యాచ్‌లోను తుది జట్టులో చోటు దక్కించుకోలేకపోయాడు. ఆ టోర్నీ ఫైనల్‌లో భారత్ 125 పరుగుల తేడాతో ఆస్ట్రేలియా చేతిలో ఓడి రన్నరప్‌తో సరిపెట్టుకుంది. ‘నీళ్ల గురించి మాట్లాడకండి. నేను చాలా మ్యాచ్‌ల్లో ‘వాటర్ బాయ్’గా ఉన్నా. రాహుల్ ద్రవిడ్ వికెట్ కీపింగ్ బాధ్యతలు చూస్తున్నప్పుడు డ్రింక్స్ తీసుకెళ్లా. 2003 ప్రపంచకప్ మొత్తం నేను మైదానంలో ఉన్న సహచర ఆటగాళ్లకు నీళ్ల సీసాలు అందించా. కానీ, ఆ సమయంలో నీళ్ల సీసాలు మోసుకెళ్లి పెద్ద ఇల్లు కట్టుకున్నాను’ అని పార్థివ్ చమత్కరించాడు. పార్థివ్ చాలా చిన్న వయసులో అంతర్జాతీయ అరంగేట్రం చేశాడు. 2002లో ఇంగ్లాండ్‌లో భారత్ తరపున తొలి టెస్టు ఆడాడు. టెస్టు క్రికెట్ చరిత్రలో అతి పిన్న వయసులో అరంగేట్రం చేసిన వికెట్ కీపర్ ఇతనే. తన తొలి విదేశీ పర్యటనను గుర్తుచేసుకుంటూ ఇంగ్లాండ్ ప్లేయర్ ఆండ్రూ ఫ్లింటాఫ్ తనను స్లెడ్జ్ చేసినట్లు పార్థివ్ పేర్కొన్నాడు. కానీ, అతను ఏమన్నాడో తనకు అర్థం కాలేదన్నాడు. భారత్ తరఫున 25 టెస్టులు, 38 వన్డేలు, 2 టీ20లు ఆడిన పార్థివ్ పటేల్.. 2018లో చివరి అంతర్జాతీయ మ్యాచ్ (టెస్టు) ఆడాడు. 2020లో అంతర్జాతీయ క్రికెట్‌లో అన్ని ఫార్మాట్‌లకు రిటైర్మెంట్ ప్రకటించాడు.

# ఏఐతో పేదరికం దూరం..

## ఎలాన్ మస్క్ కీలక వ్యాఖ్యలు

ప్రపంచ కుబేరుడు, టెస్లా సీఈఓ ఎలాన్ మస్క్ ఏఐ గురించి కీలక వ్యాఖ్యలు చేశారు. ఏఐ కారణంగా భవిష్యత్‌లో ఉద్యోగం ఆప్షనల్ కానుందన్నారు. డబ్బు కూడా అసంబద్ధంగా మారనుందని పేర్కొన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విస్తృతి, హ్యూమనాయిడ్ రోబోలు పేదరికాన్ని పారదోలుతాయని పేర్కొన్నారు. ఈ మేరకు వాషింగ్టన్‌లో జరిగిన యూఎస్- సౌదీ ఇన్వెస్ట్‌మెంట్ ఫోరమ్‌లో ఆయన మాట్లాడారు. ఆయనతో పాటు ఎన్విడియా సీఈఓ జెన్సెంగ్ హువాంగ్ కూడా పక్కనే ఉన్నారు. దీనికి సంబంధించిన వీడియోను మస్క్ తన ఎక్స్‌లో పోస్ట్ చేశారు. రాబోయే రోజుల్లో చేయడానికి పనులేమీ ఉండబోవని మస్క్ అన్నారు. అందుకు అది పదేళ్లు పట్టొచ్చు.. ఇరవై ఏళ్లు పట్టొచ్చని పేర్కొన్నారు. “చాలా వరకు పనులు ఆప్షనల్‌గా మారనున్నాయి. ఇప్పుడు స్పోర్ట్స్ లేదా వీడియో గేమ్స్ ఎలా ఆడుతున్నామో రేపొద్దున ఉద్యోగం కూడా అంతే. ఉద్యోగం అనేది అవసరం కోసం కాకుండా అభిరుచిని బట్టి చేసే రోజులు రాబోతున్నాయి. భవిష్యత్‌లో అవసరమైన వారు స్టోర్‌కి వెళ్లి కూరగాయలు కొనుక్కుంటారు లేదంటే ఇంటి పెరట్లోనే పండించుకుంటారు. ఇది కష్టతరం అయినప్పటికీ కొందరికి ఆ పని ఇష్టం కాబట్టి ఆ పనిచేస్తారు” అని మస్క్ అన్నారు. ఏఐ వల్ల డబ్బు అవసరం కూడా పెద్దగా ఉండబోదంటూ మస్క్ వ్యాఖ్యానించారు. ఏఐ, రోబోటిక్స్ అనేవి పేదరికాన్ని పూర్తిగా పారదోలుతాయని మస్క్ విశ్వాసం వ్యక్తంచేశారు. పేదరికాన్ని సామాజిక సమస్య కాదని, ఇంజినీరింగ్ సమస్యగా అభివర్ణించారు. దాన్ని ఏఐ సరిచేస్తుందన్నారు. “ఏఐ, రోబోటిక్స్ ప్రాథమిక వస్తువులు, సేవల ఖర్చులు గణనీయంగా తగ్గించబోతున్నాయి. తద్వారా పేదరికం అంతమవుతుంది. పేదరికాన్ని రూపుమాపడానికి ఎన్నో ఎన్జీవోలు తమ వంతు ప్రయత్నం చేస్తున్నప్పటికీ.. వాటివల్ల సాధ్యం కానిది ఏఐ, హ్యూమనాయిడ్ రోబోలతో సాధ్యం కానుంది. ఏఐ, హ్యూమనాయిడ్ రోబోలు అందరినీ ధనవంతులుగా మారుస్తాయి. వీటి తయారీలో టెస్లా అగ్రగామిగా ఉండబోతోంది. ఇతర కంపెనీలు సైతం హ్యూమనాయిడ్ రోబోలను తయారుచేస్తాయి” అని టెస్లా అధినేత వ్యాఖ్యానించారు. ఇదే వేదికపై కూర్చున్న ఎన్విడియా సీఈఓ మాట్లాడుతూ.. ఏఐ వల్ల ఉద్యోగాల్లో గణనీయమైన మార్పు వస్తుందని వ్యాఖ్యానించారు.



## ప్రియాంక మోహన్ మరో సినిమా అప్డేట్

హీరోయిన్ ప్రియాంక మోహన్ తమిళం, తెలుగు అండ్ కన్నడ భాషల్లో నటిస్తున్న తనకంటూ స్పెషల్ ఈమేజ్‌ను సొంతం చేసుకుంది. పవన్ కల్యాన్, నాని, ధనుష్, శివకార్తికేయన్ వంటి స్టార్ హీరోలతో నటించిన ఈ బ్యూటీ.. ప్రజెంట్ ఇండస్ట్రీలో మోస్ట్ వాంటెండ్ హీరోయిన్‌గా దూసుకుపోతుంది. ఇదిలా ఉంటే.. తాజాగా ఈ హీరోయిన్ బర్త్‌డే కావడంతో మరో సినిమా అప్డేట్ వచ్చింది. డాక్టర్ శివ రాజ్ కుమార్ ధనంజయ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న లేటెస్ట్ మూవీ ‘666 ఆపరేషన్ డ్రీమ్ థియేటర్’. హేమంత్ ఎం. రావు దర్శకత్వంలో వస్తోన్న ఈ చిత్రంలో హీరోయిన్‌గా ప్రియాంక మోహన్‌ను ఫిక్స్ చేసినట్లు చిత్ర బృందం అఫీషియల్ అనౌన్స్‌మెంట్ ఇచ్చింది. ఈ సందర్భంగా ప్రియాంక మాట్లాడుతూ.. ‘నేను శివ రాజ్ కుమార్ సర్ సినిమాలు చూస్తూ పెరిగాను. ‘666 ఆపరేషన్ డ్రీమ్ థియేటర్’లో భాగం కావడంతో నా కల నిజమైంది. అలాగే మోస్ట్ టాలెంటెడ్ నటుడు ధనంజయతో కలిసి పనిచేయడం, ఈ యూనిట్‌లో చేరడం చాలా సంతోషంగా ఉంది. హేమంత్ ఎం రావుతో కలిసి పనిచేయడం కోసం నేను ఎంతో ఈగర్‌గా వెయిట్ చేస్తున్నాను’ అని తెలిపింది. కాగా.. భారీ బడ్జెట్‌తో రూపొందుతోన్న ఈ చిత్రం తెలుగు అండ్ కన్నడ భాషలలో ఒకేసారి విడుదల చేసేందుకు ప్లాన్ చేస్తున్నారు మేకర్స్.



## ఏఐ మార్ఫింగ్ ఫోటోలతో నష్టం

### ఆందోళన వ్యక్తం చేసిన నటి కీర్తి సురేశ్

తన పేరుతో ఆన్‌లైన్‌లో సర్కులేట్ అవుతున్న ఎఐ మార్ఫింగ్ చిత్రాలపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేసింది అగ్ర కథానాయిక కీర్తి సురేష్. డీప్‌ఫేక్ టెక్నాలజీ ద్వారా రూపొందించబడిన ఈ నకిలీ ఫోటోలు తనను మానసికంగా బాధిస్తున్నాయని కీర్తి తెలిపింది. ఈ సందర్భంగా సోషల్ మీడియా వేదికగా పోస్ట్ పెట్టింది. మార్ఫింగ్ చిత్రాలు నా మనసుకి చాలా బాధ కలిగించడమే కాకుండా.. చాలా విసుగు పుట్టిస్తున్నాయి. ఈ కృత్రిమ మేధస్సుతో క్రియేట్ నకిలీ చిత్రాలు ఎంత నమ్మేలా ఉన్నాయంటే వాటిని చూసినప్పుడు నిజంగానే నేను అలా ఫోజు ఇచ్చానా? అని తనకు తాను ప్రశ్నించుకునే పరిస్థితి వచ్చిందని కీర్తి పేర్కొన్నారు. ఇది ఏఐ సాంకేతికత ఎంత ప్రమాదకరంగా మారిందో తెలియజేస్తుందని కీర్తి తెలిపారు. ఎఐ సాంకేతికత సామర్థ్యాలు నానాటికీ పెరుగుతున్నాయని వీటిని నియంత్రించడం కష్టంగా మారుతోందని కీర్తి సురేష్ ఆందోళన వ్యక్తం చేశారు. తమ అనుమతి లేకుండా తమ ఇమేజ్‌లను దుర్వినియోగం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైన ఉందని. ఈ సమస్య కేవలం సినీ పరిశ్రమకు మాత్రమే పరిమితం కాలేదని సోషల్ మీడియా, డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లలో ఉండే ఎవరికైనా ఇది ముప్పుగా పరిణమించే అవకాశం ఉందని కీర్తి హెచ్చరించారు. ఇక కీర్తి సురేష్ ఆవేదనకు మద్దతుగా నటి ఆండ్రియా జెరెమియా కూడా ఎఐ వల్ల కలిగే నష్టాల గురించి మాట్లాడారు. రష్మిక మందన్న, సమంత వంటి పలువురు నటీమణులు కూడా ఇలాంటి డీప్‌ఫేక్ లేదా మార్ఫింగ్ చిత్రాల బారిన పడ్డారు. ఇప్పుడు కీర్తి సురేష్ కూడా దీనిపై గళం విప్పడం, ఎఐ దుర్వినియోగం పై మరింత కఠినమైన చట్టాలు తీసుకురావాల్సిన అవసరాన్ని సూచిస్తోంది.

## సమస్య మీలోనే ఉంది..


### ట్రోలర్స్‌కు రాజ్‌కుంద్రా కౌంటర్



శిల్పాశెట్టి దంపతులు కొన్ని రోజులుగా వరుసగా వార్తల్లో ఉంటోన్న విషయం తెలిసిందే. తాజాగా వారు మరోసారి హాట్‌టాపిక్‌గా మారారు. ఇటీవల శిల్పాశెట్టి బాలీవుడ్ సెలబ్రిటీలతో కలిసి ఆధ్యాత్మిక గురువు ధీరేంద్ర కృష్ణశాస్త్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఒక పాదయాత్రలో పాల్గొన్నారు. ఈ పాదయాత్రకు సంబంధించిన ఫొటోలను షేర్ చేస్తూ కొందరు ట్రోల్ చేయడం ప్రారంభించారు. ‘ఇందులో పాల్గొన్న చాలా మంది సెలబ్రిటీలపై కేసులు ఉన్నాయి. ప్రజల్లో మంచి పేరు తెచ్చుకోవడం కోసం ఇలా పాదయాత్రలు చేస్తున్నారు’ అని విమర్శిస్తూ పోస్ట్ పెట్టారు. ఆ పోస్ట్‌కు రాజ్‌కుంద్రా ఘాటుగా స్పందించారు. “చీకటిలో ఉండాలనుకునేవారు ఎప్పటికీ ఇలానే నిందలు వేస్తూ ఉంటారు. ఆరోపణలు వచ్చినంత మాత్రాన శిక్ష పడినట్లు కాదనే నిజాన్ని ట్రోల్ చేసే వారు మర్చిపోతున్నారు. కొందరు ఎప్పుడూ శాంతిని కోరుకుంటారు. మరికొందరు ఎప్పటికీ ఇలా ట్రోల్ చేస్తూనే ఉంటారు. సనాతనధర్మం కోసం నిలబడటం, భక్తిని ప్రదర్శించడం, ఆధ్యాత్మిక లక్ష్యానికి మద్దతు ఇవ్వడం మిమ్మల్ని బాధ పెడుతుంటే సమస్య మీలోనే ఉన్నట్లు అర్థం. మాకు అలాంటి విషయాలు ఎప్పటికీ సమస్యగా అనిపించవు. అయినా.. చట్టం తన పని తాను చేసుకుంటుంది. నిజం బయటకు రావడానికి కొంత సమయం పడుతుంది. ఈలోపు మీలాంటివారు ఇలా స్క్రీన్‌షాట్‌లు తీసుకుంటూ జీవించండి” అని రాజ్ కుంద్రా రిప్లై పెట్టారు. ఇటీవల శిల్పా శెట్టి దంపతులపై కేసు నమోదైన విషయం తెలిసిందే. పెట్టుబడి ఒప్పందానికి సంబంధించి రూ.60 కోట్లు మోసం చేశారని శిల్పా శెట్టి, రాజ్ కుంద్రాలపై దీపక్ కొఠారి అనే వ్యక్తి ఫిర్యాదు మేరకు జుహు పోలీసులు కేసు నమోదు చేశారు.

## రజనీకి హెచ్‌టి అత్యున్నత గౌరవం

### 50 ఏళ్ల సినీ ప్రస్థానంపై ఫ్రంట్ పేజీలో ఫోటో



అగ్ర కథానాయకుడు రజనీకాంత్‌కు అరుదైన గౌరవం దక్కింది. ప్రముఖ ఆంగ్ల పత్రిక హిందుస్థాన్ టైమ్స్ ఫ్రంట్ పేజీలో ఆయన ఫొటోను ముద్రించారు. ఈ పత్రిక స్థాపించిన వందేళ్లలో ఇలా ఒక పేజీ మొత్తం హీరో ఫొటోను ముద్రించడం తొలిసారి కావడం విశేషం. రజనీకాంత్ ఇండస్ట్రీకి వచ్చి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా హిందుస్థాన్ టైమ్స్ తలైవాను ఇలా గౌరవించింది. సినీ ఇండస్ట్రీని ఎంతో ప్రభావితం చేసిన వ్యక్తికి ఇలాంటి గౌరవాన్ని కల్పించడం ఆనందంగా ఉందని పత్రిక పేర్కొంది. నవంబర్ 19న పేపర్‌లో రజనీ ఫొటో చూసి పాఠకులు ఆశ్చర్యపోయారు. ఇది ఆయనకు ఇచ్చిన గొప్ప గౌరవం అంటూ ఆనందం వ్యక్తంచేశారు. దీనిపై రజనీకాంత్ కూడా స్పందించారు. అద్భుతమైన సర్‌ప్రైజ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. తన హృదయం ఆనందంతో నిండిపోయిందన్నారు. తనపై చూపుతోన్న ప్రేమాభిమానులకు ధన్యవాదాలు తెలిపారు. 1975లో అపూర్వ రాగంగళ్‌తో సినీ రంగప్రవేశం చేసిన రజనీకాంత్ ఎన్నో హిట్ సినిమాల్లో నటించి తన స్టైల్‌తో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. కోట్ల మంది అభిమానులను సొంతం చేసుకున్నారు. ఈ నెలలో గోవా వేదికగా జరగనున్న 56వ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ ఇండియా (ఇఫి 2025) ముగింపు వేడుకల్లో రజనీకాంత్‌ను సన్మానించనున్నారు.

## చిరాకు పుట్టిస్తున్న ప్రీరిలీజ్ ఈవెంట్లు

### నటుడు, దర్శకుడు రవిబాబు



తనకు సినిమాలు మార్కెటింగ్ చేసుకోవడం రాదని నటుడు, దర్శకుడు రవిబాబు తెలిపారు. ప్రీరిలీజ్ ఈవెంట్‌లు చిరాకు తెప్పిస్తాయన్నారు. అలాంటి ఈవెంట్‌లు పెట్టి నటీనటులను అవసరానికి మించి పొగుడుతూనే ఉంటారని అలా ఎందుకు చేస్తారో ఇప్పటికీ తనకు అర్థం కాదన్నారు. అందుకే తాను ఈవెంట్‌లకు రానని చెప్పారు.కొన్ని సినిమాల్లో నన్ను విలన్‌గా చూసినవారు ఇప్పటికీ నేను ఎదురుగా కనిపిస్తే భయంతో వెళ్లిపోతున్నారు. సినిమాలు ప్రేక్షకులపై అంతగా ప్రభావం చూపుతాయి. అందుకే సున్నితమైన అంశాలను తెరకెక్కించేటప్పుడు మరింత జాగ్రత్త వహించాలని రవిబాబు చెప్పారు. తనకు మార్కెటింగ్ చేసుకోవడం తెలియదని దర్శకుడు రవిబాబు అన్నారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ కొన్ని ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. హాస్యం కూడా ప్రాంతాన్ని బట్టి మారుతుందన్నారు. అందుకే తాను ఎక్కువగా విజువల్స్‌కు ప్రాధాన్యం ఉండేలా చూస్తానన్నారు.




## నేడు థియేటర్లలోకి అల్లరి నరేశ్ 12ఎ రైల్వే కాలనీ

టాలీవుడ్ యాక్టర్ అల్లరి నరేశ్ కాంపౌండ్ నుంచి వస్తోన్న థ్రిల్లర్ ప్రాజెక్ట్ 12ఎ రైల్వే కాలనీ. నాని కాసరగడ్డ దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీలో డాక్టర్ కామాక్షి భాస్కర్ల హీరోయిన్‌గా నటిస్తుంది. ఈ చిత్రం 21న శుక్రవారం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో ఇప్పటికే అల్లరి నరేశ్ టీం ప్రమోషన్స్‌లో బిజీగా ఉంది.కాగా ఈ సస్పెన్స్ థ్రిల్లర్ ఇంకా థియేటర్లలోకి రాకముందే ఓటీటీ పార్ట్‌నర్‌ను ఫిక్స్ చేసుకుంది. ఈ మూవీ ఓటీటీ రైట్స్‌ను పాపులర్ ఓటీటీ ప్లాట్‌ఫాం అమెజాన్ ప్రైం వీడియో భారీ మొత్తానికి దక్కించు కున్నట్టు టాలీవుడ్ సర్కిల్ సమాచారం. థియాట్రికల్ రన్ తర్వాత మేకర్స్ ఓటీటీ రిలీజ్ డేట్‌పై క్లారిటీ ఇవ్వనున్నారు. 12ఎ రైల్వే కాలనీలో సాయికుమార్, వైవా హర్ష, గెటప్ శ్రీను, సద్దాం, గగన్ విహారి, అనిష్ కురువిల్లా, మధుమణి కీలక పాత్రలు పోషిస్తున్నారు. భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్నాడు. శ్రీనివాస సిల్వర్ స్క్రీన్ బ్యానర్‌పై శ్రీనివాస్ చిట్టూరి నిర్మిస్తున్న ఈ మూవీకి పొలిమేర, పొలిమేర 2 ఫేం డాక్టర్ అనిల్‌విశ్వనాథ్ కథ, స్క్రీన్‌ప్లే, సంభాషణలు సమకూరుస్తున్నారు. క్కువగా కామెడీ సినిమాలెందుకు చేయడం లేదని ప్రమోషన్స్‌లో అల్లరి నరేశ్‌ను ప్రశ్నించగా .. దీనికి అల్లరి నరేశ్ స్పందిస్తూ.. కామెడీ సినిమాలు తీయాలంటే ఇప్పుడు చాలా కష్టతరమైన పరిస్థితులు ఉన్నాయి. మేం ఒకవేళ ఇప్పుడు కితకితలు చేస్తే.. బాడీ షేమింగ్‌తో సినిమాను పక్కన పెట్టేస్తారు. ఇప్పుడు కొన్ని విషయాలు చాలా సున్నితంగా మారాయి. కొంతమంది మనోభావాలు దెబ్బతినే అవకాశముంది. ఈ రోజుల్లో మనం కలర్, బరువుతోపాటు ఇతర సున్నిత అంశాలపై మాట్లాడకూడదన్నాడు. ప్రేక్షకుల అభిరుచి ప్రతీ పది సంవత్సరాల కోసారి మారుతూ వస్తుంది. నేను గతంలో రైమింగ్ డైలాగ్స్, కౌంటర్స్‌తో సాగేకామెడీ సినిమాలు చేసేవాడిని. సుడిగాడు స్పూఫ్ సినిమా.ప్రేక్షకులు కూడా ప్రతీ కంటెంట్‌పై స్పూఫ్స్ చేస్తూ వాటిని సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తున్నారు. జోకులు ఖచ్చితంగా ఆర్గానిక్‌గా ఉండాలి. వాటిని సోషల్ మీడియా మీమ్స్‌ను నుంచి అస్సలు కాపీ చేయొద్దు. జనాలు ఇప్పుడు ఆర్గానిక్‌గా ఉండే సెన్సిబుల్ కామెడీని ఆశిస్తున్నారని చెప్పుకొచ్చాడు అల్లరి నరేశ్.

## అమీర్‌పేటలో అర్ధనగ్నంగా తిరుగుతా

### రాజు వెడ్స్ రాంబాయి డైరెక్టర్ సాయిలు



అఖిల్ రాజ్, తేజస్వి రావు జంటగా నటించిన రాజు వెడ్స్ రాంబాయి నవంబర్ 21న శుక్రవరాం రిలీజ్‌కి సిద్ధం అవుతోంది. ఈటీవీ విన్ ఒరిజినల్స్ బ్యానర్‌పై రూపొందిన ఈ సినిమాకు సాయిలు కంపాటి స్టోరీ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం స్వయంగా నిర్వహించారు. ఇప్పటికే విడుదలైన ప్రతి అప్‌డేట్ మంచి అంచనాలు తీసుకొచ్చింది. అయితే తాజాగా జరిగిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో సాయిలు చేసిన కామెంట్స్ మాత్రం టాలీవుడ్‌లో పెద్ద చర్చగా మారాయి. మా సినిమా చిన్నదైనా, దాని వెనక ఉన్న ఎమోషన్ చాలా పెద్దది. పల్లెటూరి కథలు, అమాయకమైన ప్రేమ, ఊర్లో జరిగే నిజ జీవిత సంఘటనలు నాకు తెలుసు. నేను విమానం నుంచి దిగి వచ్చే హీరోల కథలు రాయలేదు. మన దగ్గర జరిగిన నిజమైన కథను తీసుకొచ్చా. ఈ సినిమా 15 ఏళ్ల పాటు నరకం చూసిన ఒక జంట నిజ జీవితాన్ని ఆధారంగా చేసుకున్నదని దర్శకుడు చెప్పారు. అలాగే సోషల్ మీడియాలో నెగిటివ్ ప్రచారం చేయొద్దు, సినిమా నచ్చకపోతే వదిలేయండని అభిమానులకు కోరుతూ.. మా టీమ్ ఎంత కష్టపడిందో మీకు సినిమా చూస్తే అర్థమవుతుంది. మన కష్టానికి తగిన ఫలితం తప్పకుండా వస్తుందని అంటూ విశ్వాసం వ్యక్తం చేశారు. అలాగే సోషల్ మీడియాలో నెగిటివ్ ప్రచారం చేయొద్దని కోరుతూ.. ఈ సినిమాకు నెగెటివ్ టాక్ వస్తే అమీర్‌పేట్ సెంటర్‌లో అర్ధనగ్నంగా తిరుగుతా! అని ప్రకటించడం అందరినీ ఆశ్చర్యపరిచింది. సినిమా టీమ్ కష్టాన్ని నమ్మి ఇలాంటి ఛాలెంజ్ చేస్తున్నానని చెప్పారు. సాయిలు కంపాటి స్టేట్‌మెంట్ నేపథ్యంలో ఇప్పుడు అందరి దృష్టి సినిమాపైనే పడింది.

## 99లకే రాజు వెడ్స్ రాంబాయి టిక్కెట్

టాలీవుడ్ నుంచి రాబోతున్న తాజా చిత్రం రాజు వెడ్స్ రాంబాయి. ఈ సినిమా శుక్రవారం 21నప్రేక్షకుల ముందుకు రాబోతుండగా.. ఈ మూవీపై బంపరాఫర్‌ని ప్రకటించింది చిత్రయూనిట్. ఈ సినిమా టికెట్ ధరను తగ్గించినట్లు చిత్రబృందం ప్రకటించింది. దీంతో సింగిల్ థియేటర్‌లలో ఈ చిత్రం రూ.99లకే అందుబాటులో ఉండబోతుండగా.. మల్టీప్లెక్స్‌లలో రూ.105గా నిర్ణయించినట్లు చిత్రబృందం తెలిపింది. తెలంగాణ రూరల్ బ్యాక్‌డ్రాప్‌లో రాబోతున్న ఈ చిత్రంలో అఖిల్, తేజస్విని జంటగా నటిస్తుండగా.. సాయిలు కంపాటి దర్శకత్వం వహిస్తున్నాడు. ఈ సినిమాను వేణు వుడుగుల నిర్మిస్తుండగా.. బన్నీ వాసు, వంశీ నందిపాటి ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నారు.

Printed, Published and Owned by **RAVU RAJITHA**, Printed at **KAKATHIYA PRINTERS**, LN Colony, Uppal IDA, Uppal. **Editor: RAVU NAGI REDDY**. **RAJAMUDRA PUBLICATIONS**, Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98, **RNI NO : TELTEL/2024/86684**, Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com